: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

16-8-2026
ఆదివారం
సంపుటి: 32
సంచిక: 197
పేజీలు: 8+4
వెల: 8.00



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శనివారం అమరావతిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న సిఎం చంద్రబాబు, సిఎస్ సాయి ప్రసాద్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా



శనివారం ఎర్రకోట నుండి జాతినుద్దేశించి స్వాతంత్ర్యదినోత్సవ ప్రసంగం చేస్తున్న ప్రధాని మోడీ

### ఏడు రంగాల వృద్ధితో దేశం సుసంపన్నం
### మావోయిజాన్ని అంతం చేయగలిగాం
### డిజిటల్ యుగంలో చిప్‌లకు పెరిగిన ప్రాధాన్యం
### కరోనా, యుద్ధాలను దాటి ముందుకు వచ్చాం
### దేశంలోని 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్
### గత పన్నెండేళ్లలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి
### ఎర్రకోట స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోడీ

# వికసిత్ భారత్‌కు 'సప్తధార'

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** సప్తధార శక్తి సామర్థ్యాలతో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తామని భారతావనికి నూతన వేగం అందిస్తామని, సరికొత్త లక్ష్యాలను సాధించి, వాటిని అధిగమించేలా శక్తి వంతం చేస్తామని ప్రధానిమోడీ అన్నారు. తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతి శక్తి, రక్ష శక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్‌అనే ఏడుధారల సాయంతో దేశాన్ని స్వయం సమృద్ధం చేస్తామన్నారు. నేడు ప్రతి హృదయం వందేమాతరం నినాదంతో మార్మోగుతోందని ప్రధాని పేర్కొన్నారు. 80వ భారత స్వాతంత్ర్య వేడుకల నేపథ్యంలో శనివారం ఉదయం ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగించారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురుతోందన్నారు. ఎందరో వీరుల బలిదానాల ఫలితమే స్వాతంత్రం అని వివరించారు. తొలిసారిగా ఎర్రకోట వద్ద వందే మాతరం గీతాన్ని ఆలపించామని అన్నారు. దేశం కొత్త ఉత్సాహంతో ముందుకెళ్తోందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా ఎదుగుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. సంకల్పం దృఢంగా ఉంటే కఠిన సవాళ్లను సునాయాసంగా ఎదుర్కోవచ్చు >>2

# చేతిలో జాతీయ జెండా.. గుండెలో బలమైన అజెండా

### విధ్వంసం నుండి వికాసం వైపు అడుగులు, ఇక వైభవం వైపు ప్రయాణం
### శాంతియుత వాతావరణం, పెట్టుబడులకు భద్రత అవసరం
### 80వ స్వాతంత్ర్య వేడుకల్లో సిఎం చంద్రబాబు

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** మన చేతిలో జాతీయ జెండా ఉండాలి, గుండెల్లో దేశం కోసం బలమైన అజెండా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలుగెత్తి చాటారు. 2047 నాటికి వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాకారందేశం మనకు హక్కులు, గుర్తింపు, గౌరవం తీసుకొచ్చిందన్నారు. నా దేశం, నా బాధ్యత అని ముందుకుసాగాలని సూచించారు. దేశం నాకు ఏం చేసిందని కాదు, దేశానికి నేను ఏం చేయగలనని అందరూ ఆలోచించాలని కోరారు. 2047 నాటికి వికసిత్ భారత్ స్వర్ణాంధ్ర సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 100 యేళ్ల స్వాతంత్ర్య వేడుకల నాటికి దేశం, రాష్ట్రం స్వాతంత్ర్యం నుంచి సమృద్ధి వైపు వికాసం నుంచి వైభవం వైపు ముందుకుసాగాలన్నారు. ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఐక్యంగా కలిసి అడుగులు వేద్దామని చంద్రబాబు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిలోని రాయపూడి పరేడ్ మైదానంలో తొలిసారిగా నిర్వహించిన 80వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్యమంత్రి హాజరై జాతీయజెండాను ఎగురవేశారు. సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా స్వాతంత్ర్య వేడుక జరిగే వేదిక వద్దకు సిఎం కాన్వాయ్‌తో పాటు బుల్లెట్ ఎస్కార్టు వచ్చింది. డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులు సిఎంకు స్వాగతంపలికారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం సమర్పించారు. పోలీసు దళాలు ముఖ్యమంత్రికి గౌరవవందనం సమర్పించారు. ఎపిఎస్పీ సహా >>2

# ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని..

### అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం: మంత్రి లోకేష్

**విజయవాడ, ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అందరం కలిసి స్వర్ణాంధ్ర సాధనకు ప్రతిన బూనుదామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. అందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఈ రోజు దేశం అంతా ఒక్కటే పండుగ. కులం లేదు, మతం లేదు, ప్రాంతం లేదు. అందరూ కలిసి జరుపుకునే ఒకే ఒక్క పండుగ జెండా పండుగ. ఈ రోజు దేశం మొత్తం జాతీయ జెండా గర్వంగా ఎగురుతుంది. ఆ జెండా మనందరి గుండె చప్పుడు. జెండా పండుగ నాకు ఒక పర్సనల్ ఎమోషన్. ఇక్కడ విద్యార్థులను చూసిన తర్వాత నా స్కూల్ డేస్ >>2



మహిళలతో బస్సులో ప్రయాణిస్తున్న సిఎం చంద్రబాబు

# 'స్త్రీ శక్తి'కి నీరాజనం

### మహిళలు వివిధ రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం అండ
### మహిళలతో కలిసి బస్సులో ప్రయాణించిన సిఎం చంద్రబాబు
### వారి కుటుంబ పరిస్థితులపై ఆరా

**విజయవాడ.ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** స్త్రీలు స్వయం శక్తి రంగాల్లో గణనీయ అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. మహిళల సామాజిక, ఆర్థిక పురోభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్త్రీ శక్తి' ఉచిత బస్సు ప్రయాణ పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా 'స్త్రీ శక్తి'కి యేడాది రెట్టింపైన ఆత్మగౌరవం పేరిట వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రాజధానిలోని పరేడ్ గ్రౌండ్స్ నుంచి సీడ్ యాక్సిస్ రోడ్ మీదుగా సిఎం క్యాంప్ కార్యాలయం వరకు మహిళలతోకలిసి సిఎం బస్సులో ప్రయాణించారు. ప్రయాణంలో >>2






శనివారం అమరావతిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పోలీసు అధికారులకు, మహిళా అదికారులకు అవార్డులు అందజేస్తున్న సిఎం చంద్రబాబు






శనివారం అమరావతిలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో అవార్డులు పొందిన శకటాలు

# గుండెలో బలమైన అజెండా

>> వివిధ పోలీసు దళాల సన్నద్ధతను సిఎం సమీక్షించారు. పోలీసు బలగాలు, ఎన్సీసీ క్యాడెట్లు, సిఆర్‌పిఎఫ్, కర్ణాటక పోలీసు దళం మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ తెలుగునేల కూడా స్వాతంత్ర్య సమరంలో తనదైన ముద్ర వేసిందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఎపి ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితమే మన స్వాతంత్ర్యమని అన్నారు. వారి త్యాగాలకు నిజమైన నివాళి అంటే దేశ భవిష్యత్తును మరింత గొప్పగా నిర్మించడమేనన్నారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడు అమరావతి నా రాజధాని అని గర్వంగా చెప్పుకునేలా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉంటామని హెచ్చరించారు. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే అదే వారికి చివరి రోజు అవుతుందని సిఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు 26 నెలల్లో సాగునీటి ప్రాజెక్టుల కోసం దాదాపు రూ. 25 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. వచ్చే మూడేళ్లలో రూ. 35 వేల కోట్లతో 36 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇరిగేషన్ క్యాలెండర్ విడుదల చేశామని తెలిపారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్‌గా, బ్లూ సిటీ, గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ కార్బన్ న్యూట్రల్, నో పోల్ సిటీ, డీప్ టెక్ క్యాపిటల్‌గా అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా నిర్మాణమవుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతియుత వాతావరణం, పెట్టుబడులకు భద్రత కావాలని అన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే చట్టం తన పని తాను చేయాలని అన్నారు. స్వాతంత్ర్యం మనల్ని ఐక్యం చేసిందని, స్వర్ణాంధ్ర మనల్ని దేశంలో నెంబర్ వన్ శక్తిగా నిలబెడుతుందని చంద్రబాబు ఆకాంక్షించారు.

**10 సూత్రాలతో విజన్ సాకారం**

రాష్ట్రంలో 3 ప్రాంతాలు ఎదిగి, ప్రతీ జిల్లా ప్రగతి సాధించటమే నిజమైన అభివృద్ధి అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సామాజిక న్యాయం జరిగినప్పుడే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా ముందుకెళ్తున్నామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఎపి లక్ష్యం కోసం 10 సూత్రాలు రూపొందించుకున్నామని సిఎం అన్నారు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ ఉపాధి కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత ఫార్మర్ అగ్రిటెక్, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ అనే ఈ 10 సూత్రాలతో విజన్ సాకారం చేద్దామని చంద్రబాబు ఆకాంక్షించారు. లక్ష్యాలకు తగ్గ కార్యాచరణలో భాగంగా ప్రతి నియోజకవర్గాన్ని ఒక అభివృద్ధి యూనిట్‌గా తీసుకుని విజన్ యాక్షన్ ప్లాన్‌లు రూపొందించామన్నారు. 201419 మధ్య 13.5 శాతంగా ఉన్న రాష్ట్ర వృద్ధి రేటు, 201924 మధ్య 10.3 శాతానికి పడిపోయిందని విమర్శించారు. అన్ని వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడంతో వృద్ధి రేటు 11.3 శాతానికి పెరిగిందని సీఎం చంద్రబాబు తెలిపారు.

**రాష్ట్రంలో అర్హులందరికి 2029 నాటికి అందరికీ ఇళ్లు**

నవ్యాంధ్ర యువత ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. యువత కలలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ప్రభుత్వం సృష్టించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని అద్భుతాలు సృష్టించాలని సూచించారు. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సాయం అందేలా ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా పనిచేస్తున్నామన్నారు. ఎన్నికల హామీలో చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామని సిఎం వెల్లడించారు. తల్లికివందనం సాయాన్ని ఖర్చులా చూడకుండా పిల్లల భవిష్యత్‌పై పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. బిసిలకు తమ ప్రభుత్వం ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని తెలిపారు. దశాబ్దాలుగా ఎస్సీలు కోరుకున్న వర్గీకరణను అమలు చేశామన్నారు. 2029 నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలనేది తమ లక్ష్యమని స్పష్టంచేశారు. ప్రభుత్వ భూముల్లో ఎన్నో యేళ్లుగా నివసిస్తున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు.

**శాంతిభద్రతలతోనే అభివృద్ధి:**

అభివృద్ధి కావాలంటే శాంతియుత వాతావరణం ఉండాలి అన్నారు. పెట్టుబడులు రావాలంటే భద్రత కావాలి. ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే చట్టం తన పని తాను చేయాలి. అందుకే పోలీసులకు ప్రజా భద్రతలో పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం అన్నారు. విజిబుల్ పోలీసింగ్....ఇన్విజిబుల్ పోలీస్ అనే విధానం అనుసరిస్తున్నాంపోలీసు శాఖలో టెక్నాలజీ... డ్రోన్లు.. విస్తృతంగా వినియోగిస్తున్నాం. వీటి ఫలితాలు కనిపిస్తున్నాయి అన్నారు. నేరస్తులను వేగంగా గుర్తించడంతో పాటు, అంతే వేగంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నాం. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిపై కఠినంగా ఉంటాం. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడితే. అదే వారికి చివరి రోజు అవుతుందని హెచ్చరిస్తున్నాం. ఈగల్ టాస్క్ ఫోర్స్ ద్వారా గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపాం. పోలీసుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యం ఇచ్చాం. వారికి రూ.427 కోట్ల బకాయిలు చెల్లించాం అన్నారు.

**స్వాతంత్రం నుంచి స్వర్ణాంధ్ర వరకు**

స్వాతంత్రం మనకు హక్కులు ఇచ్చిందని సిఎం అన్నారు. స్వర్ణాంధ్ర మనకు, మన పిల్లలకు బంగారు భవిష్యత్ ఇస్తుంది. స్వాతంత్రం మనకు అవకాశాలు ఇచ్చింది. స్వర్ణాంధ్ర ఆ అవకాశాలను ఆర్థిక శక్తిగా మారుస్తుంది. స్వాతంత్రం మనల్ని ఐక్యం చేసింది...స్వర్ణాంధ్ర మనల్ని దేశంలో నెంబర్ వన్ శక్తిగా నిలబెడుతుంది. 2024లో రాష్ట్ర పునర్నిర్మాణాన్ని ప్రారంభించాం. 2047 నాటికి అంతా గర్వించే స్వర్ణాంధ్రను నిర్మిద్దాం. ఇది కేవలం ప్రభుత్వ లక్ష్యం కాదు. ఇది ఐదున్నర కోట్ల ఆంధ్రుల సంకల్పం కావాలని పిలుపునిస్తున్నాను. ఇది మన పిల్లల భవిష్యత్ కోసం మన బాధ్యత. ఇది మన తరానికి వచ్చిన చారిత్రక అవకాశం. విధ్వంసం నుంచి వికాసం వైపు అడుగులు వేశాం. ఇక వికాసం నుంచి వైభవం వైపు ప్రయాణిద్దాం. సంక్షోభం నుంచి స్థిరత్వానికి వచ్చాం స్థిరత్వం నుంచి స్వర్ణాంధ్ర వైపు సాగుదాం..ఈ సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు ఆత్మవిశ్వాసంతో... అంకితభావంతో ప్రతి రోజూ పనిచేద్దాం అన్నారు.. మన సంకల్పం ఒక్కటే...భారత్ ప్రపంచంలో నంబర్‌వన్ కావాలి. ప్రపంచంలో తెలుగుజాతి నెంబర్ వన్‌గా నిలవాలి వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం! స్వర్ణాంధ్రను సాధిద్దాం అంటూ ప్రసంగం ముగించారు.

# స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న శకటాల ప్రదర్శనలో అవార్డులు

**విజయవాడ.ఆగస్టు 15.ప్రభాతవార్తప్రతినిధి:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి,. సంక్షేమ రంగాలపై రాష్ట్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులను వివిధ ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన నిర్వహించారు. భాషా, సాంస్కృతిక శాఖ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ, రెవెన్యూ శాఖ, అటవీ శాఖ, పర్యాటక శాఖ, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, ఇంధన శాఖ, రవాణా శాఖ, ఎపిఎస్‌ఆర్టీసీ, మహిళలు, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ, ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, జల వనరుల శాఖ, పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష, ఉన్నత విద్యా శాఖ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, చేనేత, జౌళి శాఖ, ఎపిసిఆర్‌డిఎ, అమరావతి, గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలు, పరిశ్రమల శాఖ, ప్రణాళిక శాఖ, దేవాదాయ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ, గనులు, భూగర్భ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ వంటి దాదాపు 25 శాఖల నుండి వచ్చిన శకటాల ప్రదర్శనలో వికసిత భారత్ నిర్మాణంలో విద్యా విప్లవం అంటూ సాగిన విద్యా సమగ్ర శిక్ష శకటానికి, ఉద్యానవన శాఖల శకటానికి సంయుక్తంగా ప్రథమ బహుమతి లభించింది. ద్వితీయ బహుమతిగా నేతన్నల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న చేనేత, జౌళి శాఖకు లభించింది. అడవులను రక్షించండి, వన్య ప్రాణులను కాపాడండి అంటూ హరితాంధ్ర లక్ష్యంగా చేసుకుని సాగిన అటవీ శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ శాఖలు, పోలీసు, భద్రతా బలగాలు ప్రదర్శించిన క్రమశిక్షణ, ప్రతిభ, రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించే శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. విజేతలుగా నిలిచిన బృందాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. అయితే, ఈ కార్యక్రమం అనంతరం శకటాలను రాజధాని ప్రాంత గ్రామాల్లో ప్రదర్శించారు. శనివారం మధ్యాహ్నం నుంచి మల్కాపురం, వెలగపూడి, మందడం, వెంకటపాలెం, ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయ పాలెం గ్రామాల్లోని ప్రధాన రహదారుల మీదుగా శకటాల ప్రదర్శన కొనసాగింది. రంగురంగుల అలంకరణలతో రూపొందించిన శకటాలు గ్రామాల మీదుగా సాగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. వీటి ద్వారా ఆయా ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను శకటాలపై ప్రదర్శించిన తీరు పలు గ్రామస్థులను ఆకట్టుకుంది. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా శకటాల ప్రదర్శన సాగడంతో ప్రజలకు సమాచారం చేరువైనట్లయింది. వీటిని తిలకించేందుకు రాజధాని గ్రామాల ప్రధాన రహదారులపైకి పెద్ద సంఖ్యలో ప్రజలు పోటెత్తారు. కాగా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం నిర్వహించిన ఈ శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# 'స్త్రీశక్తి'కి నీరాజనం

>> మహిళల యోగక్షేమాలు, కుటుంబ స్థితిగతులను ఆయన ఆరా తీశారు. అనంతరం వారితో కలిసి హైటీ (తేనేటి విందు) కార్యక్రమంలో పాల్గొని, వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో సిఎం ముఖాముఖి మాట్లాడారు. స్త్రీ శక్తి పథకం ప్రారంభించి నేటితో యేడాది అయింది... ఇప్పటి వరకు 87 కోట్ల ప్రయాణాలు జరిగాయని సిఎం అన్నారు. వివిధ ప్రాంతాలకు ఉచితంగా మహిళలు వెళ్లే వెసులుబాటు కల్పించాం అన్నారు. ఈ పథకం ద్వారా మహిళల డబ్బులను ఆదా చేసుకోగలుగుతున్నారు అన్నారు. రాబోయే రోజుల్లో అందరి ఆదాయం పెరగాలి.. అందరి ఆరోగ్యం బాగుండాలి. అప్పుడే అందరూ సంతోషంగా ఉంటారుఅన్నారు. దీన్ని నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. బాగా వెనుకబడిన కుటుంబాలను ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం అన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రజారోగ్యం బాగుండేందుకు తీసుకో వాల్సిన ఆహారాన్ని కూడా ప్రచారం చేస్తున్నాం. మహిళలు అంటే ఒకప్పుడు చిన్నచూపు ఉండేది.. కానీ ఇప్పుడు ఇది రివర్స్ అయింది అన్నారు. మహిళలే ఎక్కువగా సంపాదించే పరిస్థితివచ్చింది అన్నారు. సంజీవని వంటి పథకాలతో ప్రజారోగ్యం కోసం పని చేస్తున్నాంఅన్నారు. వీటితో పాటు.. ఆర్థిక పరిస్థితులు మెరుగపడేలా వివిధ రకాల పథకాలను అందిస్తున్నాం అన్నారు.

**ఆర్థికంగా ప్రగతి సాధించాలి.**

పి4 పథకం ద్వారా కూడా పేద కుటుంబాలకు చేయూతనిచ్చేలా మార్గదర్శులను ముందుకు తెస్తున్నాం అన్నారు. నేనుఅనే సంకల్పం తీసుకుని ప్రతి ఒక్కరూ పని చేయాలి అన్నారు. డ్వాక్రాసంఘాలను తెచ్చాను.. ప్రోత్సహించాను. అన్నారు. రూ. 25వేలకోట్లు డ్వాక్రా సంఘాలద్వారా పొదుపు సొమ్ము బ్యాంకుల్లో ఉంది. అన్నారు. తీసుకున్న బ్యాంక్ రుణాలను తిరిగి చెల్లింపులు జరుపుతారు అన్నారు. కొన్ని పెద్ద కంపెనీలు కూడా రుణాలను ఎగవేస్తున్నాయి.. డ్వాక్రా మహిళలు మాత్రం తీసుకున్న రుణాలను ఠంచనుగా చెల్లింపులు జరిపారు అన్నారు. గంజాయి నిర్మూలనకు, అవగాహన పెంచేందుకు మహిళలు చొరవ తీసుకోవాలి. రాజకీయ ముసుగులో నేరాలు చేసే వారిని మహిళలు ఓ కంట కనిపెడుతూ ఉండాలి అన్నారు.

**రూ.3,095 కోట్ల సబ్సిడీ 87 కోట్ల ప్రయాణాలు**

ఈ పథకం ద్వారా గడిచిన యేడాది కాలంలో మహిళలు రికార్డు స్థాయిలో 87 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారని సిఎం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సగటున 24లక్షలమంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం రోజుకు రూ.8.53 కోట్ల సబ్సిడీ భరిస్తోందని తెలిపారు. యేడాదికాలంలో మొత్తం రూ.3,095కోట్లు ప్రభుత్వం వెచ్చించిందని వివరించారు. ఆర్టీసీలోని మొత్తం 9,978 బస్సులకు గాను, 7,631 బస్సుల్లో ఈ పథకం విజయవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు. మొత్తం ఆర్టీసీలోని 76 శాతం బస్సుల్లో స్త్రీ శక్తి పథకం అమలు అవుతోందని సిఎం తెలిపారు.

**హర్షం వ్యక్తం చేసిన మహిళలు**

మహిళలతో మాట్లాడుతూ.. వారి కుటుంబ వివరాలు.. ఆర్థిక స్థితిగతులను అడిగి ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసి ఓట్లేయించుకునే వారిని నమ్మొద్దన్న సిఎం చంద్రబాబు హితవు చెప్పారు.. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి కాకూడదని మహిళలు ప్రచారం చేయాలన్నారు..రాబోయే 10 యేళ్లలో ఏయే లక్ష్యాలను నిర్దేశించుకున్నారంటూ సిఎం ప్రశ్నలు....కోటి రూపాయల పెట్టుబడితో తన డ్వాక్రా సంఘం నుంచి వ్యాపారం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపిన కడప జిల్లా ముస్లిం మహిళ. .ఏఐ రంగంలో నైపుణ్యం సాధించడం ద్వారా తాను ఎంచుకున్న సాఫ్ట్‌వేర్ రంగంలో టాప్ పొజిషనులోకి వెళ్లాలని వివరించిన విశాఖకు చెందిన ఓ ఉద్యోగిని...స్త్రీ శక్తి ద్వారా సుమారు రూ. 3 వేలు ఆదా చేసుకోగలుగుతున్నామని తెలిపిన యువతి.. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో మహిళలే ఎక్కువగా సంపాదిస్తున్నారని... తాము కూడా మరికొందరికి ఉపాధి చూపగలుగుతున్నామన్న పలువురు మహిళలు.. అమరావతి నిర్మాణాలను చూడాలని ఉందని కోరిన మహిళలు.. రాజధానిలో మహిళల పర్యటనకు ఏర్పాటు చేయాలని అధికారులకు సిఎం ఆదేశించారు.

## బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎపి పర్యటన ఖరారు

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** బిజెపిప జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎపి పర్యటన ఖరారు. ఆగస్టు 17 నుంచి 21 వరకు 5 రోజుల పాటు ఎపిలో పర్యటించనున్న నితిన్ నబీన్ ఆగస్టు 17 సాయంత్రం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. విశాఖలో నితిన్ నబీన్‌కు బిజెపి నేతలు, కార్యకర్తల ఘన స్వాగతం పలుకుతారు. ఆగస్టు 18 ఉదయం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం చేసుకుంటారు. అనంతరం విశాఖలో జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, రాష్ట్ర పదాధికారులతో సమావేశం అవుతారు.

# వికసిత్ భారత్‌కు 'సప్తధార'

>> నని ప్రధాని మోడీ తెలిపారు. సంకల్పం, కలలు ఉన్నతంగా ఉంటే సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. ఇవాళ ప్రపంచమంతా భారత్‌వైపు చూస్తోందన్నారు. శౌచాలయాలు 4 రెట్ల వేగంతో నిర్మించామని, పేదలకు ఇళ్లు 3 రెట్ల వేగంతో నిర్మించామని తెలిపారు. దేశవ్యాప్తంగా మెట్రోరైళ్ల సదుపాయాలు పెరిగాయని, ఆత్మనిర్భర భారత్ సాధనే మన లక్ష్యమని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. ఆత్మ విశ్వాసం పెంచుకోవడంతోపాటు స్వయం సమృద్ధి సాధించాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. వోకల్ ఫర్ లోకల్ నినాదంతో ముందుకెళ్తున్నామని అన్నారు. పలు ప్రాంతాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తుల వల్ల ప్రభావితమైన కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలుస్తుందని అన్నారు.

**డిజిటల్ యుగంలో పెరిగిన చిప్ ప్రాముఖ్యం....**

డిజిటల్ ప్రపంచంలో ఎలక్ట్రానిక్ వస్తువుల్లో చిప్ ప్రాముఖ్యత పెరిగిందని వివరించారు. సెమీకండక్టర్ల రంగంలో స్వావలంబన దిశగా కీలక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. మూడు ప్రధాన సెమీకండక్టర్ ప్లాంట్లు కార్యకలాపాలు చేపట్టాయని గుర్తు చేశారు. ఏడెనిమిదేళ్లలో దాదాపు 8 సెమీకండక్టర్ ప్లాంట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రధాని మోడీ తెలిపారు. 200 గిగావాట్ల అణు ఇంధనం ఉత్పత్తి మన లక్ష్యమన్నారు. ఐదు అణు రియాక్టర్ల ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేశంలోని 70 నగరాల్లో పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందిస్తున్నని చెప్పారు. 1.75 కోట్ల ఇళ్లకు పైప్ లైన్ ద్వారా వంట గ్యాస్ అందిస్తున్నామని వివరించారు. ఇంధన భద్రత సాధించడం దేశ తక్షణ అవసరం అని నొక్కి చెప్పారు. దేశాభివృద్ధిని అడ్డుకోవడం ఎవరి తరంకాదని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. 12 యేళ్లలో అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు. 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారని గుర్తు చేశారు. రైల్వే కోచ్, మొబైల్ ఫోన్ల తయారీ పెరిగిందని వివరించారు. డిజిటల్ లావాదేవీలు 100 రెట్లు పెరిగాయని గుర్తు చేశారు. రైల్వే విద్యుదీకరణను 30 నుంచి వందశాతానికి పెంచామన్నారు. తొలి హైడ్రోజన్ రైలును కూడా ప్రారంభించామని వివరించారు. అనేక చట్టాలను మార్చామన్నారు.

**కరోనాతర్వాత యుద్ధాలు ముంచేసాయి..**

కరోనా మహమ్మారి ప్రపంచాన్నే ముంచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా నుంచి బయటపడగానే యుద్ధాలు ముంచేశాయని పేర్కొన్నారు. ముందు ఉక్రెయిన్ యుద్ధం ఇప్పుడు ఇరాన్ యుద్ధం అని వివరించారు. యుద్ధాలు వస్తే ఇంధనం, ఎరువులు దొరకవని కొందరు భయపెట్టారని ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు లోటు రానివ్వలేదని చెప్పారు. సంక్షోభం వస్తుందని ముందే ఊహించి ముందస్తు ఏర్పాట్లు చేశామని గుర్తు చేశారు. యూరియా, డిఎపి ధరలు పెరిగినా ఇక్కడ సబ్సిడీకి ఇస్తున్నామని పేర్కొన్నారు. భారత్‌లో స్థిరమైన ప్రభుత్వం ఉందని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. 2014 తర్వాత 40 దేశాలతో ట్రేడ్ అగ్రిమెంట్‌లు చేశామని గుర్తు చేశారు. మన టెక్స్‌టైల్, ఫార్మా, మత్స్య సంపద మనల్ని రక్షిస్తోందని చెప్పారు. రక్షణ రంగంలో స్వయం సమృద్ధి సాధించాలన్నారు. భారత్ నుంచి రక్షణ రంగ ఎగుమతులు పెరగాలని ఆకాంక్షించారు. గత 12 యేళ్లలో రక్షణ రంగ ఉత్పత్తి 4 రెట్లు పెరిగిందన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తి 5 రెట్లు పెరిగిందని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీ 7 రెట్లు, మొబైల్ ఫోన్ల ఉత్పత్తి 33 రెట్లు పెరిగిందని వివరించారు. భారత్ 6జీ టెక్నాలజీని ప్రపంచమంతా తీసుకెళ్లాలని తెలిపారు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో భారత్ నుంచి 50 సంస్థలు ఉండాలని ప్రధాని మోడీ ఆకాంక్షించారు.

**నక్సలిజాన్ని అంతంచేసాం...**

దేశంలో నక్సలిజాన్ని అంతమొందించామన్నారు. నక్సలిజం, మావోయిజం ఎంతోమంది యువకులను బలి తీసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధంలో ఎంతమంది సైనికులు చనిపోయారో నక్సలిజంతో అంతమంది పోలీసులు చనిపోయారని పేర్కొన్నారు. నక్సలిజం భావజాలం ఉన్నవారిని కట్టడి చేయాల్సి ఉందన్నారు. కానీ దేశంలో చాలామంది మావోవాదులు ఉన్నారని చెప్పారు. వారి మనసుల్లో మావోయిజం, నక్సలిజం ఇంకా ఉందని తెలిపారు. అలాంటి వారిని కనిపెట్టి నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

మహిళా రిజర్వేషన్ల అమలుకు అన్ని పార్టీలు కలిసి రావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కోటా అందాల్సి ఉందన్నారు. మహిళా బిల్లుకు సహకరించి ఆ ఘనత మీరే తీసుకోవాలని ప్రతిపక్షాలకు ఆయన స్పష్టం చేశారు. దేశాభివృద్ధిలో జనగణన ఎంతో కీలకమని పేర్కొన్నారు. పథకాల రూపకల్పనకు జనగణన సమాచారం కీలకమని అభివర్ణించారు. జనగణనకు యువత సహకరించాల్సి ఉందన్నారు. జనగణన నమోదులో తప్పులు లేకుండా చూడాలని అందుకోసం యువతకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ అందిస్తామని ప్రధాని మోడీ వివరించారు.

# ఒకే రాష్ట్రం.. ఒకే రాజధాని..

>> గుర్తొచ్చాయి. ఇండిపెండెన్స్ డే వస్తుంది అనగానే స్కూల్‌లో హడావుడి ఉండేది. ఫ్రెండ్స్ అంతా కలిసి క్లాస్ రూమ్స్, స్కూల్‌ని డెకరేట్ చేసేవాళ్లం. స్కూల్‌లో పెట్టే కాంపిటీషన్స్ కోసం స్వాతంత్ర్య సమరయోధుల చరిత్ర గురించి స్టడీ చేసేవాళ్లం. ఫైనల్‌గా ఎవరైనా గెస్ట్ వచ్చి జెండా ఎగరేసినప్పుడు గూస్ బంప్స్ వచ్చేవి. జనగణమనఅంటూ జాతీయగీతం పాడుతూ.. జాతీయజెండా ఎగరడంచూసినప్పుడు చాలా గర్వంగా ఉంటుంది. మన ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపైనే కాదు.. ఈ రోజు ప్రతి భారతీయుడి గుండెల్లో జాతీయ జెండా ఎగురుతుంది అన్నారు.

**యువతలో నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం..**

ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత నాకు ఇస్తే.. దేశ తలరాతను మారుస్తానని స్వామి వివేకానంద అన్నారు. ఇప్పుడు నేను అదే ఫాలో అవుతున్నా. నాలుగేళ్లు ఇంజనీరింగ్ చేస్తే ఉద్యోగం రాదు. నాలుగు నెలలు అమీర్ పేటలో కోచింగ్ తీసుకుంటే ఉద్యోగం వస్తుంది. అదే స్కిల్ గ్యాప్. అందుకే నేను పరిశ్రమలు కాలేజీలను అనుసంధానిస్తున్నాం. పరిశ్రమలు మన ఐటిఐలను అడాప్ట్ చేసుకుని వాళ్లకు కావాల్సిన నైపుణ్యాలను నేర్పిస్తారు. ఉద్యోగాలు వెంటనే వస్తాయి. అలానే ఉన్నత విద్యను కూడా ప్రక్షాళన చేస్తున్నాం. కరిక్యులమ్ మార్చాం. ఇన్నేళ్లుగా లేని ప్రొఫెసర్ రిక్రూట్ మెంట్ చేస్తున్నామని తెలిపారు.




శనివారం విజయవాడలో స్వాతంత్ర్య ఏడుకల్లో భాగంగా జెండా ఎగురవేస్తున్న మంత్రి లోకేష్

**అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం..**

ఎన్ని ఇబ్బందులున్నా ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటున్నాం. పెన్షన్, తల్లికి వందనం, దీపం పథకం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, చేనేతలకు ఉచిత విద్యుత్, మత్స్యకార భరోసా అందిస్తున్నాం. అన్నా క్యాంటీన్లు ఏర్పాటుచేశాం. మెగా డీఎస్సీ ద్వారా 16వేల టీచర్ పోస్టులు భర్తీ చేశాం. 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. పదివేల పోస్టులతో జాబ్ కేలండర్ విడుదల చేశాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం. ప్రతి వంద రూపాయల పెట్టుబడుల్లో ఎపికి రూ.25 వస్తున్నాయి. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనేది నా ఆశయం అన్నారు.

## వారం - వర్జ్యం

16-08-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఆశ్లేషకార్తె
చవితి సా.4.58 న.హస్త రా.3.52
వ.మ.12.00-మ.1.37
దు.సా.4.46-సా.5.37
రాహు సా.4.30-సా.6.00
శుభ లేదు.

## వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**వృషభం :** ఇంటిలో తల్లి ఆరోగ్యం కొంత కలవర పెడుతుంది. గృహనిర్మాణ యత్నాలు ఫలించవు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**మిథునం :** శాస్త్ర, సాంకేతిక విషయాల యందు ఆసక్తి చూపుతారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**కర్కాటకం :** పట్టుదలతో ముందుకు సాగి పనులు పూర్తి చేస్తారు. చర్చాగోష్ఠులలో చురుకుగా పాల్గొంటారు. విందు వినోదాలు.

**సింహం :** పారిశ్రామిక, రాజకీయ రంగాల వారు అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. మిత్రుల కలయిక.

**కన్య :** ఆస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఇంటా బయటా అనుకూలం.

**వృశ్చికం :** సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెర్పరచుకుంటారు. వస్తు కొనుగోలు. స్వల్ప ధనలాభం పొందుతారు.

**ధనుస్సు :** సన్నిహితుల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి. వస్త్ర లాభం.

**మకరం :** భూ సంబంధిత వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. బంధువుల రాక ఆనందం కలిగిస్తుంది. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**కుంభం :** సోదరుల నుండి స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు. మిత్రుల కలయిక.

**మీనం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# డి.సిఎం పవన్‌కు అస్వస్థత

## ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన వైనం

## ఫిజియో థెరపీ కోసం కేరళకు వెళ్లే అవకాశం

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర జ్వరం కారణంగా ఈ సాయంత్రం లోక్ భవన్‌లో నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరు కాలేకపోతున్నట్లు ఆయన కార్యాలయం వెల్లడించింది. ఈ విషయాన్ని లోక్ భవన్ అధికారులకుకూడా సమాచారం అందించారు. కాకినాడలో 80వ స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న అనంతరం పవన్ రాజమహేంద్రవరంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఆ సమయంలో జ్వరం తీవ్రం కావడంతో కార్యక్రమాన్ని మధ్యలోనే త్వరగా ముగించారు. అక్కడ వైద్యులు ఉపముఖ్యమంత్రిని పరీక్షించారు. కొంత ఉపశమనం కలిగిన అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఇటీవల పవన్ కుడి భుజానికి శస్త్ర చికిత్స జరిగిన సంగతి విదితమే. శస్త్ర చికిత్స అనంతరం ఫిజియో థెరపీ గురించీ వైద్యులను కలవనున్నారు. కాకినాడలో జరిగిన కార్యక్రమాల్లో పవన్ పాల్గొన్నప్పుడు కొంత అసౌకర్యంగా కనిపించారు. జాతీయ పతాకానికి సెల్యూట్ చేసిన తర్వాత అలాగే వాహనంలో అభివాదం చేసిన తర్వాత కూడా భుజాన్ని చేతితో నొక్కుకున్నారు. ఆయనకు జ్వరంకూడా ఉన్నట్లు కార్యాలయవర్గాలు వెల్లడించాయి. పవన్ ఫిజిథేరపిలో భాగంగా వచ్చేవారంలో కేరళవెళ్లే అవకాశాలున్నాయి. ఇటీవలే ఆయన భుజానికి శస్త్రచికిత్స అనంతరం వేసిన కట్టుతీసారు. ఆ తరువాత కొన్ని ఇబ్బందులు పడుతున్నారు. దాంతో ఆయన కేరళకు వెళ్లే అవకాశం ఉంది.

# అత్యంత ఎత్తయిన ఇయు పర్వతం అధిరోహించిన ఏలూరు ఎస్ఐ



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఎపికి చెందిన ఓ పోలీస్ అధికారి వినూత్న రీతిలో జరుపుకున్నారు. రాష్ట్రంలోని ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు యూరప్‌లోనే అత్యంత ఎత్తైన మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి, అక్కడ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. రష్యాలో ఉన్న 5,642 మీటర్ల ఎత్తైన ఈ శిఖరంపైకి ఈరోజు ఉదయం 8 గంటల సమయంలో (భారత కాలమానం ప్రకారం) ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా సుమారు 100 మీటర్ల పొడవైన భారీ జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించి తన దేశభక్తిని చాటుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన తోటి పోలీసు సిబ్బందికి తన ఈ ఘనతను అంకితం ఇస్తున్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. పర్వతారోహణపై ఆసక్తి ఉన్న ఆయన, ఈ యాత్ర కోసం కఠినమైన శారీరక, మానసిక శిక్షణ పొందారు. గతంలో కూడా ఆయనకు పలు శిఖరాలను అధిరోహించిన అనుభవం ఉంది. మౌంట్ ఎల్బ్రస్‌ను విజయవంతంగా అధిరోహించిన ఆయన, తన తదుపరి లక్ష్యం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమేనని ప్రకటించారు.



శనివారం జాతీయ పతాకానికి అభివాదం చేస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

# దేశ భవిష్యత్ యువత చేతుల్లోనే

## శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. శాసనమండలి చైర్మన్ క్రొయ్యే మోషేన్ రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. అనంతరం ఎస్పీఎఫ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాష్ట్ర ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను అనుభవిస్తున్నామని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. భారతదేశ భవిష్యత్తు యువత శక్తి, ప్రతిభ, నైపుణ్యాలపై ఆధారపడి ఉందని చైర్మన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల కార్యాలయంలో పతాకాన్ని ఆవిష్కరించిన పద్మలత

**విజయవాడ.ఆగస్టు 15.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఎస్సీ పీసీఆర్ సభ్యురాలు కేజీ పద్మలత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ వేడుకలలో ఏపీఎస్సీ పీసీఆర్ సభ్యులు చల్లా మధుసూదన రావు, కమిషన్ సిబ్బంది మల్లీశ్వరి, పెద్దిరెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

## కాలుష్య నియంత్రణకు మరిన్ని విద్యుత్ బస్సులు

### దాతల భాగస్వామ్యంతో పలు ప్రాజెక్టులు

### విజయవంతం: టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంకొండల్లోని తిరుమలక్షేత్రంలో పెరుగుతున్న వాహన కాలుష్యాన్ని నియంత్రించేందుకు విద్యుత్ బస్సులను పెద్దఎత్తున ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. దేశవిదేశాల నుండి ఇష్టదైవమ్ శ్రీవారి దర్శనార్థం ప్రస్తుతం తిరుమలకు 10 వేల నుండి 14 వేల వరకు వాహనాలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ అత్యంత అవసరమన్నారు. దాతల సహకారంతో మరో 37 విద్యుత్ బస్సులను భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. రానున్న బ్రహ్మోత్సవాలకు సుమారు 25 విద్యుత్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. గత ఐదు నెలల్లో లగేజ్ కౌంటర్ల ద్వారా సుమారు 2.6 కోట్ల బ్యాగులను సమర్థవంతంగా డిపాజిట్ డెలివరీ చేసినట్లు అదనపు ఇఒ తెలిపారు. టిటిడి సాధిస్తున్న విజయాలు ఏ ఒక్క వ్యక్తివి కాదని, ప్రతి విభాగం, ప్రతి ఉద్యోగి, ప్రతి భాగస్వామి సమష్టి కృషి ఫలితమని అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్పష్టం చేశారు. వచ్చే స్వాతంత్ర్య దినోత్సవం నాటికి మరిన్ని వినూత్న సంస్కరణలు, అద్భుతమైన ఫలితాలతో టిటిడిని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో టిటిడిఅధికారులు, ఉద్యోగులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అభివాదం చేస్తున్న
రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకరు రఘురామ

# ప్రజాస్వామ్య విలువల పరిరక్షణే లక్ష్యం

## రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

**విజయవాడ, ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శాసనసభ స్పీకర్ చింత కాయల అయ్యన్నపాత్రుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. అంత కుముందు ఎస్పీఎఫ్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన స్పీకర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు వందేమాతరం గీతాలాపనతో కార్యక్ర మాన్ని ప్రారంభించుకోవడం జరిగిందని స్పీకర్ పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి, ప్రజా పోరాటాలకు విశిష్ట సేవలందించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, తొలి స్వాతంత్ర్య సమరయోధుల్లో ప్రముఖుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి మహనీయుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసన సభ డిప్యుటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు, గన్నవరం శాసన సభ్యులు.ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకటరావు, శాసన సభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ‘స్వర్ణ శ్రీకాకుళం’ అందరి ధ్యేయం కావాలి

### సంక్షేమానికి స్వర్ణయుగం.. శ్రీకాకుళం అభివృద్ధికి మహా ప్రణాళిక

### రైతు సంక్షేమం.. సాగునీటికి పెద్దపీట..

### మౌలిక వసతులకు భారీగా నిధులు: మంత్రి అచ్చెన్నాయుడు



శనివారం స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం, ఆగస్టు 15 ప్రభాతవార్త :** సుపరిపాలనతో రాష్ట్రంలో సంక్షేమానికి స్వర్ణయుగాన్ని తీసుకురావడంతో పాటు శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతు సంక్షేమం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 2047 నాటికి స్వర్ణ ఆంధ్ర–స్వర్ణ శ్రీకాకుళం లక్ష్యాన్ని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి అచ్చెన్నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధులు కన్న కలల భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.1.49 లక్షల కోట్లను సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి జిల్లాలో 3,04,352 మంది పింఛనుదారులకు ప్రతి నెలా రూ.129.99 కోట్లు అందిస్తున్నామని మంత్రి వివరించారు. తల్లికి వందనం పథకం ద్వారా జిల్లాలో 2,54,456 మంది పిల్లలకు రూ.15 వేల చొప్పున రూ.381.684 కోట్లు వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. బడిబయట ఉన్న 8,654 మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించామని వివరించారు. ఖరీఫ్ 2026లో ఇప్పటివరకు 1,35,059 హెక్టార్లలో పంటలు సాగయ్యాయని వివరించారు. అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద 2026లో తొలి విడతగా 2,79,100 మంది రైతులకు రూ.183.61 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని మంత్రి తెలిపారు. నారాయణపురం, మడ్డువలస జలాశయాల ద్వారా 44,160 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు. వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,48,230 ఎకరాలకు, కుడి ప్రధాన కాలువ ద్వారా 63,134 ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న నేరడి బ్యారేజీ నిర్మాణానికి రూ.641.10 కోట్లతో పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రెండు సంవత్సరాల్లో రూ.240 కోట్లతో 551 కిలోమీటర్ల పొడవున 3,300 సీసీ రహదారులు పూర్తి చేశామని మంత్రి తెలిపారు. మరో రూ.107 కోట్లతో 104 కిలోమీటర్ల మేర 39 బీటీ రహదారులు పూర్తయ్యాయని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చే మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

మత్స్యకార సేవలో పథకం కింద 2026–27లో వేట నిషేధ భృతిగా 16,738 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున రూ.32.38 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని వివరించారు. 2047 నాటికి శ్రీకాకుళం జిల్లాను పేదరిక రహితంగా, స్వయం సమృద్ధిగా, సాంకేతికత ఆధారితంగా, పెట్టుబడులకు అనుకూలంగా, ఉపాధి అవకాశాలతో కళకళలాడే జిల్లాగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మ పరిరక్షణే మా సంకల్పం

### శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తాం: టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు



తిరుమలలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో నప్రసంగిస్తున్న చైర్మన్ బి.ఆర్.నాయుడు

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ నలుమూలల నుండి తిరుమలకు విచ్చేసే శ్రీవారి భక్తుల సేవే టిటిడి ప్రధాన ధ్యేయమని, సనాతన ధర్మ పరిరక్షణే తమ సంకల్పమని టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు ఉద్ఘాటించారు. శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేస్తూ, విద్య, వైద్యం, ధార్మిక సేవలకు పెద్దపీట వేస్తూన్నామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శనివారం ఉదయం టిటిడి పరిపాలనా భవనంలోని పరేడ్ మైదానంలో టిటిడి చైర్మన్ బిఆర్నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, ప్రభల గోపీనాథ్‌తో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు చైర్మన్ ఉద్యోగులనుద్దేశించి వేంకటేశ్వరస్వామి దివ్య కైంకర్యాల్లో సేవలందిస్తున్న అర్చక స్వాములు, భక్తుల సేవలో తరిస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, ఉద్యోగులు, భద్రతా సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు, శ్రీవారి సేవకులు, మీడియా , దేశ విదేశాల నుండితిరుమలకు విచ్చేస్తున్న భక్తకోటికి భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ప్రతి భక్తుడు శ్రీవారి దివ్యదర్శనానంతరం దివ్యానుభూతితో తిరిగి వెళ్లేలా సేవలను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా టిటిడి బోర్డు, యంత్రాంగం పనిచేస్తోందన్నారు. ఈ ఏడాది అధికమాసం కారణంగా సెప్టెంబరు 15 నుండి 23వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అదేవిధంగా అక్టోబరు 12 నుండి 20వ తేదీ వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే ప్రతి భక్తుడు శ్రీవారి దివ్యదర్శనం, వాహనసేవలను భక్తిశ్రద్ధలతో వీక్షించేలా సమగ్ర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. లక్షలాది మంది భక్తులకు పరిశుభ్రమైన, నాణ్యమైన అన్నప్రసాదం అందించేందుకు దాతల సహకారంతో 120 కోట్లతో మరొక వంటశాలను నిర్మించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. దాతల సహకారంతో 145 కోట్లతో అభివృద్ధి చేసిన తిరుమల ఎస్వీ మ్యూజియంలో శ్రీవారి సేవలు, ఉత్సవాలు, అరుదైన ఆభరణాల వైభవాన్ని 3డీ, 7డీ రూపంలో భక్తులకు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు నాయుడు తెలిపారు. కోదండరామస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక వైభవానికి తగినట్లుగా తీర్చిదిద్దేందుకు కడపజిల్లా ఒంటిమిట్టలో విశ్రాంతి గృహాలు, యాత్రికుల సౌకర్యాలు, విద్యుత్ అలంకరణలు, భూసేకరణ తదితర అభివృద్ధి పనులను వేగంగా చేపట్టి, ఒంటిమిట్టను మరింత ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూరులో 19.62 ఎకరాలు, అస్సాంలోని గౌహతిలో 10.32 ఎకరాలు, తెలంగాణలోని ఖమ్మంలో 20 ఎకరాలు, కర్ణాటకలోని బెల్గాంలో 6.43 ఎకరాలు, ముంబైలోని బాంద్రా ప్రాంతంలో అదనంగా మరో 10 సెంట్లు, అదేవిధంగా బీహార్ రాష్ట్రంలో కూడా భూమిని సేకరించి శ్రీవారి ఆలయాల నిర్మాణ పనులను ముందుకు తీసుకెళుతున్నామన్నారు. గత రెండేళ్లుగా టిటిడిలోని వివిధ ట్రస్టులకు సుమారు 1,500 కోట్లకు పైగా విరాళాలు అందించిన ప్రతి దాతకు టిటిడి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. 161.40 కోట్లతో టిటిడి విద్యాసంస్థలను ప్రపంచస్థాయి విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, సదాశివరావు, నరేష్‌కుమార్, అదనపు ఇఒవెంకయ్య చౌదరి, జెఇఒలు డాక్టర్ ఎ.శరత్, పి. గోపినాథ్, సివిఎస్ఒ మురళీకృష్ణ, అదనపు సివిఎస్ఒ శివకుమార్ రెడ్డి, , సిఇ మనోహరం, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిఎఫ్ఒ డి. ఫణికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గుంతకల్ రైల్వేడివిజన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం

### పాల్గొన్న డిఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, ఎడిఆర్ఎం శివ ప్రసాద్

**గుంతకల్ రైల్వే, ఆగస్టు 15 ప్రభాత వార్త:** దక్షిణ కోస్తా రైల్వే జోన్ గుంతకల్ డివిజన్ 80 వ





స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రైల్వే గ్రౌండ్ నందు నిర్వహించిన వేడుకలలో గుంతకల్ డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా మరియు ఎడిఆర్ఎం శివప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మన దేశభక్తులు, అమరవీరులు మరియు స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పించే పవిత్రమైన సందర్భమిది. అదే సమయంలో, ప్రస్తుత సంవత్సరంలో మనకు కేటాయించిన లక్ష్యాలను సాధించడంలో మన వంతు కృషిని సమీక్షించుకుని, మరింత మెరుగైన పనితీరుకు కట్టుబడి ఉండాల్సిన సందర్భం కూడా ఇదే. దేశభక్తుల పోరాటాన్ని గుర్తుచేసే ఈ జాతీయ పండుగ, మన దేశం పట్ల గర్వంగా మరియు విధేయతతో ఉండేందుకు మనలో స్ఫూర్తిని నింపుతుందన్నారు. గత ఆర్థిక సంవత్సరం 2025–26లో డివిజన్ 15.73 మిలియన్ టన్నుల ఒరిజినేటింగ్ సరుకు లోడింగ్ సాధించింది. ఇది గుంతకల్ డివిజన్ చరిత్రలోనే అత్యధిక సరుకు లోడింగ్ నిర్వహించింది. డివిజన్ ..2,426 కోట్ల అత్యధిక ఆదాయాన్ని సాధించిందన్నారు. జూలై 2026లో గుంతకల్ డివిజన్ 97.57 పంక్చువాలిటీతో దక్షిణ కోస్తా రైల్వేలో మొదటి స్థానాన్ని సాధించింది.

జూలై 2026లో 3 సందర్భాల్లోఆగస్టు 2026లో 4 సందర్భాల్లో కోచింగ్ రైళ్లకు 100 పంక్చువాలిటీ సాధించి, భారతీయ రైల్వేల్లో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. బెస్ట్ ఎలక్ట్రిక్ షెడ్ మైంటైనడ్ బై డీజిల్ షెడ్ స్టాఫ్ " విభాగంలో 2వ అత్యుత్తమ పనితీరు కనబరిచిన షెడ్‌గా అవార్డు సాధించిందన్నారు. బెస్ట్ డీజిల్ షెడ్ హోమింగ్ ఎలక్ట్రికల్ లోకస్ "గా రైల్వే బోర్డు షీల్డ్‌ను అందుకుందన్నారు. గుంతకల్ డివిజన్ మీదుగా మొత్తం 15 జతల కొత్త రైళ్లు ప్రవేశపెట్టబడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం /రామకృష్ణ, సౌత్ కోస్ట్ రైల్వే ఉమేన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మమతా గుప్తా, బ్రాంచ్ అధికారులు, సహోద్యోగి అధికారులు, ట్రేడ్ యూని యన్లు మరియు అసోసియేషన్ల ప్రతినిధులు, రైల్వే పరివార్ సభ్యులు, చిన్నారులు, ప్రజలు పాల్గొన్నారు.





## రెపరెప లాడిన ‘తిరంగా జెండా’

### సైకిల్ ర్యాలీ నిర్వహించిన ఎంఎల్ఏ

**శ్రీకాళహస్తి,ఆగస్టు 15 ప్రభాతవార్త:** తిరుపతిజిల్లా శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం శనివారం ఆలయాలు, మసీదుల వద్ద మువ్వన్నెల జెండా రెప రెప లాడింది. అలాగే పుణ్యక్షేత్రంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌సారథ్యంలో సారథ్యంలో మోటార్‌సైకిల్ ర్యాలి కార్యకర్తలతో కలసి నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మసీదుల వద్ద జమియతుల్ ఉలమ నాయకుడు ముఫ్తీనయిం సాహెబ్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ మేరకు పట్టణంలోని 15 మసీదుల వద్ద జాతీయ జెండా రెప రెప లాడింది. వాయులింగేశ్వరుని పరిపాలనా భవనాల వద్ద ఇఓ బికె వెంకటేశులు ముఖ్యఅతిథిగా పాల్గొనగా జాతీయ జెండాను ఎగురవేసి వందన స్వీకారం చేసారు. ఆలయ పౌరోహితులు అర్ధగిరి స్వామి పూజలతో కార్యక్రమాల్ని ఏర్పాటు చేసారు. కాగా శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి హాజరై పలు శాఖల్లో సేవలందించిన వారికి ప్రసంసా పత్రాలను అందించారు. అలాగే రెండేళ్ళలో శ్రీకాళహస్తి నియోజకవర్గం సాధించిన ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆయనతో పాటు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడుకోలా ఆనంద్ కుమార్, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, మార్కెటింగ్ కమిటి చచైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ కెవి కృష్ణారెడ్డి సారథ్యంలో స్వాతంత్రదినోత్సవ వేడుకలను నిర్వహించారు.

## కృష్ణానదిలో మునిగి ముగ్గురు యువకుల మృతి

**విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్త:** కృష్ణానదిలో తాడేపల్లి పరిధిలో ముగ్గురు కృష్ణలంకకు చెందిన యువకులు స్నానానికని వెళ్ళి మృతి చెందిన వైనంపై కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణలంక,ద్వారకానగర్,మొదటి లైనుకు చెందిన వీసం గౌతం ఇంటర్ పూర్తై సిఎ చదువుతున్నాడు. అక్కడే నివసిస్తున్న గెడ్డం జాషువా ఇంటర్ పూర్తి చేసి స్క్రాప్ కొట్లోకి పనిలోకి వెళ్తున్నాడు. వీరిద్దరూ బావా బామ్మర్దులు.ఒకే ఇంటిలో నివసిస్తుంటారు. పీగుళ్ళ తేజేష్ కూడ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఇతని తండ్రి ప్రైవేటు డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వీరందరూ ద్వారకానగర్ లోనే నివసిస్తున్నారు. వీరు ముగ్గురుతో పాటు మరో ముగ్గురు శనివారం సాయంత్రం సుమారు 4 గంటలకు పార్కుకు వెళ్తున్నామని ఇంటిలో చెప్పి కృష్ణానదికి వెళ్ళారు.కృష్ణలంక మార్వాడీ గుడి వద్ద నుండి నడుచుకుంటూ వెళ్ళి విజయవాడ వైపు నీళ్ళు లేకపోవడంతో తాడేపల్లి పాయవైపుకు వెళ్ళినట్లు సమాచారం. గౌతం,తేజేష్, కృష్ణ,ప్రేమ్, జాషువా, తేజలు కలిసి వెళ్ళారు. కృష్ణానది పాయ లోకి నలుగురు దిగారు. మరో ఇద్దరు మాత్రం బయటే వేచి ఉన్నారు. వీరిలో తేజ నదిలో నుండి బయటకు వచ్చేశాడు. ముగ్గురు మాత్రం నదిలో మునిగిపోయారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రూ.1,226కోట్లతో తిరుపతి వన్ ప్రాజెక్టు

### స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో మంత్రి ఆనం

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతిజిల్లాను ఆలయాలు బీచ్, రిసార్ట్ టూరిజం అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర దేవాదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తిరుపతికి సమీపంలోని దామినేడు వద్ద 1,226 కోట్ల రూపాయలతో “తిరుపతి వన్ ”ప్రాజెక్టుకు 21 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. అలిపిరి, వడమాలపేట మండలం ఎస్వీపురం ప్రాంతాల్లో 440 కోట్లతో ఫైవ్‌స్టార్ లగ్జరీ రిసార్ట్ ఏర్పాటుకు 33 ఎకరాల భూమిని కేటాయించామని చెప్పారు. ఏఐ ఆధారిత సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తిరుపతిని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లాలో చంద్రగిరి నియోజకవర్గం రాయలచెరువు వద్ద వాటర్ ఏరోడ్రోమ్, సీప్లేన్ సేవలకు చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. 80వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా శనివారం ఉద యం తిరుపతి జిల్లా కేంద్రంలోని ఎంఆర్‌పల్లి ఏఆర్ పోలీస్‌మైదానంలో జరిగిన జాతీయజెండా వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. తిరుపతి జిల్లాలోని 36 మండలాల్లో 1,023 ఆలయాలు ఉండగా, క్యూ లైన్ నిర్వహణ, ఆర్‌టిజిఎస్, వాట్సాప్, ‘మనమిత్ర యాప్ ద్వారా పారదర్శక సేవలు అందిస్తున్నామన్నారు. టిటిడి ఆలయాల విషయంలో రాష్ట్రంలోని 111 ఆలయాల్లో అన్నప్రసాదం, 65 ఆలయాల్లో నిత్యాన్నదానం నిర్వహిస్తూ ప్రతిరోజూ సుమారు 50 వేల మంది భక్తులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఏడాదికి సుమారు 158 కోట్లను ఖర్చు చేస్తున్నామన్నారు. 5 వేల భజన మందిరాల నిర్మాణానికి 750 కోట్లు, 1,670 మందిరాలకు 570 కోట్లు రూపాయలు మంజూరు చేశామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట సేవా పతకాలను, జిల్లా అధికారులకు అవార్డులను మంత్రి రామనారాయణరెడ్డి అందజేశారు. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన 165 మంది సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాల్లో




ప్రతిభ కనబరిచిన విజేతలకు, డాగ్ షో బృందానికి కూడా అవార్డులను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందజేశారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్,జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు, చంద్రగిరి ఎం ఎల్ ఏ పులివర్తి నాని, తుడా చైర్మన్ సి. దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసా రత్నం, డిఆర్ఒ నరసింహులు,తిరుపతి కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ శారదాదేవి, తిరుపతి ఆర్డిఒ రామ్మోహన్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గోన్నారు.

# మంత్రి ఆనంకి అస్వస్థత

### వైద్యచికిత్సతో కోలుకున్న మంత్రి

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం జరిగిన 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నరాష్ట్రమంత్రి ఆనంరామనారాయణరెడ్డి ఉన్నఫళంగా అస్వస్థతకు గురయ్యారు. ఆయన ప్రసంగిస్తూ క్రిందకు తుళ్ళి పడబోయాడు. వెనుకనే ఉన్న భద్రతసిబ్బంది, జిల్లా కలెక్టర్, ఎస్పీలు ఆయన్ను పట్టుకుని కూర్చోబెట్టారు. వెంటనే అత్యవసరంగా ఉన్న వైద్యసిబ్బంది మంత్రికి వైద్యపరీక్షలు నిర్వహించి వైద్యం చేయడంతో కోలుకున్నారు. వెంటనే ప్రాథమిక చికిత్స అందించిన వైద్య బృందం బిపి లెవెల్స్ పడిపోయాయని వెల్లడించారు. కాసేపట్లో కోలుకున్న మంత్రి తిరిగి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన మిగిలిన ప్రసం గాన్ని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్లు చదివి వినిపించారు.

## నేడు విజయవాడలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి

### రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత


**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతిని ఆదివారం కూటమి ప్రభుత్వం ఘనంగా, రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలి పారు. రాష్ట్ర స్థాయి జయంతిని విజయవాడలో నిర్వహిం చనున్నట్లు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి సర్దార్ గౌతు లచ్చన్న విశేష కృషి చేసిన మహనీయుడని కొని యాడారు. స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారన్నారు.

పశ్చిమాసియాలో అశాంతి దేశంలోని మధ్య, దారిద్ర్యరేఖ దిగువన ఉన్న అందిరిపై ప్రభావం చూపుతోంది. గ్యాస్,పెట్రోల్ ధరలు పెరగడంతో ఉప్పుతోపాటు అన్నినిత్యవసరాల ధరలు పెరిగాయి. ఇరాన్‌పైఅమెరికా దాడి చేయడంతోనే ధరలు పెరుగుతూ ఉన్నాయి.గత సంవత్సరంకంటే 113శాతం అన్నింటి ధరలు పెరిగాయి. ఏం కొనేట్టులేని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితిలో నిత్యవసరాలు కూడా పంపిణీ చేయాలని డిమాండ్ ప్రజల నుంచి వస్తోంది.తెలంగాణ ప్రభుత్వం నిత్యావసరాలు పంపిణీ చేయాల్సిన ఆవశ్యకత గుర్తించాలి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల15నుండి రాష్ట్రంలోని కోటి 5 లక్షల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేస్తామని ప్రకటించిన నేపథ్యంలోస్మార్ట్ రేషన్ కార్డులతోపాటు 14 రకాల నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రికి లేఖరాసి సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రజల తరుపున డిమాండ్ చేశారు.ప్రస్తుతం కార్డుపై ఒక వ్యక్తికి 6కిలోల బియ్యం మాత్రమే అందుతున్నాయి.పెరిగిన ధరలకు అనుగుణంగా పేదకుటుంబాల ఆదాయాలు పెరగకపోవడంతో, వారు పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.తద్వారా రక్తహీనత, పిల్లల అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. పేదలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైఉన్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే రేషన్ కార్డుదారులకు న్యూట్రీషియన్లతో సంప్రదించి, బియ్యంతో పాటు కందిపప్పు,శనగపప్పు,పెసరపప్పు,మంచినూనె,గోధుమలు/గోధుమ పిండి,కోడిగుడ్లు, మిల్లెట్స్,చక్కెర, చింతపండు,పసుపు, కారం పొడి, ఉప్పు, కొబ్బరినూనె వంటి నిత్యావసర సరుకులైన 14రకాల వస్తువులను రేషన్‌కార్డు ద్వారా పంపిణీ చేయాలి.దారిద్ర్యరేఖకు దిగువనఉన్నవారికికే కాకుండా దిగువ,ఎగువమధ్య తరగతి ప్రజలకు కూడా ఉప్పు, చింతపండు, జీలకర్ర,మెంతులు,కందిపప్పు,తదితర పల్లిలు వంటివి సరఫరా చేయాల్సిన అవసరంఉంది.

# స్మార్ట్‌గా సివిల్ సప్లయ్ ఆధునీకరణ

**భాగ్యనగర్ భాస్కర్‌కుమార్**

‘అదిరిందయ్యా ఉత్తమ్! స్మార్ట్ రేషన్ కార్డులు, స్మార్ట్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్లు, మిషన్ కె 100 ధాన్యం సేకరణ కార్యాచరణ. సిలోస్‌లు, సిఎంఆర్ ధాన్యం అక్రమార్కులపై మెరుపు దాడలు’ అన్నట్లు పౌరసరఫరాలశాఖ ఆధునీకరణలతో ఓవైపు ఆహారభద్రతకు పెద్దపీట వేస్తూ మరోవైపు కస్టమ్ మిల్లింగ్ ధాన్యం పక్కదారి పట్టించే రైసుమిల్లర్లపై మెరుపుదాడులు చేస్తూ తెలంగాణ ప్రజల ఆదరాభిమానం చూరగొంటున్నది. తెలంగాణలో ఆహార భద్రతకు శనివారం సంగారెడ్డిలో లాంఛనంగా స్మార్ట్ రూపం ఇచ్చింది.స్వాతంత్ర్యదినోత్సవ కానుకగా రాష్ట్రవ్యాప్తంగా 3.43కోట్ల మంది లబ్ధిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. స్మార్ట్‌కార్డులపై బిజెపి నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. రేషన్ బియ్యం పంపిణీలో కేంద్రం నిధులు సింహభాగంలో ఉంటాయనీ ఎవని అయ్య జాగీరు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫోటోలు మాత్రమే వేసుకొన్నారని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ ప్రశ్నించారు. మెదక్ ఎంపి రఘునందన్‌రావు తక్షణమే కార్డుల పంపిణీ నిలిపేయాలని అసంతృప్తిని వ్యక్తం చేశారు. స్మార్ట్ కార్డుపై కేవలం ఇద్దరిఫోటోలు మాత్రమే ముద్రించడం ఇంటా బయట విమర్శలు వస్తున్నా రాష్ట్రంలోని 33జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం చేపట్టాలని పౌర సరఫరాల శాఖమంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచనలమేరకు అన్ని జిల్లాలో మొదలైంది.రాష్ట్రంలో ప్రస్తుతం1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43కోట్ల మంది లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారు. వీరిందరికి రానున్న పది రోజుల్లో స్మార్ట్ రేషన్‌కార్డులు అందిస్తారు.కొత్త స్మార్ట్ రేషన్ కార్డులకు నకిలీలను రూపొందించకుండా నివారించేలాతొమ్మిది రకాల ఆధునిక భద్రతా ఫీచర్లతో తయారు చేశారు. బ్యాంకు నోట్లు, పాస్పోర్టులు వంటి అత్యంత భద్రత కలిగిన పత్రాల్లో ఉపయోగించే టెక్నాలజీని వినియోగించారు.పైన ఎడమవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కుడివైపు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాలను ముద్రించారు. రేషన్ కార్డు నంబరు, కుటుంబ యజమాని పేరు, చౌకధరల దుకాణం సంఖ్యతో పాటు గ్రామం,మండలం, జిల్లా లబ్ధిదారుని ఇంటి చిరునామా వివరాలున్నాయి. కుటుంబ యజమానిగా మహిళల పేర్లనే ముద్రించారు. సాంకేతికమైన పలు భద్రతా ఫీచర్లు జోడించడంతో ఈ కార్డును స్కాన్ చేయగానే లబ్ధిదారుల వివరాలు నిర్ధారణ అవుతాయి. ఈకార్డు ఉన్న ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి నెలకు ఆరుకిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల




ప్రవేశంతో ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్ధిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని భావిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత రేషన్ కార్డుల జారీ చేసే విషయంలో ఆనాటి బిఆర్ఎస్ పాలకులు ఉదాసీనంగా వ్యవహరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు అందరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయం తీసుకొంది. దీనితో గత ఏడాదిన్నర కాలంలో కాంగ్రెస్ పాలకులు పాతవాటికి తోడు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి ఆ కుటుంబాలకు చెందిన 61,08,544 మంది లబ్ధిదారులకు ఆహార భద్రత కల్పించారు. ప్రస్తుతంరాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1,06,28,092 కోట్లకు చేరడమే కాకుండా కాంగ్రెస్ పాలకులు చేసిన కృషి కారణంగా 3.43కోట్ల మందికి కడుపునిండా ఎన్నడులేని తిండితినే అవకాశం కల్పించారు.తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే ప్రబలనిదర్శనం. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ. 14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేలకోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోంది.ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్ధిదారుడి చెంతకు తీసుకెళ్లడానికి బియ్యం రవాణాలో పారదర్శకతకు స్మార్ట్ సప్లయ్‌చైన్ మేనేజ్‌మెంట్ అనే పద్ధతిని తీసుకొచ్చారు.మండల్ లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం రవాణాలో పూర్తి పారదర్శకత పాటించేందుకు పౌరసరఫరాల సంస్థలో స్మార్ట్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ అనే నూతన విధానం ప్రవేశపెట్టారు.స్మార్ట్ ఎస్‌సిఎం విధానం అమలు చేయడానికి యాప్ ప్రత్యేకంగా రూపొందించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు స్టేజ్2 కాంట్రాక్టర్ లారీల ద్వారా బియ్యం రవాణా చేసేవారు. ఆ లారీలకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం అమర్చారు. ఆ లారీ ఎటువెళుతుంది, ఎక్కడ ఆగింది? ఈ విధానంలో తెలుస్తుంది. కానీ బియ్యం ఎక్కడ, ఎంత దిగుమతి అయ్యిందో తెలియదు. ఎఫ్‌సిఐ, ఎసిడబ్ల్యూసి గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం రవాణా చేసే స్టేజ్1 విధానంలోనూ అమలు చేస్తే పారదర్శకత పెరుగుతుందని అధికారులు, డీలర్లు భావిస్తున్నారు.నూతన స్మార్ట్ ఎస్‌సి ఎం విధానంలో టెండర్ల సమయంలో అనుమతించిన నంబర్లతో ఉన్న లారీల వివరాలను కాంట్రాక్టర్ ఆన్లైన్లోనమోదు చేస్తారు. ప్రస్తుతం ల్యాప్టాప్, డెస్క్టాప్లో నూతన యాప్ అందుబాటులోకి వచ్చింది. త్వరలో మొబైల్స్ యాప్ అందుబాటులోకి తేనున్నారు. డీలర్, కాంట్రాక్టర్, ఎంఎల్ఎస్ పాయింట్, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారుల మొబైల్స్‌లో ఈ యాప్ అందుబాటులోకి రానుంది. మరోవైపు రైస్‌మిల్లు అక్రమార్కులపై పకడ్బందిగా దాడులు చేస్తూ ధాన్యం స్టాక్ చూపని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.సివిల్ సప్లయ్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక వైపు విజిలెన్స్ డిజిపి డిఎస్‌చౌహాన్ రైసుమిల్లర్లను ఏ మాత్రం ఊపిరి తీసుకోకుండా ధాన్యం అప్పగించాలని ఒత్తిడి పెంచుతున్నారు. సివిల్‌సప్లయ్ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర జిల్లాలో డిఎస్‌వో,డిఎం సివిల్ సప్లయ్‌కార్పొరేషన్‌లు పోలీసు స్టేషన్‌హౌజ్ ఆఫీసర్లకు కేసులు వీగిపోకుండా ఎఫ్ఐఆర్ కేస్ షీట్ రాసేందుకు తర్ఫీదు ఇచ్చారు. గతంలో కోర్టు తీర్పుల అనుభవాలను తీసుకొని ప్రత్యేకంగా ఒక పుస్తకాన్ని తీసుకొచ్చి ఇక ముందు రైస్‌మిల్లు ఓనర్లకు ఏ తప్పించుకోని అవకాశం ఇవ్వకుండా చర్యలు చేపట్టారు. దీనితో కోర్టుల్లో ముందస్తు బెయిల్ రాకుండా పోయింది. మరోవైపు కొంతమంది మిల్లర్లు ఇతర దేశాలకు పారిపోయే అవకాశం ఉందని తెలిసి వారిపై లుకౌట్ నోటీసులు కూడా జారి చేయడానికి ఉపేక్షించకూడదని కింది స్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు పరిస్థితికనుగుణంగా చర్యలు తీసుకొనే స్వేచ్ఛను ఇచ్చారు. దీనితో ప్రతి రోజు సిఎంఆర్ ధాన్యం అక్రమార్గం పట్టించిన మిల్లర్లు బిక్కుబిక్కుమంటూ ఎప్పుడు తాము ఊచలు లెక్కించాల్సి వస్తుందో అనే భయంతో నెట్టుకొస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ ధాన్యంపక్కదారి పట్టించిన రైసు మిల్లులపై మిల్లుల్లో విజిలెన్స్, ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు మెరుపుదాడి చేసి తనిఖీలు చేయడం జులై 20నుంచి నిరంతరంగా కొనసాగిస్తూనే ఉంది. విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ శాఖ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో 89రైస్‌మిల్లుల్లోనే3,72,693.23 టన్నుల ధాన్యం మాయం అయినట్లు అధికారులు గుర్తించారని తెలిసింది. ఈ వడ్ల విలువ రూ.927.16 కోట్లు అయితే ఇందులో పదిరోజులుగా రూ. 715 ప్రభుత్వం రాబట్టింది మొత్తానికి ఈ సారి భారీగా రికవరీ చేయగలిగారు. బ్యాంకుల నుంచి వడ్డీకి రుణాలు తీసుకుని రైతులకు డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన వడ్లను మిల్లర్లకు ఇస్తే..మరాడించి బియ్యం ఇవ్వకుండా అమ్మేసుకుంటున్నారు. పక్కదారి పట్టించిన వడ్లలో 2022-23 రబీ, 2025-26 ఖరీఫ్ సీజన్లకు సంబంధించినవే అత్యధికంగా ఉన్నాయి. మరోవైపు అజ్ఞాతంలోకి వెళ్ళిన కొంతమంది రైసుమిల్లరపై లుకౌట్ నోటీసులకు సన్నాహాలు చేస్తున్నారు. ఒకే ఒక్కరోజు జులై మూడోవారం భారీ స్థాయిలో రైసుమిల్లులు ధాన్యం పక్కదారి పట్టించిన వరగంల్, మహబూబ్‌నగర్, జగిత్యాల, నల్లగొండ,సూర్యపేట మెదక్ రైసుమిల్లుపై దాడి చేసి రూ.154 కోట్ల ధాన్యం రైసు మిల్లులు పక్కదారిపట్టించినట్లు గుర్తించి కేసులుపెట్టారు. జులై చివరివారం రెండవ అతి పెద్ద ధాన్యం వ్యత్యాసం ఐదు రైస్ మిల్లుల్లో ఏకంగా రూ.106 కోట్ల అక్రమాల్నిగుర్తించారు. ●

జార్ఖండ్

పరీక్షలే ఇప్పుడు ప్రభుత్వాలకు పరీక్షగా మారుతున్నాయి. ఢిల్లీ జంతర్ మంతర్‌వద్ద రగిలినఆందోళనల జ్వాలలు ఇప్పుడు రాంచీ మీదుగా వివిధ రాష్ట్రాలకువిస్తరిస్తూ అందరిలో ఆందోళన పెంచుతున్నాయి. విద్యార్థులు,ఉద్యోగార్థులు చేయిచేయి కలిపి తమకు న్యాయం కలిగించని ప్రభుత్వాలపై తిరగబడడం రాజకీయ నాయకులలో దడపుట్టిస్తోంది. జంతర్ మంతర్ ఆందోళనల ఫలితంగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ఒక కీలక పరిణామమైతే, జార్ఖండ్‌లో సోరెన్ నాయకత్వంలోని జెఎంఎం ప్రభుత్వం ప్రస్తుతం గడ్డుపరిస్థితిని ఎదుర్కోవడం మరో కీలక పరిణామం. మూడు వారాలుగా విద్యార్థులు, ఉద్యోగార్థులు రాంచిలో సాగిస్తున్న ఆందోళనల జ్వాలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ నేతలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్సీ)జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెపిఎస్‌సి) నిర్వహించిన నియామక పరీక్షల్లోని అవకతవకల ఆరోపణలకు వ్యతిరేకంగా ఆందోళనలు ఉద్రిక్తతలను పెంచుతున్నాయి. జెఎస్ఎస్‌సి కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సిజిఎల్) పరీక్షను రద్దు చేయాలని, నియామకాల్లోని అవకతవకలపై సిబిఐదర్యాప్తు జరపాలనీ ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు.విద్యార్థినేతలు, ప్రభుత్వం మధ్య ఇప్పటికి మూడు దఫాలుగా చర్చలు జరిగినా సమస్యకు పరిష్కారం లభించకపోవడం చూస్తే ప్రభుత్వం ఎంత మొండివైఖరితో ఉన్నదో స్పష్టమవుతుంది. 14వ జెపిఎస్‌సి నియామక పరీక్ష రద్దు చేస్తామనీ, నిర్వహించిన టిడిపిఎల్ సంస్థపై ఇడి విచారణకు ఆదేశిస్తామనీ ప్రభుత్వం హామీ ఇచ్చినా సిబిఐ విచారణ జరిపించే వరకు తాము వెనక్కి తగ్గబోమని ఉద్యమ నాయకులు స్పష్టం చేస్తున్నారు. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో జెపిఎస్‌సికి చెందిన ముగ్గురు సభ్యులు డా.అజిత్ భట్టాచార్య, డా. అనిమా హన్స్ దా, డా.జమీల్ అహ్మద్ ఇప్పటికే రాజీనామాచేశారు. సిజిఎల్ పరీక్షను సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకే నిర్వహించామనీ, అది న్యాయ పరిధిలో ఉన్నందున రద్దు కుదరదనీ మంత్రి సుదివ్య కుమార్ సోను ప్రకటించిన తర్వాత ఆందోళనలు మరింత ఉధృతమయ్యాయి. సిజిఎల్ పరీక్ష

# ‘పరీక్షా’ కాలం!

**ఎ.వి.వి ప్రసాద్**

ఫలితాలు కూడా వచ్చేశాయి. రెండు వేల మంది పైగా అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరడంకూడా పూర్తయింది. అటువంటప్పుడు పరీక్ష రద్దు కోరడమేమిటని ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. పార్లమెంటును నీట్ ఆందోళనలు ఓ కుదుపు కుదిపితేనియామక పరీక్షలు జార్ఖండ్ అసెంబ్లీని తలకిందులు చేస్తున్నాయి. గత సోమవారం విద్యార్థి ఉద్యమం హింసాత్మకంగా మారి రక్తపాతాన్ని సృష్టించడంతో దానిప్రభావం అసెంబ్లీపై ఎక్కువగా పడింది.


విద్యార్థుల ఆందోళన

బుధవారం దాకా కొనసాగవలసిన అసెంబ్లీమంగళవారమే నిరవధికంగా వాయిదా పడింది. విద్యార్థులపై జరిగిన లాఠీ చార్జిని నిరసిస్తూ విపక్ష ఎమ్మెల్యేలు గళమెత్తడంతో అసెంబ్లీ ముందుకు కదలని పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగాలను డబ్బుకు అమ్ముకుంటున్నారంటూ పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో కరెన్సీని వెదజల్లడం నిరసనలకు పరాకాష్ట అనాలి. పరీక్షల సంస్కరణలకు సంబంధించి 855 సలహాలు వచ్చాయనీ, జవాబు దారీవ్యవస్థను మెరుగుపరుస్తామనీ సిఎం సోరెన్ అసెంబ్లీలో ప్రకటించినా ఎమ్మెల్యేలు వెనక్కితగ్గకపోవడంతో స్పీకర్ విధిలేక సభను నిరవధికంగా వాయిదా వేయవలసి వచ్చింది. పరీక్షల అవకతవకలపైనిరాహారదీక్ష చేస్తున్న ఆరుగురిలోరాహుల్ క్రాంతి ఆసుపత్రి ఐసియు నుంచే దీక్ష కొనసాగించడం ఉద్రిక్తతను మరింత పెంచుతోంది. జంతర్ మంతర్ ఆందోళనల్లో సోనమ్ వాంగ్చుక్ లా రాంచీ ఆందోళనల్లో దీపేంద్ర నాథ్ మహతో నిరవధిక నిరహార దీక్ష కొనసాగిస్తున్నారు. జార్ఖండ్ లోక్ తాంత్రిక్ క్రాంతికార్ మోర్చా (జెఎల్‌కెఎం) నేత అయిన మహతో చేస్తున్న దీక్ష జెఎంఎం ప్రభుత్వ పునాదులను కదుల్చుతున్నట్లే కనిపిస్తోంది. జెపిఎస్ సి మాజీ చైర్మన్ ఎల్.ఖియంగ్తేను సిఐడి పోలీసులు గత సోమవారం అరెస్టు చేసిన తర్వాత ప్రభుత్వం ఆందోళనకారులతో మరో దఫాచర్చలు జరిపినా ప్రయోజనం లేకపోవడంతో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పినట్లే కనిపిస్తోంది.నిషేధిత సంస్థ టిఎస్సార్ డేటా ప్రాసెసింగ్‌కు పరీక్ష నిర్వహణ కాంట్రాక్టు అప్పగించడాన్ని కూడా విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఖియంగ్తే 2 కోట్ల రూపాయల లంచంతో పాటు 20శాతం కమిషన్ కూడా తీసుకొన్నట్లు ఆరోపణలున్నాయి. అటువంటి వారు మరికొందరుకూడా ఉన్నారు. దానిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాధానం లభించకపోవడం అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది.కేవలం కంటితుడుపు చర్యగా కొందరు ముఖ్యులతో రాజీనామాలు చేయించినట్లుకనిపిస్తోంది.గత సోమవారం రాంచిలో ఆందోళనకారులు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి చివరికి హింసాత్మకం అయింది. ఒక దశలో పోలీసులు లాఠీ చార్జిని కూడా జరిపి, బాష్పవాయువును ప్రయోగించారు. కొన్ని డజన్ల మంది తీవ్రంగా గాయపడ్డారు కూడా. ఈఘటన దేశవ్యాప్తంగా తీవ్రసంచలనం కలిగించింది. ఇషాంత్ సింగ్ యుద్ధంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే శనివారం స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఆందోళనకారులు భారీగా నిర్వహించిన ‘తిరంగా యాత్ర’ నిరసన ర్యాలీ కూడా దేశంలో అందరి దృష్టినీ ఆకర్షించింది. ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్న సిబిఐ దర్యాప్తునకు ప్రభుత్వం ఇంకా అంగీకరించకపోవడంతో పరిస్థితి పూర్తిగా చేయిదాటుతోంది.ప్రభుత్వం,విద్యార్థులు, ఉద్యోగార్థులు ఈ ఆందోళనలకు ఒక సరైన ముగింపుఇవ్వకపోతే ప్రజలు తీవ్రసమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. ఆందోళనకారులు సమస్యను మరింత సాగదీయకుండా ఒక సామరస్య పరిష్కారానికి ప్రయత్నించాలి.పరీక్షల్లో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఒక పటిష్టమైన, పారదర్శకమైన అధికారయంత్రాగాన్ని ప్రభుత్వం రూపొందించవలసి ఉంది. లేకుంటే ప్రభుత్వానికి నిత్యం పరీక్షే ఎదురవుతూంటుంది. ●

ఫ్రాన్స్

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సర్కారుకు రాజకీయ సంక్షోభంతోపాటు ప్రధాని కార్యాలయం ఉద్యోగుల ఆత్మహత్య ఘటనలు సతమతం చేస్తున్నాయి. రెండేళ్లలోనే నలుగురు ప్రధానులు మారిన మాక్రాన్ సర్కారులో ఉన్నత ఉద్యోగులు, కొత్త కేబినెట్ రాక వంటివాటితో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి పెరిగిందన్న భావన ఎక్కువైంది. మరీ ముఖ్యంగా ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకోర్ను కార్యాలయానికి అనుబంధంగా పనిచేసే వివిధ ప్రభుత్వ విభాగాల్లో వరుసగా ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఉద్యోగులపై మానసిక వేధింపుల ఆరోపణలపై ఫ్రెంచ్ ప్రాసిక్యూటర్లు క్రిమినల్ దర్యాప్తు ప్రారంభించారు. ఈవ్యవహారంలో పారిస్ ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రాథమిక దర్యాప్తును చేపట్టింది.ఇప్పటివరకు ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మహత్య చేసుకోగా, మరో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. మరో ఉద్యోగి మృతి కూడా అనుమానాస్పద పరిస్థితుల్లో జరిగింది. రాజకీయ దుమారాన్ని అరికట్టేందుకు ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలకు సంబంధించిన ఉద్యోగుల్లో ఎవరూ ప్రస్తుత ప్రధానమంత్రి సెబాస్టియన్ లెకోర్ను వ్యక్తిగత కార్యాలయంలో పనిచేయలేదని, వారెవరూ ప్రధానమంత్రితో నేరుగా పని చేసిన సిబ్బంది కాదని చెపుతున్నా ఆత్మహత్యల పరంపర విస్తృత దర్యాప్తునకు బాటలు వేసింది. దీనికి గత ఏప్రిల్‌లో జరిగిన ఓప్రభుత్వ ఉద్యోగి లారా అనే సీనియర్ ప్రభుత్వ ఉద్యోగిని ఏప్రిల్‌లో రైలు ముందు దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మూలం అయింది. ఓవ్యక్తి ఆమెను రక్షించడంతో ప్రాణాలతోబయటపడ్డారు. ఆతర్వాత లారా తన కార్యాలయంలో తనపై మానసిక వేధింపులు, అవమానకర ప్రవర్తన, తన ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులు సృష్టించారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. ప్రధాన మంత్రి కార్యాలయ సేవలకు అనుబంధంగా ఉన్న కరస్పాండెన్స్ విభాగంలో పనిచేసిన తనను ఉద్దేశపూర్వకంగా ఒంటరి చేశారని ఆమెఆరోపించారు. ఆమెను సమావేశాలకు పిలవకుండా చేయడం, సంస్థాగత చార్టుల నుంచి ఆమె పేరును తొలగించడం, సహచరుల నుంచి దూరంగా ఉంచడం, అవమానించడం, ఎగతాళి చేయడం వంటి చర్యలకు గురిచేశారని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కొన్ని నెలలముందే లారా తన వీలునామా,అంత్యక్రియలకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసుకున్నట్లు ఫ్రెంచ్ మీడియాలో విస్తృత వచ్చాయి. లారా ఘటన ఒక్కటే కాదని ప్రధాన మంత్రి కార్యాలయ సేవల పరిధిలోనిప్రభుత్వ విభాగాల్లో గత కొంతకాలంగా ఇలాంటి విషాద

# ఆత్మహత్యల ‘సెగ’లు!

**గన్ని మోహన్**


సెబాస్టియన్ లెకోర్ను


ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అధికారులు చెబుతున్నారు. గత అక్టోబర్‌లో ఓప్రభుత్వఉద్యోగి కార్యాలయంలోనే ఆత్మహత్యకు ప్రయత్నించారు. మార్చిలో ఓప్రాజెక్ట్ మేనేజర్ ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. మరో ప్రభుత్వ ఉద్యోగి కార్యాలయ తీవ్ర ఒత్తిడితో రైలు ముందు దూకిమరణించినట్లు ఆరోపణలున్నాయి. లారా ఆత్మహత్యాయత్నం అనంతరం పారిస్‌లోని ప్రభుత్వ కార్యాలయంలో ఓ యువ ఉద్యోగి మృతదేహం కూడా లభించింది. ఈవరుస ఘటనల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల పని వాతావరణం, మానసిక ఆరోగ్యం, ఉన్నతాధికారుల వ్యవహారశైలిపై ప్రశ్నలుతలెత్తాయి. ప్రభుత్వంలోనే వ్యవస్థాగత స్థాయిలో ఉద్యోగులపై వేధింపులు జరు గుతున్నాయంటూ ఓ సిబ్బంది ప్రతినిధి జూన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగానే ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రాథమిక దర్యాప్తును ప్రారంభించింది.ఉద్యోగులపై వ్యక్తిగతంగా వేధింపులు జరిగాయా? ప్రభుత్వ విభాగాల్లోని విధానాలు, తరచూ జరుగుతున్న మార్పులు, అధికారులశైలి కారణంగా వ్యవస్థాగత ఒత్తిడిఏర్ప డిందా అనే అంశాలను దర్యాప్తులోకి చేర్చారు. ఫ్రాన్స్‌లో గత రెండేళ్లుగా కొనసాగుతున్న రాజకీయ అస్థిరత కూడా ప్రభుత్వ ఉద్యోగులపై పనిఒత్తిడిని పెంచిందని ఉద్యోగ సంఘాలు,సిబ్బంది ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ జాతీయ అసెంబ్లీని రద్దు చేసిన తర్వాత దేశరాజకీయాల్లో అనిశ్చితి పెరిగింది. రెండేళ్లలో ఫ్రాన్స్‌కు నలుగురు వేర్వేరు ప్రధానమంత్రులు రావడంప్రభుత్వ యంత్రాంగంలో తరచూ నాయకత్వ మార్పులకు దారితీసింది. ప్రధానమంత్రి మార్పులతోపాటు ఉన్నత స్థాయి అధికారుల బదిలీలు, మేనేజ్‌మెంట్ పునర్వ్యవస్థీకరణలు, విభాగాలపునర్నిర్మాణం తరచూ జరగడంతో ఉద్యోగుల్లో అయోమయం, అస్థిరత, ఒత్తిడి పెరిగిందని ఫ్రెంచ్ మీడియాతో పలువురు సిబ్బంది తెలిపారు. ప్రాసిక్యూటర్ కార్యాలయం చేపట్టిన క్రిమినల్ దర్యాప్తుతోపాటు ఫ్రెంచ్ ప్రభుత్వంకూడా ఈఘటనలపై అంతర్గత విచారణలకు ఆదేశించింది. వ్యక్తిగతంగా జరిగిన విషాద ఘటనలను పరిశీలించడంతో పాటు ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగుల సంక్షేమం, పని పరిస్థితులపై కూడా సమగ్రసమీక్ష చేపట్టింది. ఉద్యోగుల మానసిక ఆరోగ్యం,కార్యాలయ వాతావరణం, నిర్వహణ విధానాలు, ఉద్యోగులపై ఒత్తిడివంటి అంశాలపై దర్యాప్తు చేసారు.ప్రధాని కార్యాలయంలోని అన్ని విభాగాల్లో పని పరిస్థితులపై ప్రత్యేక నిపుణుల ఆడిట్ నిర్వహణకు ఆదేశించడంతో పీఎంవో సేవల పరిధిలోని ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగులపై మానసిక ఒత్తిడి, వేధింపులు ఉన్నాయన్న ఆరోపణలపై ఇప్పుడు క్రిమినల్ దర్యాప్తు ప్రారంభం కావడం ఫ్రాన్స్ ప్రభుత్వ యంత్రాంగంలో ఉద్యోగుల పని పరిస్థితులపై తీవ్రచర్చకు దారితీసింది. వరుస ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాల వెనుక వ్యక్తిగత కారణాలే ఉన్నాయా? లేక కార్యాలయాల్లోని వేధింపులు,పరిపాలనా అస్థిరత, అధికపని ఒత్తిడి కూడా కారణమా?అనే అంశాలపై దర్యాప్తు పూర్తయ్యే వరకు స్పష్టత వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వ ఉద్యోగుల మానసిక ఆరోగ్యం, సురక్షితమైన పనివాతావరణం కల్పించాల్సిన బాధ్యతను ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు ఈ ఘటనలు మరోసారి గుర్తుచేస్తున్నాయి. ●

# కొత్త ఆధ్యాత్మిక చైతన్యమే ‘ఇస్కాన్’

**డి.శ్రీనివాస్**

అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్సియస్ నెస్...ఈ పేరు నేడు ఒక ఆధ్యాత్మిక విప్లవానికి పర్యాయపదం. కృష్ణ చైతన్యానికి మారు పేరు. హరినామ సంకీర్తన ధ్యేయంగా, శ్రీమద్ భగవద్గీత పునాదిగా, శ్రీమద్ భాగవతం, శ్రీ చైతన్య మహాప్రభు బోధనలు ఆలంబనగా విరాజిల్లుతోంది. హారేకృష్ణ హారేకృష్ణ కృష్ణ కృష్ణ హారే హారే.. హారే రామ హారే రామ రామ రామ హారే హారే.. అనే మహామంత్రం భక్తులు నిత్యం వందలు, వేలసార్లు జపిస్తూ ధార్మిక జగత్తులో ఓలలాడుతున్నారు. భౌతిక సుఖాలకు పాకులాడకుండా శాశ్వతమైన గోలోకా బృందావనాన్ని చేరుకోవాలని తపిస్తుంటారు. ఏ.సి. భక్తివేదాంత స్వామి ఈ సంస్థ వ్యవస్థాపక ఆచార్యులు. తదనంతరం వీరే శ్రీల ప్రభుపాదులుగా వ్యవహారింపబడినారు. ఇస్కాన్‌ను భక్తి వేదాంత స్వామి 1966 జులై 13 న న్యూయర్క్‌లో ఏర్పాటు చేశారు. అలా ఈ సంస్థ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఇటీవలనే ఉత్సవాలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. ఇస్కాన్ స్థాపించాక వారు ప్రపంచవ్యాప్తంగా 108 కృష్ణ మందిరాలను నెలకొల్పారు. అందులో భాగంగా మనదేశంలో వారు తన స్వహస్తాలతో మాయాపూర్, కొలకత్తా, బృందావనం, హైదరాబాద్‌లో ఇస్కాన్ మందిరాలను ప్రతిష్టించారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఇస్కాన్ శ్రీశ్రీ రాధా మదన మోహన మందిరాన్ని 1976 ఆగస్టు 18న ప్రతిష్టించారు. అంటే ఈనెల 18తో ఈ మందిరం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్నాయి. ఒకవైపు ఇస్కాన్ ఏర్పడి 60 సంవత్సరాలు, ఇస్కాన్ హైదరాబాద్ ఆబిడ్స్ మందిరం 50 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భంగా వీటి వివరాలు ఒకసారి పరిశీలిద్దాం. భక్తివేదాంత స్వామి కలకత్తాలో 1896 సెప్టెంబర్ 1న సాంప్రదాయ గౌడియ వైష్ణవ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు పెట్టిన పేరు అభయ్. సంప్రదాయంగా వచ్చిన భక్తితో పాటు వారి తండ్రి మోహన్ దే కున్న అపారమైన భక్తి వీరికి కూడా బాల్యం నుండే అబ్బింది. అదే తదనంతర కాలంలో తన ఆధ్యాత్మిక ప్రయాణానికి బాటలు వేసింది. అందులో భాగంగా వేదాంత స్వామి 1922లో శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఠాకూర్ మాట్లాడుతూ ఆంగ్ల భాష తెలిసిన మీరు పాశ్చాత్య దేశాలలో కృష్ణ చైతన్యం ప్రచారం చేయాలని అభిలషించారు. అలాగే 1932లో సరస్వతి ఠాకూర్ మరోమారు వేదాంత స్వామికి ‘నీవద్ద డబ్బులు ఉంటే కృష్ణ చైతన్యం పుస్తకాలు’ ప్రచురించాలని, రచనలు చేయాలని సూచించారు.1935లో వారి వద్దనే వేదాంతస్వామి దీక్ష తీసుకున్నారు. 1944లో కలకత్తా నుండి ‘బ్యాక్ టు హెడ్’ పత్రికను ప్రారంభించారు. అనేక ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ పత్రికను ప్రచురించారు. కృష్ణ చైతన్యం కొరకు కృషిచేశారు. పత్రిక ప్రచురణ, కృష్ణ చైతన్యం లక్ష్యంగా ఢిల్లీ తరచుగా వెళ్లేవారు. ఎందరినో కలిసి సహకరించాలని అభ్యర్థించేవారు.అయినా చేయూత లభించలేదు. కృష్ణ ప్రచారం పోరాటంలో బృందావనానికి తన మకాన్ని మార్చారు. అంతేకాకుండా 1959లో సన్యాసం స్వీకరించారు. గురువు ఆజ్ఞ మేరకు పుస్తకం ప్రచురణ, అనువాదం చేయటం ప్రారంభించారు. ఆశించిన రీతిలో ఆధ్యాత్మిక ప్రయాణం సాగటం లేదని గుర్తించి అమెరికా వెళ్లాలన్న చెక్కుచెదరని సంకల్పంతో ముందుకు సాగారు. ప్రచారం చేయాలని తలిచారు. చేతిలో డబ్బులు లేవు. వెళ్ళాక ఎక్కడ ఉండాలో తెలియదు. అయినా సంకల్పం చెక్కుచెదరలేదు. ఎట్టకేలకు సింధియా స్టీమ్ షిప్ లైన్ సంస్థ అధినేత్రి సుమతి మురార్జీని వేదాంతస్వామి 1965 ఆగస్టు 13న కలకత్తా షిప్ హార్బర్ నుండి జలదూత అనే షిప్‌లో ప్రయాణమైనారు. 37 రోజుల ప్రయాణం తర్వాత సెప్టెంబర్ 19న న్యూయార్క్ చేరుకున్నారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని బట్లర్ నగరంలో ఉన్న గోపాల్ ఆగర్వాల్‌ఇంటికి వెళ్లారు. అనంతరం అనేక ప్రదేశాలలో తిరుగుతూ కృష్ణ చైతన్యం బోధనలు ఇవ్వసాగారు. అయితే ఆ రోజులలో అమెరికాలోని చాలా ప్రాంతాలలో యువత హిప్పి కల్చర్


శ్రీశ్రీ రాధా మదన మోహన


శ్రీల ప్రభుపాదులవారు

కలిగి, మత్తు మందులు, మాదక ద్రవ్యాలు,తాగుడుకు బానిసలై ఉండటాన్ని గమనించిన వేదాంతస్వామి ఆశ్చర్యకరంగా వారి మధ్యనే నివసించాల్సిన పరిస్థితులు నెలకొని ఉండేవి. అమెరికాలో 9 నెలలకు పైగా నిర్విరామంగా కృష్ణబోధనలు చేస్తూ, భారతీయ ఆధ్యాత్మికం, కృష్ణచైతన్యం పట్లవిశ్వాసం ఉన్న వ్యక్తుల తోడ్పాటుతో వేదాంతస్వామి తనకంటూ ఒక ఆశ్రయం ఏర్పాటు చేసుకున్నారు. న్యూయార్క్‌లోని సెకండ్ అవెన్యూ స్టోర్ ఫ్రంట్‌లో కృష్ణ సందేశాలు ఇవ్వడానికిహాల్, తాను నివాసం ఉండేందుకు ఒక గది కల భవనంలోకి తన మకాంని మార్చారు. అక్కడి నుండే కృష్ణ చైతన్య ప్రచారం కార్యక్రమాలు, భజనలు, హరినామ సంకీర్తనలు, శ్రీమద్ భగవద్ గీత, భాగవతం, కృష్ణ సంబంధ గ్రంథాలపై ప్రవచనాలు భక్తివేదాంత స్వామి ఇచ్చారు. ఈ కృష్ణ చైతన్య యాత్రలో చిరస్థాయిగా నిలిచేందుకు వారు 1966 జులై 13న ‘ఇస్కాన్’ ను స్థాపించారు. పూర్తి స్థాయి సంస్థగా రూపాకల్పన చేశారు. పుస్తక రచనలు, అనువాదాలు, ప్రచురణల కొరకు ‘భక్తి వేదాంత బుక్ ట్రస్ట్’ ను నెలకొల్పారు. శ్రీ అభయ చరణారవింద భక్తి వేదాంత స్వామి తదనంతరం శ్రీల ప్రభుపాదులుగా ప్రసిద్ధి చెందారు.ఎంతో మందికి దీక్షలు ఇచ్చారు.70కి పైగా వైదిక గ్రంథాలు, కృష్ణచైతన్య పుస్తకాలకి సంబంధించి సంపుటాలు రచించారు, అనువదించారు, అలాగే వాటికి వ్యాఖ్యనాలు రాసారు.వీరి గ్రంథాలు 95 భాషలలోకి అనువాదం అయ్యాయి. భగవద్గీత యధాతథం, శ్రీమద్ భాగవతం, శ్రీ చైతన్య చరితామృతం, భక్తి రసామృతం, శ్రీ ఈశోపనిషత్తు,ఉపదేశామృతం, దేవాదిదేవుడు శ్రీకృష్ణ భగవానుడు వంటిఅనేక సుప్రసిద్ధమైనగ్రంథాలు ఇవి కొన్ని. ఇక శ్రీల ప్రభుపాదులవారు కేవలం 11సంవత్సరాల వ్యవధిలో 14 సార్లు ప్రపంచాన్ని చుట్టివచ్చారు.తన జీవిత కాలం అంతా కృష్ణసేవలో, ఆచార్యుల మార్గనిర్దేశంలో గడిపిన శ్రీల ప్రభుపాదులవారు 1977 నవంబర్ 14న తనువు చాలించారు. నేడు అనేక దేశాలలో ఇస్కాన్ కృష్ణ మందిరాలున్నాయి. కోట్లల్లో ఇస్కాన్ భక్తులున్నారు. వివిధ సేవ కార్యక్రమాలు, ఉచిత భోజన వితరణ, విద్యా సంస్థలు, గోశాలలు, గురుకులాలు, వర్ణాశ్రమాలు, సమాజ హితం కోసం పనులు చేస్తూ, మరోవైపు భక్తి యుత సేవ చేస్తూ ఇస్కాన్ నేడు ఆధ్యాత్మిక భూలోక బృదావనంగా తీర్చిదిద్దబడింది. ముఖ్యంగా జగన్నాథ రథయాత్రలు అన్ని చోట్లా నిర్వహిస్తున్నారు.ప్రపంచవ్యాప్తంగా 150కి పైగా దేశాలలో ఇస్కాన్ కృష్ణ చైతన్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 900కు పైగా ఇస్కాన్ రాధాకృష్ణ మందిరాలు నెలకొల్పబడినాయి. 75కోట్ల భక్తి గ్రంథాలు ప్రపంచ దేశాలలో అనేక భాషలలో వితరణ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 1.2కోట్ల మంది భక్తులు ఇస్కాన్ ఆలయాలను సందర్శిస్తున్నారు. భారతదేశంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమం ద్వారా ప్రతి రోజూ సుమారు 30లక్షల మంది పిల్లలకు భోజనం అందించబడుతోంది. వైద్యసేవల్లో భాగంగా ఇస్కాన్ ఆసుపత్రులు, వైద్య శిబిరాలు, నేత్ర శిబిరాల ద్వారా ఇప్పటివరకు సుమారు 3.4 లక్షల మంది రోగులు సేవలను పొందారు. 1967నుంచి ఇప్పటివరకు సుమారు ఒక లక్షమంది భక్తులు అధికారిక ఆధ్యాత్మిక దీక్షను స్వీకరించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా సుమారు 6వేల కృష్ణ చైతన్య ఉత్సవాలు నిర్వహించబడుతున్నాయి. హైదరాబాద్ అబిడ్స్‌లోని ఇస్కాన్ శ్రీశ్రీ రాధా మదన మోహన మందిరం ఈనెల 18వ తేదీతో 50సంవత్సరాలు పూర్తిచేసుకుని, స్వర్ణోత్సవ శోభను సంతరించుకుంది. శ్రీల ప్రభుపాదులు 1976 ఆగస్టు 18న ఈ మందిరంలో శ్రీ శ్రీ రాధా మదన మోహన, శ్రీ శ్రీ గౌరనితాయి, శ్రీశ్రీజగన్నాథ, సుభద్ర, బలదేవ విగ్రహాలను ప్రతిష్టించారు. 50 ఏళ్ళ ప్రస్థానాన్ని అత్యంత వైభవంగా ఆలయకమిటీ నిర్వహిస్తోం ది. ఈ సందర్భంగా ఆగస్టు 15, 16, 17, 18 తేదీలలో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా 5లక్షల భోజనాలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ప్రత్యేక గీతాన్ని ఆవిష్కరిస్తారు. 50ఏళ్ల ప్రస్థానంలో సేవలందించిన వారికి సత్కారం చేయాలని నిర్ణయించారు. భక్తితత్వంతో నిస్వార్థ సేవ.. అమెరికాలో అననుకూల పరిస్థితులను సైతం సానుకూలంగా మార్చుకుని యువతను ‘కృష్ణ చైతన్యం’లోకి తెచ్చారు. జీవితాన్ని తరతరాలకు ఆదర్శనీయంగా తీర్చిదిద్దారు. ●

# ప్రధాని చెప్పిన 'సప్తధార'లు ఇవీ..

## ఏడు లక్ష్యాలతో దేశ అభివృద్ధికి వడివడిగా అడుగులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** సప్తధార శక్తి సామర్థ్యాలతో దేశాన్ని నూతన శిఖరాలకు తీసుకెళ్తామన్న ప్రధానిమోడీ భారతావనికి నూతన వేగం అందిస్తామని, సరికొత్త లక్ష్యాలను సాధించి, వాటిని అధిగమించేలా శక్తివంతం చేస్తామన్నారు. యువతలో ఉన్న అపార సామర్థ్యాలను దేశ నిర్మాణం కోసం పూర్తిగా వినియోగిస్తామన్నారు. యువత ప్రతిభ, ఉత్సాహం, శక్తిని ఏకం చేసి బలమైన, మరింత అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించే దిశగా మళ్లిస్తామని మోడీ ప్రకటించారు. తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతి శక్తి, రక్ష శక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్ అనే ఏడు ధారల సాయంతో దేశాన్ని స్వయం సమృద్ధం చేస్తామన్నారు. దేశ ప్రగతికి తయారీ రంగాన్ని భారత భవిష్యత్తుకు గ్రోత్ ఇంజిన్‌గా అభివర్ణించిన ప్రధాని మోడీ తయారీ రంగానికి ఊతమివ్వాలని పిలుపునిచ్చారు. మనకు విడి భాగాలతోపాటు పూర్తి స్థాయి ఉత్పత్తులు కూడా కావాలన్న ప్రధాని ప్రపంచ సప్లయ్ చైన్‌లో భారత్ కేంద్ర బిందువుగా మారాలని పిలుపునిచ్చారు. సప్తధారలో రెండో ధారగా వ్యవసాయం, ఆహార శుద్ధి రంగాన్ని ప్రధాని మోడీ అభివర్ణించారు. ఈ దిశలో మనం ముందుకెళ్లాలన్న ప్రధాని ఇప్పుడు ప్రపంచ మార్కెట్లు మన రైతులకు తెరిచి ఉన్నాయన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల అతిపెద్ద మార్కెట్లు సైతం మనకు అందుబాటులోకి వస్తున్నాయని మనం వాటిని చేరుకోవాలన్నారు. పొలం నుంచి ఎగుమతి మార్కెట్‌కు మన ఉత్పత్తులను మళ్లించాలన్నారు. మన సంప్రదాయ ఆహారం, మిల్లెట్స్, సుంగధ ద్రవ్యాలు, పండ్లు, కూరగాయలు అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. మూడో సప్తధారగా టెక్నాలజీ, ఆవిష్కరణలు అని పేర్కొన్న మోడీ డేటా సెంటర్లు, రోబోటిక్స్, సరికొత్త టెక్నాలజీల యుగం నడుస్తోందన్నారు. ఈ టెక్నాలజీల హబ్‌గా భారత్ మారాలని పిలుపునిచ్చారు. యుపిఐని ప్రవేశపెట్టడం ద్వారా మన సామర్థ్యం ఏంటో మనకు తెలిసిందన్నారు. మేడిన్ ఇండియా 6జీ దేశమంతటా చేరాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. యుపిఐ, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాతోపాటు నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీలో మనం మరో పెద్ద అడుగు వేయాలన్నారు. దేశవ్యాప్తంగా వేగవంతమైన కనెక్టివిటీని పెంపొందించాలన్న ప్రధాని వ్యాపార రంగానికి ఊతం ఇవ్వడం కోసం కొత్త రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు ఏర్పాటుకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సప్తధారల్లో రక్షణ కూడా భాగమన్న ప్రధాని రక్షణ ఉత్పత్తుల తయారీ, రక్షణ రంగంలో భారత్ స్వయం సమృద్ధి సాధించాలన్నారు. డ్రోన్ టెక్నాలజీ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ టెక్నాలజీ భారత్ మరింత పెట్టుబడులు పెడుతుందన్నారు. గ్రీన్ ఎనర్జీని ఆరో ధారగా పేర్కొన్న ప్రధాని దేశంలో కాలుష్యం తగ్గించడం కోసం గ్రీన్ టెక్నాలజీ రంగంలో పెద్ద ఆవిష్కరణలకు పిలుపు నిచ్చారు. భారత సాఫ్ట్ పవర్‌ను ఏడో ధారగా ప్రకటించిన ప్రధాని యోగా, చేతివృత్తులు, సినిమా, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, సృజనాత్మక రంగాన్ని సాఫ్ట్ పవర్‌కు ఉదాహరణగా పేర్కొన్నారు. పెద్ద స్థాయిలో అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం భారత్‌కు ఉందన్న ప్రధాని దేశంలో అనేక జాతీయ పార్కులు, మ్యూజిక్ కన్సర్ట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, ఇతర ఆకర్షణీయ ప్రదేశాలు ఉన్నాయన్నారు.

## దిమాగీ నక్సల్స్‌తో జాగ్రత్త...

### యువతకు ప్రధాని మోడీ హెచ్చరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీజాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ దిమాగీ నక్సల్స్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. అడవుల్లో ఆయుధాలు పట్టిన నక్సలిజాన్ని విజయవంతంగా నిర్మూలించామని, సాయుధ నక్సల్స్ కనుమరుగైనా దిమాగీ నక్సల్స్ మిగిలి ఉన్నారని ప్రధాని అన్నారు. దిమాగీ నక్సల్స్ ఒక అవకాశం కోసం ఎదురుచూస్తున్నారని, సమాజాన్ని తప్పుడు మార్గంలోకి లాగడానికి వారు కొత్త ఎత్తుగడలు వేస్తున్నారని ప్రధాని మోడీ తెలిపారు. మనం వారిని గుర్తించి ఏకాకిని చేయాలని మోడీ సూచించారు.
3,500 మందికి పైగా భద్రతా సిబ్బంది నక్సలిజం పోరాటంలో అమరులయ్యారని, ఇది యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయిన వారికంటే ఎక్కువని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అలాగే ప్రస్తుతం దేశంలో జరుగుతోన్న జనగణన గురించి ప్రస్తావించారు. దానిలో యువత చురుగ్గా పాల్గొనాలని మోడీ పిలుపునిచ్చారు. నేను అందరినీ ఒక సాయం చేయాలని అడుగుతున్నాను. జనగణన విషయంలో ఒక గంటా, రెండు గంటల సమయం కేటాయించండి. అది దేశానికి ఎంతో ఉపయోగపడుతుంది. గణన అంటే లెక్కలన్నీ ఒక దగ్గర రాసుకోవడం కాదు. జనాభా లెక్కల సమయంలో మీరు ఇచ్చే వివరాల ఆధారంగానే జాతీయ విధానాలు, పథకాలు రూపుదిద్దుకుంటాయి.
దేశ ప్రగతికి ఆ లెక్కలు సూచీగా ఉంటాయి. అందుకే కచ్చితమైన, స్పష్టమైన సమాచారం ఇవ్వడం అత్యంత కీలకం అని మోడీ పేర్కొన్నారు. ఎర్రకోట వేదికగా ప్రధాని మోడీ యువతకు తీపి కబురు చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించారు. గడిచిన కొన్నేళ్లలో దేశంలో 650కి పైగా కొత్త విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ విద్యా విధానం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాలు కూడా భారత్‌లోకి వస్తున్నాయని, మన యువత స్వదేశంలోనే విదేశీ డిగ్రీలు పొందే అవకాశం లభించిందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.



## యుద్ధ నౌకలతో హర్మూజ్‌ను స్వాధీనం చేసుకోలేరు

### ట్రంప్‌కు ఇరాన్ కౌంటర్

**టెహ్రాన్, ఆగస్టు 15:** హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ అమెరికాదేనని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. జలసంధి ఎప్పటికీ తమ నియంత్రణలోనే ఉంటుందని.. దానిని ఎవరూ ఆక్రమించుకోలేరని పేర్కొంది. హర్మూజ్‌ను మూసి ఉంచాలా? తెరవాలా? అనేది తమ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాజెమ్ తెలిపారు. యుద్ధ నౌకల మోహారింపు ద్వారా జలసంధిని స్వాధీనం చేసుకోలేరని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. అగ్రరాజ్యం తన భ్రమలను విడిచిపెట్టి.. ఓటమిని అంగీకరించే వరకు హర్మూజ్‌పై ఇరాన్ దిగ్బంధనాన్ని అమలు చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. తాము బెదరింపులకు భయపడబోమని.. సైనిక ప్రదర్శనలకు లొంగబోమని స్పష్టం చేశారు. హర్మూజ్ ద్వారా నౌకలు స్వేచ్ఛగా ప్రయాణిస్తున్నాయని అమెరికా చెబుతున్న మాటల్లో నిజంలేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. గతంలో మాదిరిగానే.. జలసంధి పూర్తిగా తమ నియంత్రణలోనే ఉందన్నారు. తమ సాయుధ దళాల అనుమతి లేకుండా ఏ వాణిజ్య నౌక కూడా ఈ మార్గంలో ప్రయాణించబోదని స్పష్టం చేశారు. హర్మూజ్ విషయంలో అమెరికా తప్పుడు అంచనాలు వేస్తోందన్నారు.

**డొనాల్డ్ ట్రంప్ ఏమన్నారంటే..?**
యుద్ధంలో ఇరాన్‌ను ఓడిస్తామని.. ఆ దేశం ఓటమిని చవిచూసినతర్వాత హర్మూజ్‌ను అమెరికా భూభాగంగా ప్రకటిస్తామని శనివారం జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశంవద్ద అణ్వాయుధ సామర్థ్యం ఉండడం ఎప్పటికైనా ప్రమాదమేనని.. దానిని నాశనం చేయాలనే లక్ష్యంతో యుద్ధానికిదిగినట్లు వెల్లడించారు.

## భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం

### యుఎస్ విదేశాంగమంత్రి మార్కో రూబియో



**వాషింగ్టన్, ఆగస్టు 15:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శుభాకాంక్షలు తెలిపారు. భారత్-అమెరికా సంబంధాలు మునుపెన్నడూ లేనంత బలంగాఉన్నాయని పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య ఉన్న వ్యక్తిగత సాన్నిహిత్యమే ఇందుకు కారణమని చెప్పారు. రక్షణ, ఇంధన భద్రత, కీలక ఖనిజాలు, కృత్రిమ మేధ, అంతరిక్షం, వాణిజ్య రంగాల్లో ఇరు దేశాల సహకారం మరింత విస్తరిస్తోందని తెలిపారు. భారత్, అమెరికా ప్రజల మధ్య ఉన్న స్నేహం ద్వైపాక్షిక భాగస్వామ్యానికి పునాదిగా నిలుస్తోందని రూబియో పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం కేవలం రెండు దేశాల ప్రయోజనాలకే పరిమితం కాదని, అంతకు మించి విస్తరించి ఉందని స్పష్టం చేశారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఢిల్లీతో పరస్పర సహకారానికి వాషింగ్టన్ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భవిష్యత్తులోనూ భారత్‌తో కలిసి పనిచేసేందుకు అమెరికా ఎదురుచూస్తోందని తెలిపారు. ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్.. భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఇరు దేశాల మధ్య స్నేహ బంధం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. సింగపూర్ ప్రభుత్వం భారత్‌తో తమకున్న వ్యూహాత్మక, ఆర్థిక బంధాన్ని గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేక సందేశాన్ని విడుదల చేస్తూ.. ఇరు దేశాల మధ్య డిజిటల్ కనెక్టివిటీ, గ్రీన్ ఎనర్జీ, రక్షణ రంగాల్లో భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించింది.

## పోటీ పరీక్షార్థులకు ఆన్‌లైన్ ఉచిత కోచింగ్

### జనగణనలో అందరూ భాగస్వాములు కావాలి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వేదికగా ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ యువతకు కీలక ప్రకటన చేశారు. దేశంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రకటించారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లేందుకు మధ్యతరగతి, పేద కుటుంబాలు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని పేర్కొన్న ప్రధాని మోడీ వారిపై ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా పలు పోటీ పరీక్షల కోచింగ్ కోసం కుటుంబాలు రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆ భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. చదువుల కోసం యువత వారి కుటుంబాలకు దూరంగా వెళ్లాల్సిన పరిస్థితి కూడా తగ్గాలని అభిప్రాయపడ్డారు. దేశంలో ఇప్పటికే ఉన్న డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగించుకుని ఫ్రీ ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తోందని ప్రధాని మోడీ చెప్పారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, విద్యావేత్తల సేవలను ఈ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ కోసం ఉపయోగించుకో నున్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువతకు నాణ్యమైన విద్యా వనరులను అందుబాటులోకి తీసుకురావడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశంగా ఆయన ప్రసంగంలో వివరించారు. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనలో యువత చురుకుగా భాగస్వాములు కావాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.

## సిజెపి చీఫ్ ఇన్‌స్టాకు అంతరాయం.. ఎగసిన దుమారం

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ శనివారం కొద్దిసేపు నిలిచిపోయింది. ఈ విషయాన్ని సిజెపి ఫౌండర్ అభిజీత్ దీప్కే తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా వెల్లడించారు. సిజెపి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నిలిపివేయడాన్ని పిరికిపంద చర్యగా అభిజీత్ దీప్కే వర్ణించారు. అయితే, కొంతసేపటి తర్వాత అకౌంట్ తిరిగి ప్రారంభమైంది. ఈ అంశంపై దీప్కే స్పందించారు. సిజెపి అకౌంట్ నిలిచిపోవడానికి సంబంధించిన స్క్రీన్ షాట్లను సోషల్ మీడియాలో షేర్ చేసుకున్నారు. ఆయనతో పాటు సిజెపి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 6.16 గంటలకు సిజెపి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నిలిచిపోయింది. దీనిపై ఫిర్యాదు చేయడంతో 6.45 గంటలకు ఖాతా తిరిగి పునరుద్ధరించారు. భారత స్వాతంత్ర్య దినం రోజున తమ గొంతు నొక్కే ప్రయత్నం జరిగిందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని దీప్కే ప్రకటించారు. ఇది పిరికిపందలు చేసిన చర్యగా అభివర్ణించారు.

## మహిళను హత్యచేసి వన్యమృగాలకు ఆహారం

### ఏడువేల కిలోమీటర్లు ఛేదించి అరెస్టుచేసిన పోలీసులు

**జైపూర్, ఆగస్టు 15:** రాజస్థాన్‌లో షాబాజ్ అనే వ్యక్తి ముస్కాన్ అనే మహిళను హత్య చేసి ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు ఆమె మృతదేహాన్ని అడవి మృగాలకు ఆహారంగా వేశాడు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగాఉన్న షాబాజ్ ఖాన్‌ను రాజస్థాన్ పోలీసులు సుమారు ఏడు వేల కిలోమీటర్లు వెంబడించి బీహార్‌లో అరెస్ట్ చేశారు. జూన్ 22న ముస్కాన్ దారుణహత్యకు గురైంది. షాబాజ్ ఖాన్,అతని సహచరుడుకలిసి ముస్కాన్‌ను రాంపుర కొండప్రాంతంలో హత్య చేశారు. అక్కడ ఆమె తలపై రాళ్లతో కొట్టి చంపారు. అనంతరం మృతదేహాన్ని క్రూర మృగాలు తినివేస్తే ఆనవాళ్లు కూడా మిగలవనే దురాలోచనతో సమీపంలోని ఒక జంతువుల గుహవద్ద పడేశారు. అయితే మృతదేహం పూర్తిగాధ్వంసం కాకముందే పోలీసులుదానిని స్వాధీనంచేసుకున్నారు. అప్పటికే మిస్సింగ్‌కేసు పెట్టిన కుటుంబసభ్యులు అది ముస్కాన్ మృతదేహంగా నిర్ధారించారు.

## ఎర్రకోటవద్ద వందేమాతరం ఆలాపన చరిత్రాత్మకం




**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** చరిత్రాత్మక ఘటన చోటుచేసుకున్నది. వందేమాతరం గేయాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారంపూర్తి స్థాయిలో ఆ గీతాన్ని పాడారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆ గేయాన్ని పాడడం ఇదే మొదటిసారి. వందేమాతరం గీతాన్ని రాసి 150 యేళ్లు పూర్తి అవుతోంది. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గేయం కీలక పాత్ర పోషించింది. దేశ ప్రజల్లో ఆ పాట జాగృతి నింపింది. ప్రధాని మోడీ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తర్వాత ఎర్రకోటపై వందేమాతర గీతం ప్రతిధ్వనించింది. తొలుత 21 గన్ సెల్యూట్ చేశారు. 1721 ఫీల్డ్ బ్యాటరీ సెర్మోనియల్ గ్రూపు ఈ సెల్యూట్ నిర్వహించారు. 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్ వాడారు. ఆర్మీ బ్యాండ్ ద్వారా వందేమాతరాన్ని ఆలపించారు. ఎర్రకోట వేదికపై రెండు ఎంఐ17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఓ హెలికాప్టర్ జాతీయ పతాకాన్ని మోసుకెళ్లింది. మరో హెలికాప్టర్ వందేమాతరం గీతం రాసిన జెండాను తీసుకెళ్లింది. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారి వందేమాతరం గీతాన్ని ఎర్రకోట వద్ద ఆలపించారు.

## మోడీ హగ్ సెటైర్లకు బిజెపి కౌంటర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** రాహుల్ గాంధీ బిజెపి ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని విమర్శించే క్రమంలో, ప్రధాని నరేంద్రమోడీ విదేశాధినేతల్ని ఆలింగనం చేసుకోవడంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విదేశీ నేతల్ని కౌగిలించుకోవడం ఎలాంటి విదేశాంగ విధానం అని ప్రశ్నించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌ను కౌగిలించుకుని, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిని ప్రస్తావిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వ్యవహారం తిరిగి కాంగ్రెస్‌కే ఎదురుదెబ్బగా మారింది. బిజెపి నేతలు ఇందిరాగాంధీ గతంలో విదేశీ నేతల్ని ఆలింగనం చేసుకున్న ఫోటోలను షేర్ చేస్తున్నారు. తాజాగా బిజెపి ఎంపీ నిషికాంత్ దూబే తన ఎక్స్ అకౌంట్లో నెహ్రూకు సంబంధించిన పలు పాత ఫోటోలను పోస్ట్‌చేశారు. నా లైబ్రరీలోని నెహ్రూగాంధీ కుటుంబానికి సంబంధించిన ఓ పుస్తకంలోని కొన్ని అయితే, దూబే వీటిని నెహ్రూ కిస్ ఫోటోలని నేరుగా పేర్కొననప్పటికీ, నెహ్రూ మహిళలతో సన్నిహితంగా ఉన్నట్లు చూపించే ఉద్దేశంతోనే వాటిని పోస్ట్ చేసినట్లు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. దీనిపై కాంగ్రెస్ ప్రతినిధి సుప్రియా శ్రీనేత్ స్పందిస్తూ నెహ్రూ ఫోటోలు అసలు సందర్భం నుంచి విడదీసి తప్పుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఫొటోలో నెహ్రూ సోదరి విజయలక్ష్మి పండిట్ ఆయన చెంపపై ముద్దు పెడుతున్నారని, మరో ఫొటోలో ఆయన మేనకోడలు నయనతార సహగల్ ఉన్నారని ఆమె వివరించారు. 1962 మార్చిలో తీసిన మరో ఫొటోలో హోలీ సందర్భంగా జాక్వెలిన్ కెన్నెడీకి నెహ్రూ రంగులు పూస్తున్నట్లు ఉందని సుప్రియా శ్రీనేత్ తెలిపారు. క్రియేటివ్ కాంగ్రెస్ కార్య క్రమంలో రాహుల్ గాంధీ, సందీప్ దీక్షిత్‌లు ఆలింగనం చేసుకుని ప్రధాని మోడీపై వ్యంగ్యంగా స్పందించారు.
ఈ సమయంలోనే సందీప్ దీక్షిత్, రాహుల్ గాంధీతో నన్ను మెలోనీ అనుకోలేదుగా? అని ప్రశ్నించగా, రాహుల్‌గాంధీ నేను ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదని బదులిచ్చారు. దీని తర్వాత బిజెపి ఇందిరా గాంధీఫిడెల్ కాస్ట్రో, ఇందిరా గాంధీయాసర్ అరాఫత్ ఫొటోలను కూడా షేర్ చేసింది. నెహ్రూ తన సోదరి విజయలక్ష్మి పండిట్, మేనకోడలు నయనతార సహగల్, అమెరికా మాజీ ప్రథమ మహిళ జాక్వెలిన్ కెన్నెడీతో ఉన్న చిత్రాలు ఉన్నాయి.

## ప్రధానిమోడీ ఐర్లాండ్ పతాకం ధరించారంటూ కాంగ్రెస్ సెటైర్లు



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** దేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ధరించిన దుస్తులు ఇప్పుడు రాజకీయ దుమారానికి దారితీశాయి. ప్రతి సంవత్సరం ఆగస్టు 15వ తేదీన ఎర్రకోటపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే సమయంలో ఆయన ధరించే ప్రత్యేక శైలితో కూడుకున్న దుస్తులు, వైవిధ్యంగా కనిపించే తలపాగాలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమోతుంటాయి. ఈసారి మాత్రం దీనికి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాని మోడీ ధరించిన జాకెట్‌పై అలంకరించిన పాకెట్ స్క్వేర్స్‌లో కనిపించిన జాతీయ పతాకం అమరిక ఇప్పుడు తీవ్ర వివాదానికి కేంద్రబిందువు అయింది. ప్రధాని మోడీ జాతీయజెండాను తలకిందులుగా అమర్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఘాటు విమర్శలు గుప్పించింది. ఈ విమర్శలకు మరింత ఆజ్యం పోసింది. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలుపు రంగు కుర్తాపైజామాతో పాటు చాక్లెట్ బ్రౌన్ కలర్ స్లీవ్‌లెస్ జాకెట్, సాంప్రదాయ తలపాగాలను ధరించారు. ఈ జాకెట్‌పై ఆకుపచ్చ, తెలుపు, కాషాయం రంగులలో ఉన్న మూడు జేబు రుమాళ్లను అమర్చారు. సాధారణంగా భారత జాతీయ జెండా పైభాగంలో కాషాయం, మధ్యలో తెలుపు, దిగువన ఆకుపచ్చ రంగులు ఉంటాయి. దీనికి భిన్నంగా మొదట ఆకుపచ్చ రంగు, ఆ తర్వాత తెలుపు, చివర్లో కాషాయ రంగుతో తలకిందులుగా కనిపించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి, రాజ్యసభ సభ్యుడు పవన్‌ఖేరా. ఆయన వేసుకున్న పాకెట్ స్క్వేర్ రంగులు, దాని అమరికను తప్పుపట్టారు. ప్రధాని మోడీ మన దేశ మువ్వన్నెల పతాకాన్నికాకుండా ఐర్లాండ్ జాతీయ పతాకాన్ని ధరించారని ఆరోపించారు. ప్రధాని మోడీధరించిన జాతీయ పతాకం కూడా కుడి నుంచి ఎడమవైపుగా అమర్చినట్లు ఉందని పవన్ ఖేరా సెటైర్లు వేశారు. పైగా అది ఐర్లాండ్ జాతీయ పతాకాన్ని పోలిఉందని, ప్రధాని మోడీ ఆ దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకొంటున్నట్లుగా అనిపిస్తోందని తన అధికారిక ఎక్స్ అకౌంట్‌లో సెటైర్లు వేశారు.

## భారీ వర్షాలకు ఈశాన్య అరుణాచల్ అతలాకుతలం

**ఇటానగర్, ఆగస్టు 15:** అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల సంభవించిన వరదల కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. వేర్వేరుగా జరిగిన ఈ ఘటనల్లో నలుగురు చనిపోగా, ఐదుగురు సైనికులు గల్లంతయ్యారు. ఆ రాష్ట్రంలోని అప్పర్‌సుబన్‌సిరి జిల్లాలోని కియోజరింగ్‌బయాచింగ్ రోడ్డు మలుపు ప్రాంతం, దిబంగ్ లోయ జిల్లాలో ఈ ఘటనలు జరిగాయి. పసుపానీ ఆర్మీ క్యాంపులోని రెండు షెల్టర్లు కొట్టుకుపోయాయి. ఐదో గ్రెనేడియర్‌కు చెందిన ఏడుగురు జవాన్లు కొట్టుకుపోయారు. ఇద్దరిని రక్షించగా, ఐదుగురు గల్లంతయ్యారు. గల్లంతైనవారిని హవల్దార్ ఉపేందర్, ఆర్మీ సిబ్బంది కుందన్, వినోద్, ఆదిత్య, సముందగా గుర్తించారు. ఐదో గ్రెనేడియర్, ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ 58వ బెటాలియన్, జనరల్ రిజర్వ్ ఇంజినీర్ ఫోర్స్‌కు చెందిన ఆర్‌సిసి, అరుణాచల్‌ప్రదేశ్ పోలీసులు, వలంటీర్లు సహాయక చర్యలు చేపట్టారు. అప్పర్‌సుబన్‌సిరి ప్రాంతంలో విరిగిపడిన కొండచరియల శిథిలాల కింద పలువురు కూరుకుపోయారు. టాడు బాకి, తాజి రాయ్, మర్కోష్ బసుమతారి, బాబుల్ అలీ మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు.

## సంక్షిప్త వార్తలు

### నేడు ప్రత్యేక పూజలకోసం తెరుచుకోనున్న శబరిమలై



**పతనంతిట్ట, ఆగస్టు 15:** శబరిమల అయ్యప్ప ఆలయం ఆదివారంనుంచి తెరుచుకోనుంది. చింగం మాసం పూజల కోసం ఈ ఆలయాన్ని తెరుస్తున్నట్లు ట్రావన్‌కోర్‌దేవస్వోమ్ బోర్డు వెల్లడించింది. సాయంత్రం ఐదు గంటలకు ఆలయ ప్రధాని పూజారి ఆలయ తలుపులను తెరుస్తారు. తరువాత ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 17వ తేదీ ఉదయం ఐదు గంటల నుంచి భక్తులకు దర్శనం అవకాశం కల్పించనున్నారు. ప్రసిద్ధి చెందిన శబరిమల ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం ఆదివారం సాయంత్రం సరిగ్గా 5 గంటలకు తెరుచుకోనుంది.

### ఉగ్ర సంస్థలతో లింకులు: బెంగళూరులో ఒకరి అరెస్టు

**బెంగళూరు, ఆగస్టు 15:** అఫ్ఘానిస్థాన్ కేంద్రంగా నడుస్తోన్న ఉగ్రమూఠాతో సంబంధం ఉన్న అసఫూల్ మాలిక్ అనే యువకుడిని బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. తెహ్రీక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) సభ్యుడితో కలిసి, ఆ సంస్థలో చేరడానికి ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. అనుమానాస్పద ఆన్‌లైన్ కార్యకలాపాలపై సమాచారం అందడంతో అతడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అసఫూల్ మాలిక్ బెంగళూరులో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఉగ్రవాద సంస్థలతో లింకులు బయటపడ్డాయి.

### విద్యుత్ తీగ తగిలి కరెంట్‌షాక్, టీచర్ మృతి

**భువనేశ్వర్, ఆగస్టు 15:** ఒక స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్ల సమయంలో విషాద సంఘటన జరిగింది. జెండా ఆవిష్కరణకు సంబంధించిన ఐరన్ పోల్‌కు విద్యుత్ వైర్ తగిలింది. దీంతో కరెంట్ షాక్‌తో టీచర్ మరణించగా, ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జెండా ఆవిష్కరణ స్టాండ్‌కు ఐరన్ పైపు అమర్చడానికి వారు ప్రయత్నిస్తున్నప్పుడు అనుకోకుండా పైనుంచి వెళ్తున్న విద్యుత్ లైన్‌కు అది తగిలింది. ఈ నేపథ్యంలో ఆ టీచర్, ముగ్గురు విద్యార్థులు విద్యుతాఘాతానికి గురయ్యారు.

### విద్యావ్యవస్థ లోపాలే నిరసనలకు కారణం: బాబారామ్‌దేవ్

**హరిద్వార్, ఆగస్టు 15:** విద్యార్థుల నిరసనలు, ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియపై యోగా గురువు రామ్‌దేవ్ బాబా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతోన్న నిరసనలు, గందరగోళం లాంటివి విద్య, ఉపాధి వ్యవస్థల్లో ఉన్న తీవ్రమైన లోపాలను సూచిస్తున్నాయని అన్నారు. పతంజలి యోగపీఠంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా రామ్‌దేవ్ మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో ఇప్పటికీ కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు వీధుల్లోకి వస్తున్నారని బాబా రాందేవ్ అన్నారు.

### మద్యం కొన్నా, అమ్మినా 5 వేలు ఫైన్

**చెన్నై, ఆగస్టు 15:** దేశవ్యాప్తంగా యువతను యుతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్,మద్యం అలవాట్లను కట్టడిచేసేందుకు తమిళనాడులోని ఓ గ్రామం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. విజుంతమావడి గ్రామం తీసుకున్న నిర్ణయం దేశ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. తమిళనాడులోని విజుంత మావడి గ్రామంలో పెళ్లి కాని యువకులకు మద్యం విక్రయించడాన్ని నిషేధించారు అక్కడి పెద్దలు. ఈ రూల్స్‌ను అతిక్రమిస్తే రూ.ఐదువేల జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

### కాశ్మీర్ ప్రజలు తిరుగాబుటు చేసేవారు: సిఎం ఒమర్

**శ్రీనగర్, ఆగస్టు15:** జమ్ముకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ ప్రత్యేక హోదాను రద్దు చేయకపోవడం, రాష్ట్ర హోదాను కేంద్రం తొలగించకపోయి ఉంటే పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె) ప్రజలు జమ్ముకశ్మీర్‌లో విలీనం కావడానికి తిరుగుబాటు చేసేవారని అన్నారు. శనివారం శ్రీనగర్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. 1947లో పాకిస్థాన్ నుంచి దండెత్తి వచ్చిన గిరిజన దుండగులకు వ్యతిరేకంగా పోరాడి, భారతదేశంలో భాగం కావాలని ఎంచుకున్న కశ్మీర్ ప్రజల నిర్ణయాన్ని పిఒకెలోని ప్రస్తుత పరిస్థితులు సమర్థిస్తున్నాయని తెలిపారు.

# తిరుమల సమాచారం



## తిరుమలలో అనూహ్య రద్దీ


**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం వరుససెలవులతో తిరుమలకు భారీగా భక్తులు తరలివచ్చారు. శనివారం కావడంతో ఉదయానికే తిరుమలలో లక్షమంది భక్తులు చేరారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు. సర్వదర్శనానికి సుమారు 24గంటల సమయం నిరీక్షణ తప్పడంలేదు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి శిలాతోరణం వరకు వెలుపల క్యూలైన్లు చేరాయి. శుక్రవారం 4.03 కోట్ల రూపాయలు హుండీ ఆదాయం చేకూరింది. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టిటిడి అన్ని ఏర్పాట్లు చేస్తోందని ఛైర్మన్ బిఆర్ నాయుడు స్పష్టం చేశారు. తిరుమలలో భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆయన ప్రకటన చేశారు. భక్తులు తిరుమల రద్దీని దృష్టిలో ఉంచుకుని, తమ యాత్రను ముందుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. దర్శన సమయంలో సంయమనం పాటిస్తూ, టిటిడి సిబ్బందికి సహకరించాలని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి వరకు 73,699 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 39,884 మంది తలనీలాలు సమర్పించారు. భారీ రద్దీ ఉన్నప్పటికీ భక్తులకు అవసరమైన అన్నప్రసాదం, తాగునీరు, వైద్య సేవలు వంటి సౌకర్యాలను టిటిడి అధికారులు నిరంతరాయంగా అందిస్తున్నారు.



## అంకితభావ సేవలకు గుర్తింపు

### టిటిడిలో 38 మంది అధికారులు, 287 మంది ఉద్యోగులకు సన్మానం

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడిలో భక్తులకు విశేషంగా అంకితభావసేవలందిస్తున్న టిటిడి అధికారులు, ఉద్యోగులను శనివారం స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ఘనంగా గౌరవించారు. విధుల్లో ఉత్తమసేవలు అందించిన వివిధ విభాగాలకు చెందిన 38 మంది అధికారులు, 281మంది ఉద్యోగులకు, స్విమ్స్‌లో ఆరుగురు,ఎస్వీబిసిలో ఆరుగురు ఉద్యోగులకు ఐదుగ్రాముల శ్రీవారి వెండి డాలర్, ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే ఉద్యోగుల పిల్లలకు సంబంధించి ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 33మంది విద్యార్థులకు 4,116రూపాయలు, 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన 29మంది విద్యార్థులకు 2,116 రూపాయలు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఎస్వీసంగీత,నృత్య కళాశాల విద్యార్థినులు దేశభక్తి గీతాలతో చక్కటి నృత్యం ప్రదర్శించారు.



## బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీశ్‌కు ప్రశంసాపత్రం

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలో బర్ద్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలందించడంలో సాటిగా ఉన్న డైరెక్టర్ డాక్టర్ జి.జగదీశ్‌కు టిటిడి అదికారులు ప్రశంసాపత్రం అందజేశారు. పుట్టుకతో వచ్చే అంగవైకల్యం, పోలియో ఎముకల సంబంధిత వ్యాధులకు పూర్తిగా బర్డ్‌లో ఉచితంగా,నామమాత్రపు ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు, శస్త్రచికిత్సలు అందించడంలో డాక్టర్ జగదీశ్ సేవలు అమోఘంగా ఉన్నాయి. కృత్రిమ అవయవాలను కూడా అందిస్తున్న సేవలు మరింతగా రోగులకు సేవాభావంతో చేయడంపట్ల డైరెక్టర్‌ను శనివారం స్వాతంత్ర్యదినోత్సవాన టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర అభినందించారు.



## టిటిడి ట్రస్ట్‌లకు రూ.కోటి విరాళం

**తిరుమల,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు,పథకాలకు దాతలు తమవంతూగా విరాళాలందిస్తున్నారు. శనివారం తెలంగాణ హైదరాబాద్ కు చెందిన రక్షిత్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ సి.హెచ్.ఏ.పి.రామేశ్వరరావు, సాయిచందన ఏపిఐ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ ఉద్దగిరి తాతారావులు కోటిరూపాయలు విరాళమిచ్చారు. టిటిడి వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు ఒక్కొక్కరు 50 లక్షలు రూపాయలు చొప్పున విరాళంగా అందించారు. దాతలు తిరుమలలోని ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బి.ఆర్.నాయుడుకు విరాళం డిడిలను అందజేశారు.ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, రంగశ్రీ పాల్గొన్నారు.



## తిరంగా ర్యాలీతో నగర సంకీర్తన

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** శనివారం వేకువజామున పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరం భక్తి పారవశ్యంతో మేల్కొంది. వేంకటేశ్వర స్వామి కృపాకటాక్షాలు నగర ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షి స్తూ భజన మండలి ఆధ్వర్యంలో శనివారం నగర సంకీర్తన నిర్వహించారు. ఈ వారం ప్రత్యేకంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలతో కలిసి జరిగింది. బ్రహ్మ ముహూర్తంలో సంప్రదాయ వస్త్రధారణలో, నుదుట గోవింద నామాలతో భక్తులు గోవిందరాజస్వామి ఆలయం తూర్పు మాడవీధిలోని ఆం జనే య స్వామి ఆలయం వద్దకు చేరుకుని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీహరి నామస్మరణతో నగర సంకీర్తన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భజన మండలి కళాకారులు ప్రవచనకర్త చంద్రమోళి, గుండాల గోపీనాథ్‌రెడ్డి,వాసు దేవ రెడ్డి, మునినాధ రెడ్డి, అన్నూరు మునిరత్నమాచారి, తిరుపాలాచారి, వాసు, కృష్ణంరాజు, కృష్ణయ్య, మధు, నాగేశ్వర్ రెడ్డి, నాగార్జున రెడ్డి, మోహన్ రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పంద్రాగస్టు వేడుకల్లో ఆకర్షణగా 'డాగ్ షో'

### ప్రశంసలు కురిపించిన మంత్రి అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ డాగ్ షో మైదానంలోని ప్రేక్షకులను విశేషంగా అలరించింది. తమ ధైర్యసాహసాలు, ఘ్రాణశక్తి, అత్యుత్తమ క్రమశిక్షణతో పోలీస్ డాగ్స్ ప్రదర్శించిన విన్యాసాలు ప్రతి ఒక్కరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశాయి. ఈ అద్భుత ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకించిన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మంత్రముగ్ధులయ్యారు. నేరాల దర్యాప్తు, మాదకద్రవ్యాలు, పేలుడు పదార్థాల గుర్తింపులో డాగ్ స్క్వాడ్ సేవలు అత్యంత కీలకమని కొనియాడిన మంత్రి, ప్రతిభ కనబరిచిన హ్యాండ్లర్లు, శిక్షకులను ప్రత్యేకంగా అభినందించారు. వేడుకల ప్రారంభంలో 'మున్నా' అనే గోల్డెన్ రిట్రీవర్ డాగ్ మంత్రి అచ్చెన్నాయుడుకి నోటితో పూలగుత్తి అందించి స్వాగతం పలకగా, 'ద్రోణ' అనే బెల్జియన్ మాలినోయిస్ డాగ్ ఫ్లెక్సీని ఓపెన్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించింది. అనంతరం హ్యాండ్లర్లు ఇచ్చిన ప్రతి ఆదేశాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ 'మున్నా', 'బ్యాటీ' డాగ్స్ తమ క్రమశిక్షణను నిరూపించగా.. జిల్లాలో గంజాయి నిరోధానికి చేపట్టిన చర్యల్లో భాగంగా 'రాణి' అనే లాబ్రడార్ డాగ్ వాహన తనిఖీల్లో దాచి ఉంచిన మత్తు పదార్థాలను పసిగట్టే తీరును ప్రత్యక్షంగా ప్రదర్శించి ఆకట్టుకుంది.

## జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

### స్వాతంత్ర్య వేడుకల్లో పతాకావిష్కరణ చేసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, ఆగస్టు 15 ప్రభాతవార్త:** నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో 80వ స్వాతంత్ర్య వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు, పేదరిక నిర్మూలన, ఎన్.ఆర్.ఐ. సాధికారత సంబంధాల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాయుధ దళాలనుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్ వెంట రాగా ప్రత్యేక వాహనంలో పెరేడ్ పరిశీలన చేశారు. జిల్లా ప్రజలనుద్దేశించి తమ సందేశాన్ని వినిపిస్తూ, మన జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలబెడదామని పిలుపునిచ్చారు. జిల్లాను అన్ని రంగాల్లో అభి వృద్ధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. భోగా పురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్ర ముఖ చిత్రం మారుతుందని పేర్కొన్నారు. ప్రతీ నియోజక వర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కును ఏర్పాటు చేయడం ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి కల్పిం చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఎన్నో పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యా చరణను అమలు చేస్తున్నామని అన్నారు. ఉదయం 8:59 గంటలకు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి వేదిక వద్దకు చేరుకోగా, 9:03 గంటలకు ముఖ్య అతిథి కొండపల్లి శ్రీనివాస్ సభా ప్రాంగణానికి



స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విచ్చేశారు. 9:04 గంటలకు వందేమాతరం గీతాలాపనతో కార్యక్రమాలు ప్రారం భమయ్యాయి. అనంతరం మంత్రిచే జాతీయ పతాకావిష్కరణ, పోలీసు బలగాల నుంచి గౌరవ వందన స్వీకరణ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మంత్రి జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ సందేశం వినిపించారు. డాగ్ షో తిలకించి, శిక్షకులు ప్రత్యేకంగా మంత్రి అభినందించారు. ప్రముఖులు, అధికారులు అతిథుల వద్దకు వెళ్ళి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.కార్యక్రమంలో భాగంగా ఉదయం 10:20 గంటలకు వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిని ప్రతిబింబించే శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ముందుగా వివిధ సేవా పతకాలను సాధించిన జిల్లా పోలీసు అధికారులకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీలు కావాలి గ్రీష్మ, గాదె శ్రీనివాసుల నాయుడు, డాక్టర్ సురేష్ బాబు, మార్క్ఫెడ్ చైర్మెన్ కర్రోతు బంగార్రాజు, జేసి సేధు మాధవన్, ఏఎస్పీ సౌమ్యలత, డియార్వో సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికార యంత్రాంగం, ఇతర ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, నగర ప్రజలు పాల్గొన్నారు.

## ఎంసిలో జాతీయ స్థాయి ఉదరకోశ కార్యశాల

### వర్క్‌షాప్‌ను ప్రారంభించిన ప్రముఖ ఉదరకోశ వైద్య నిపుణులు డాక్టర్ పెదవీర్రాజు

**విశాఖపట్నం, ఆగస్టు15 ప్రభాత వార్త :** వైద్య విద్య, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం,ప్రజాసేవలను సమన్వయం చేస్తూ ఆంధ్రా వైద్య కళాశాల కెజీహెచ్‌లో నిర్వహిస్తున్నరెండు రోజుల జాతీయ స్థాయి ఈయూఎస్ కార్యశాల 2026 ఉదారకోశ యువ వైద్యులు, నిరు పెద రోగులకు ఎంతగానో ఉపయోగ పడుతోందని నగరానికి చెందిన ప్రముఖ సీనియర్ ఉదరకోశ వైద్య నిపుణులు కెజీహెచ్ గ్యాస్ట్రోంట్రాలజీ విశ్రాంత విభాగా ధిపతి డాక్టర్ ఈధర పెద వీర్రాజు అన్నారు. విశాఖ పట్నంలోని ఆంధ్ర వైద్య కళాశాల మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం ఆధ్వర్యంలో "వైజాగ్ ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ (ఈయూఎస్ )2026: ఏ టూ జడ్ " పేరుతో రెండు రోజుల జాతీయ స్థాయి ఎండోస్కోపిక్ అల్ట్రాసౌండ్ కార్యశాల ను శనివారం కెజీహెచ్ ఉదరకోశా విభాగంఅధిపతి



డాక్టర్ ఎల్ ఆర్ ఎస్ గిరినాథ్, ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ ఐ వాణి తో కలసి డాక్టర్ పెద వీర్రాజు ప్రారంభించారు.ఆగస్టు 16 ఆదివారం సాయంత్రం వరకూ నిర్వహించనున్న ఈ జాతీయ స్థాయి వర్క్ షాప్‌లో దేశంలోని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజీ, అడ్వాన్స్‌డ్ ఎండోస్కోపీ నిపుణులు పాల్గొని ఆధునిక ఈయూఎస్ విధానాలపై ఉపన్యాసాలు, ప్రత్యక్ష లైవ్ కేసుల ప్రదర్శనలు, హ్యాండ్స్ ఆన్ శిక్షణ, సాంకేతిక చర్చలు నిర్వహిస్తున్నామన్నారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ . కె.వి.ఎస్.ఎం. సంధ్యా దేవి,ఏఐజీ హాస్పి టల్స్‌కు చెందిన డాక్టర్ సందీప్ లఖ్టా కియా, డాక్టర్ జహంగీర్ బాషా, విశాఖ పట్నం సీనియర్గ్యాస్ట్రోఎం టరాలజిస్టులు , డాక్టర్ ఎ.వి. శివ ప్రసాద్ ఆంధ్ర మెడికల్ కళాశాల మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రలజిస్టులు డాక్టర్ టి. మోహన్ వంశీ, డాక్టర్ . ఎస్. శ్రీదేవి, డాక్టర్ డి. వంశీ యాదవ్, తది తర అధ్యాపకులు వైద్యులు వర్క్ షాప్ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాకినాడలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

### ముఖ్యఅతిథిగా విచ్చేసిన డి.సిఎం పవన్ కళ్యాణ్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 15 ప్రభాతవార్త :** కాకినాడ భానుగుడి పోలీస్ పరేడ్ గ్రౌండ్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్,ఎస్పీ బిందు మాధవ్, జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ట్రైనీ కలెక్టర్ ప్రియా తదితరులు స్వాగతం పలికారు. వేదికకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణగావించినానంతరం జిల్లా ప్రగతిపై ప్రజలకు సందేశం ఇచ్చారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లా డుతూ దేశ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి అని, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పోలీసు జాగిలాలచే ప్రదర్శన అనంతరం ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సంబంధించిన శకటాల



సందర్శించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సతీమణి అన్నా లెజినోవా,లోక్ సభ,రాజ్యసభ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం,కర్రి పద్మ శ్రీ, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య,జగ్గం పేట టిటిడి పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ,పెద్దాపురంశాసన సభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప, కాకినాడ పట్టణ , గ్రామీణ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు,పంతం నానాజీ, ప్రత్తిపాడు శాసన సభ్యులు సత్య ప్రభలతో పాటు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, డిఆర్‌ఓ డాక్టర్ పి తిప్పే నాయక్ కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు వివిధశాఖల జిల్లా అధికారులు,ప్రజా ప్రతి నిధులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శకటాల ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వారికి, సాంస్కృతికకార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్‌ల చేతుల మీదుగా అందజేశారు. తదుపరి జిల్లాలో ఉత్తమ సేవలను అందించిన 242 మంది అధికారులు,సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

## పేదరిక నిర్మూలనకు చర్యలు: మంత్రి పార్థసారధి

**ఏలూరు, ఆగస్టు 15:** వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగు ణంగా పేదరిక నిర్మూలన, రైతు సంక్షేమం, సాగునీటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిం



చుకుంటూ వారి ఆశయాల మేరకు అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో 71,910 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి, 44,114కుటుంబాలను 4,853 మంది మార్గదర్శులు దత్తత తీసుకున్నారని తెలిపారు. రైతులకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కింద రూ.106.29 కోట్ల పెట్టుబడి సాయం అందిం చామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ట్రైనీ కలెక్టర్ శ్రావణ్ కుమార్ రెడ్డి, డీఎఫ్‌ఓ సందీప్ రెడ్డి, డీఆర్వో ఎం. శ్రీదేవి, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## సోలార్ విద్యుత్తుకు ప్రాధాన్యం

### ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ ద్వారా 610 మెగావాట్లు: సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి,ఆగస్టు 15ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపిఎస్‌పిడిసిఎల్)లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ పతాక విష్కరణ అనంతరం సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ భారతదేశం కోసం అసువులు బాసిన మహనీయుల అడుగుజాడల్లో నడుచుకుంటూ వారి ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. సంస్థ పరిధిలో 415 మెగావాట్ల సామర్థ్యంతో 2.07 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల గృహాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటులో భాగంగా, ఇప్పటివరకు 214 మెగావాట్ల సామర్థ్యంతో 1.06 లక్షల గృహాలపై సోలార్ వ్యవస్థలను అమర్చామన్నారు. ఈ పనుల్లో భాగంగా నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ(ఎంఎన్ఆర్ఈ) గణాంకాల మేరకు రాష్ట్రంలోని విద్యుత్ పంపిణీ సంస్థల్లో 50 వేల సర్వీసులను గ్రిడ్ కు అనుసంధానం చేసిన తొలివిద్యుత్ పంపిణీ సంస్థగా ఎపిఎస్‌పిడిసిఎల్ నిలవడం గొప్ప విషయమన్నారు. సంస్థ పరిధిలో ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ ద్వారా 610 మెగావాట్ల సామర్థ్యంతో 1.35 లక్షల పంపుసెట్లకు. సౌర విద్యుత్తు సరఫరా పనులు త్వరితగతిన జరుగుతున్నాయని, అలాగే కుసుం నియోజకవర్గంలో ఈ పథకంలో భాగంగా 32,106 పంపుసెట్లకు సోలార్ ప్లాంట్ల పనులను పూర్తి చేయడంతో 141 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు కె. గురవయ్య, పి. అయూబ్ ఖాన్, కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు సిహెచ్ రామచంద్ర రావు, జె. రమణాదేవి, ఎం. మురళీ కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, జాయింట్ సెక్రటరీ యం. గోపాలకృష్ణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కె. జనార్ధన్ నాయుడు, సిజిఆర్ఎఫ్ చైర్పర్సన్ ఎ. శ్రీనివాస అంజనేయమూర్తి, పిఆర్‌ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు

**విజయవాడ,ఆగస్టు 15,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.కౌసర్ బానో జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, సిబ్బందికి మరియు ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు, యోధులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈడీ కౌసర్ బానో మాట్లాడుతూ మనమందరం ఈనాడు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఎందరో మహానుభావుల, స్వాతంత్ర్య సమరయోధుల నిస్వార్థ త్యాగాల ఫలితమేనని గుర్తుచేశారు. విపత్తుల నిర్వహణ సంస్థ ద్వారా నిరంతరం ప్రజలకు సేవలందించడం ఎంతో సంతృప్తిని, ఆనందాన్ని ఇస్తుందని ఆమె పేర్కొన్నారు. నిరంతరం సేవా దృక్పథంతో బాధ్యతాయుతంగా పనిచేస్తున్న విపత్తుల నిర్వహణ సంస్థ ఉద్యోగులను, సిబ్బందిని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

## లలితా జ్యువెలరీ ఐపిఒకు రంగం సిద్ధం

### రూ.1,700 కోట్ల సమీకరణ లక్ష్యం



**విశాఖపట్నం, ఆగస్టు 15, ప్రభాత వార్త:** లలితా జ్యువెలరీ మార్ట్ లిమిటెడ్ ఇనీషి యల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రంగం సిద్ధమైంది. ఆగస్టు 17న ప్రారం భమయ్యే ఐపీఓ ఆగస్టు 19న ముగియనుంది. ఒక్కో రూ.5 ముఖ విలువ గల ఈక్విటీ షేరుకు రూ.190 నుంచి రూ.201 వరకు ధరల శ్రేణిని కంపెనీ ఖరారు చేసింది. కనీసం 74 షేర్లకు, ఆ తర్వాత 74 షేర్ల గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,200 కోట్ల వరకు తాజా షేర్లను జారీ చేయనుండగా, ప్రమోటర్ ఎం. కిరణ్ కుమార్ జైన్ రూ.500 కోట్ల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. మొత్తంగా రూ.1,700 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.'లలిత' బ్రాండ్‌తో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థకు దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి ప్రాంతాల్లో 51 నగరాల్లో 61 స్టోర్లు ఉన్నాయి. వీటిలో 45 స్టోర్లు టైర్2, టైర్3 నగరాల్లోనే ఉండటం విశేషం. బంగారం, వెండి, వజ్రాల ఆభరణాలను పోటీ ధరలకు అందిస్తూ సంస్థ దక్షిణ భారత మార్కెట్‌లో విస్తరణపై దృష్టి సారిస్తోంది.2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కార్యకలాపాల ద్వారా రూ.25,023.93 కోట్ల ఆదాయం ఆర్జించగా, నికర లాభం రూ.1,009.82 కోట్లుగా నమోదైంది. 2024 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం, లాభాల్లో గణనీయమైన వృద్ధిని సాధించింది. చెన్నైలోని తిరుముడివాక్కం, కాంచీపురంలోని మల్లె మలైలో కంపెనీకి రెండు తయారీ కేంద్రాలు ఉన్నాయి. నాణ్యత, డిజైన్, పోటీ ధరలతో వినియోగదారులను ఆకర్షించడంతో పాటు కొత్త మార్కెట్లలో స్టోర్ల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తోంది.ఐపీఓలో నికర ఆఫర్‌లో 50 శాతానికి మించకుండా అర్హతగల సంస్థాగత పెట్టుబడిదారులకు, కనీసం 15 శాతం సంస్థాగతేతర బిడ్డర్లకు,కనీసం 35శాతం రిటైల్ పెట్టుబడిదారులకు కేటాయింపు ఉంటుంది. ఆగస్టు 9, 2026న రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను కంపెనీ దాఖలు చేసింది.



## బొబ్బిలిలో 'క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్'

### ప్రారంభించిన ఎమ్మెల్యే బేబీనాయన

**విజయనగరం, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'బొబ్బిలి వీణ' తయారీకి కావలసిన ముడిసరుకు(పనస కలప) కొరతను గురించి రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) తీసుకువెళ్లిన సంగతి మనందరికీ విదితమే. కళలు, కళాకారులపట్ల ఎంతో గౌరవం కలిగిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తక్షణమే స్పందించి, అటవీ శాఖ అధికారులతో చర్చించి 'బొబ్బిలి వీణ'ల తయారీకి కావలసిన ముడిసరుకును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అటవీశాఖ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉన్న పనసకలపను సేకరించి వీణల తయారీ కేంద్రాలకి సరఫరా చేయనున్నారు. అందులో భాగంగా, శనివారం బొబ్బిలి పట్టణం, గొల్లపల్లి గ్రామంలో ఉన్న వీణల తయారీ కేంద్రంలో 'క్రాఫ్ట్ వుడ్ బ్యాంక్' ఏర్పాటు చేసి కొంత ముడిసరుకును సరఫరా చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బొబ్బిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ గిరడ అప్పలస్వామి, బీజేపీ జిల్లా కార్యదర్శి వేమకోటి గిరిబాబు, టీడీపీనాయకులు, కార్యకర్తలు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



## న్యాయం ఖరీదైన హక్కు కాకూడదు

### హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్

**విజయవాడ.ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:** న్యాయం కొందరికి మాత్రమే దక్కే, ఖరీదైన హక్కు కాకూడదని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ లిసా గిల్ అన్నారు. కుల, మత, వర్గ, లింగ, ఆర్థిక స్థాయిలతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడికి సత్వరమే, సులభంగా అందే హక్కుగా ఉండాలని ఉద్ఘాటించారు. కోర్టులంటే కేవలం ఇటుకలు, రాళ్లతో కట్టిన కట్టడాలు కావని అదొక సజీవ న్యాయ దేవాలయమని స్పష్టంచేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైకోర్టు ఆవరణలో జాతీయ జెండాను ఆమె ఎగురవేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, న్యాయవ్యవస్థలోని మార్పులను జస్టిస్ లిసా గిల్ వివరించారు. జాతీయ జెండా కేవలం గాలికి ఎగరడం లేదన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ప్రతి స్వాతంత్ర్య సమరయోధుని ఆఖరి శ్వాసతో అది సగర్వంగా ఎగురుతోందని గుర్తుచేశారు. అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు లాంటి ఎందరో మహానుభావులకు రాష్ట్రం పుట్టినిల్లని చెప్పారు.పాత కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూనే, అత్యవసర కేసులను వేగంగా విచారిస్తున్నట్లు జస్టిస్ లిసా గిల్ వెల్లడించారు. సీనియర్ సిటిజన్లు, అణగారిన వర్గాల కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని చెప్పారు. అందరి సమష్టి కృషితో రాష్ట్రంలో పెండింగ్ కేసుల సంఖ్యను 2,50,363 నుంచి 2,45,438కి తగ్గించగలిగామన్నారు. కక్షిదారుల మధ్య రాజీకి లీగల్ సర్వీసెస్ అథారిటీ విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకత్వంలో ఖిమీడియేషన్ ఫర్ ది నేషన్ఖి క్యాంపెయిన్ 3.0ను ఈనెల 1న ప్రారంభించినట్లు తెలిపారు. ఏపీ హైకోర్టు కంప్యూటర్ కమిటీ ఆధ్వర్యంలో ఖిఅడ్వకేట్స్ సర్వీసెస్ పోర్టల్ఖిను ప్రారంభించినట్లు జస్టిస్ లిసా గిల్ తెలిపారు. న్యాయ వ్యవస్థ సక్రమంగా నడిచేందుకు హైకోర్టు రిజిస్ట్రీ సిబ్బంది రాత్రి 8 గంటల వరకు శ్రమిస్తున్నారని చెప్పారు. వారి నిస్వార్థ సేవలను కోర్టు అభినందించిందన్నారు. న్యాయవాద వృత్తిలో సీనియర్లు, జూనియర్లకు మార్గదర్శనం చేయాలని జస్టిస్ లిసా గిల్ సూచించారు.

## ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు

**విజయవాడ, ఆగస్టు 15, ప్రభాతవార్త ప్రతినిధి:** గుణదలలోని ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి, డైరెక్టర్ (టెక్నికల్) ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ (ఫైనాన్స్) ఎస్. వెంకటేశ్వర్లు, సీజీఎంలు, జీఎంలు, ఇతర ఉన్నతాధికా రులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎండీ పి. పుల్లారెడ్డి మాట్లాడుతూ, ఏపీసీపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ రంగ అభివృద్ధితో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు పలు కీలక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద సుమారు 180 మెగావాట్ల సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు వెల్లడించారు. అలాగే, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వినియోగదారులకు డిస్కం వ్యయంతో సుమారు 2లక్షల ఇళ్లలో 2 కిలోవాట్ల సామర్థం కలిగిన రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్‌వ్యవస్థలను ఏర్పాటుచేసి గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంస్థలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఉద్యోగులు, అధికారులు మరియు సిబ్బందికి సీఎండీ పి. పుల్లారెడ్డి పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఏపీసీపీడీసీఎల్ కంట్రోల్ రూమ్ నుంచి ఆన్‌లైన్‌లో విద్యుత్ సరఫరా నియంత్రణ ప్రక్రియను ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీని కూడా సీఎండీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంతాలకు అతీతంగా జాతీయ పండుగ

### బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ,ఆగస్టు15,ప్రభాతవార్తప్రతినిధి:**కులమత, ప్రాంతాలకు అతీతంగా జాతీయ పండుగ జరుపుకుంటున్నామని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చినా వందేమాతర గీతం ఆలపించడం ఆగిపోయిందని ఇవాళ ప్రధాని మోదీ వందేమాతర గీతం పూర్తిగా ఆలపించారని తెలిపారు. కొందరు సంకుచిత మతతత్వ ఆలోచనతో ఏ మాతకీ వందనం చెప్పకుండా భీష్మించుకుని కూర్చున్నారని మండిపడ్డారు.అధికారికంగా దేశం మొత్తం వందేమాతర గీతం పూర్తిగా ఆలపించారని మాధవ్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఏక్ భారత్ నినాదం తీసుకొచ్చారని అన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వంలో టెర్రరిస్టు, మావోయిస్టు కార్యకలాపాలు లేకుండా చేశారని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.



## జూనియర్ వైద్యుల మౌన నిరసన

### డిమాండ్ల సాధనపై వెనక్కి తగ్గేది లేదని స్పష్టం

**గుంటూరు మెడికల్ , ఆగస్టు 15, ప్రభాత వార్త:** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూనియర్ వైద్యులు చేపట్టిన సమ్మె శనివారం ఆరో రోజుకు చేరింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు వైద్య కళాశాల జూనియర్ వైద్యుల సంఘం, ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వైద్యులు మోన నిరసన తెలిపారు.స్వాతంత్ర్య దినోత్సవం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి నినాదాలు, ఆందోళన ప్రదర్శనలు నిర్వహించకుండా మోనంగా నిరసన తెలిపారు. దేశ స్వాతంత్రం కోసం ఎందరో చేసిన త్యాగాలను స్మరించుకుంటూనే.. వైద్య రంగంలో సేవలందిస్తున్న యువ వైద్యుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మోన నిరసన తమ ఉద్యమం నుంచి వెనక్కి తగ్గినట్లు కాదని జూనియర్ వైద్యులు స్పష్టం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై సంఘం ప్రతినిధులు, సభ్యులు సమావేశమై చర్చించారు. ఉద్యమాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమాలోచనలు చేశారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ గౌరవానికి ప్రాధాన్యమిస్తూ ఈ రోజు మోనంగా నిరసన తెలిపామని, తమ డిమాండ్ల సాధన కోసం తదుపరి రోజుల్లో కార్యాచరణ కొనసాగిస్తామని జూనియర్ వైద్యులు తెలిపారు.

## హోం శాఖ కొలువుల భర్తీకి వయోపరిమితి పెంపు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** హోం శాఖ పరిధిలోని పోలీసు, ఫైర్ సర్వీస్, జైళ్ల శాఖ, ఎస్‌పిఎఫ్, ఫోరెన్సిక్ విభాగాల్లో ఎస్‌ఐ, ఏ ఎస్‌ఐ, కానిస్టేబుల్ తత్సమాన పోస్టుల భర్తీకి ఇటీవల వెలువడ్డ నోటీఫికేషన్‌కు సంబంధించి వయో పరిమితిని రెండేళ్లు పెంచారు. ఈ మేరకు పోలీసు నియామక మండలి ఛైర్మన్ శ్రీనివాస రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# ఇంద్రకీలాద్రి ఇఓకు ఉత్తమ పురస్కారం


**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఓ వి.కె. సీనా నాయక్‌కు విశిష్ట పురస్కారంను మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శనివారం స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో అందుకున్నారు. దుర్గగుడి ఈఓగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి సీనా నాయక్ భక్తుల సౌకర్యార్థం వినూత్నమైన మార్పులు తీసుకువచ్చారు. ముఖ్యంగా ఇంద్రకీలాద్రిపై రద్దీ నియంత్రణ, నిరంతర భద్రతా పర్యవేక్షణ, శరన్నవరాత్రి ఉత్సవాల ముందస్తు ప్రణాళికలు, మరియు ఆలయ పరిసరాల ఆధునీకరణలో ఆయన చూపిన చొరవను ప్రభుత్వం ప్రత్యేకంగా అభినందించింది. భక్తుల పట్ల కఠినమైన జవాబుదారీతనం అమలు చేయడం, సేవా దృక్పథాన్ని పెంచడంలో ఆయన చేసిన ఉత్తమ పరిపాలనా సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్, పోలీస్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈఓ సీనా నాయక్ ప్రతిష్టాత్మక పురస్కారం అందుకోవడం పట్ల ఆలయ అధికారులు, అర్చక సిబ్బంది మరియు భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

**పంద్రాగస్టు వేడుకల్లో అలరించిన దేవదాయశాఖ శకటం:**
అమరావతి రాజధానిలో శనివారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర దేవదాయ శాఖ శకటం అలరించింది. ముఖ్యమంత్రి సమక్షంలో స్వాతంత్ర దినోత్సవకార్యక్రమంలో ప్రదర్శనలో పాల్గొన్న రాష్ట్ర దేవాదాయ శాఖశకటం ఇంద్రకీలాద్రి శ్రీ కనకదుర్గ నగర్‌లో సందర్శకుల సందర్శన నిమిత్తం కొలువుదీరింది.

**– అన్నదాన భవనానికి తుదిమెరుగులు:**
దుర్గమ్మవారి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన భవనం, ప్రసాదాల తయారీ కేంద్రం తుది మెరుగులు దిద్దుకుంటోంది. శరన్నవరాత్రి ఉత్సవాల లోపే భక్తులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని ఇఓ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ అధికారులు, పాలకమండలితో కలిసి ఇఓ సంయుక్తంగా పరిశీలించారు.



కృష్ణానదిలో వరుణమంత్ర పఠనాలు చేస్తున్న ఋత్విక్కులు





ఉత్తమ ఉద్యోగులకు పురస్కారమందిస్తున్న ఇఓ, చైర్మన్, దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:**
దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యన్నదాన పథకానికి విజయవాడకు చెందిన బి శిల్ప , బి సనీల వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116విరాళము శనివారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు అనంతరం వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**దుర్గమ్మవారి సేవలో విఐపిలు:**
దుర్గమ్మవారిని శనివారం సినీ నటులు బుల్లి రాజు రేవంత్ మరియు తన చెల్లెలు ఆశ్రిత తల్లిదండ్రులు శ్రీనివాసరావు దేవితో కలిపి శ్రీ అమ్మవారి దర్శనము చేసుకున్నారు. ప్రముఖ హీరోయిన్ శ్రీ లీల శ్రీ అమ్మవారి దర్శనము చేసుకున్నారు.



మంత్రి లోకేష్ నుంచి ఉత్తమ పురస్కారం అందుకుంటున్న ఇఓ

**ఇంద్రకీలాద్రిపై ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు:**
దుర్గమ్మవారి ఆలయంలో శనివారం ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ఇఓ వికె శీనా నాయక్ జాతీయ పతాకావిష్కరణ చేసి, ప్రగతి నివేదిక సమర్పించిన అనంతరం 50 మంది సిబ్బందికి ప్రోత్సాహక ప్రశంసా పత్రాల ప్రదానం కార్యక్రమంలో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ వేడుకల్లో పాలకమండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, టి. హరికృష్ణ, టి. రమాదేవి, ఎస్.సరిత, ఆలయ వైదిక కమిటీ సభ్యులు, ఇంజనీరింగ్ మరియు పరిపాలనా విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వేదోక్తంగా కొనసాగుతున్న వరుణయాగాలు:**
సకల లోకకల్యాణార్థం, సమృద్ధిగా వర్షాలు కురవాలని ఇంద్రకీలాద్రిపై త్రయాహ్నిక "వరుణ యాగములు, వరుణ జపములు" రెండవ రోజు శనివారం వేదోక్తంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాస్నానఘాట్ మరియు పాత యాగశాల వేదికలుగా విశేష పూజలు జరిగాయి.

# ఎర్రకోట వేడుకలకు హాజరుకాని రాహుల్,ఖర్గే

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు, కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎర్రకోట వద్ద శనివారం జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకలకు హాజరుకాలేదు. ఇద్దరూ ఈ వేడుకలకు హాజరుకాకపోవడం వరుసగా ఇది రెండోసారి. ఎర్రకోట వద్ద ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా జరిగాయి. 80వ ఇండిపెండెన్స్ డే వేడుకలు ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరిగాయి. సాధారణంగా ఈ వేడుకలకు రాజకీయాలకు అతీతంగా ప్రతిపక్ష నేతలు, ఇతర పార్టీల నాయకులు కూడా హాజరవుతారు. గతంలో ఖర్గే, రాహుల్ సహా అగ్రనేతలు హాజరయ్యేవారు. కానీ, గత ఏడాది జరిగిన వేడుకలతోపాటు ఈరోజు జరిగిన వేడుకలకు కూడా ఇద్దరూ హాజరుకాకపోవడం ఆసక్తికరంగా మారింది. అధికారపక్షానికి, ప్రతిపక్షానికి మధ్య దూరం పెరిగింది అనేందుకు ఈ పరిణామం ఒక నిదర్శనం అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇటీవల జరిగిన పార్లమెంట్ సమా వేశాలు అధికార, ప్రతిపక్షాల మధ్య వైరంగా మారిన సంగతి తెలిసిందే. మోడీపై, అమిత్ షాపై రాహుల్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాహుల్ ఎర్రకోట వద్ద వేడుకలకు చివరిగా 2024లో హాజరయ్యారు. అప్పట్లో రాహుల్‌కు కేటాయించిన సీటుపై వివాదం నడిచింది. ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీకి రెండో వరుసలో సీట్లు కేటాయించడం వివాదాస్పదంగా మారింది. ఇలాంటి వేడుకల్లో ప్రతిపక్ష నేతకు ముందు వరుసలో సీటు కేటాయించాలి. ఆ తర్వాత నుంచి వేడుకలకు ఆయన హాజరవ్వడం లేదు. సాధారణంగా లోక్‌సభ ప్రతిపక్ష నేతకు క్యాబినెట్ హోదా ఉంటుంది. ప్రోటోకాల్ అనుసరించాలి.

రాహుల్‌కు సీటు కేటాయిం పులో ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోలేదు. దీనిపై అప్పట్లో కాంగ్రెస్ విమర్శలు చేసింది. ఆయనను అవమానించడం అంటే, ప్రజల్ని అవమానించినట్లే అని వ్యాఖ్యానించింది. అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షం తమ పంతాలకు ఎప్పటి నుంచో వస్తున్న సంప్రదాయాల్ని కాలరాస్తున్నాయని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

### ఇండోనేసియాలో భారీ భూకంపం.. 7.7 తీవ్రత

# 50 మంది మృతి, సునామీ హెచ్చరిక జారీ

**జకార్తా, ఆగస్టు 15:** ఇండొనేసియాలో భారీ భూకంపం సంభవించింది. తూర్పు ఇండొనేసియాలోని ఫ్లోరెస్ దీవి సమీపంలో శనివారం తెల్లవారుజామున 7.7 తీవ్రతతో భారీ భూకంపం తీవ్ర భయాందోళనకు గురిచేసింది. భూకంపం ధాటికి భవనాలు దెబ్బతినగా 50 మంది మృతి చెందినట్లు, డజన్ల కొద్దీ ప్రజలు గాయపడినట్లు అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. బలమైన ప్రకంపల నేపథ్యంలో కొద్దిసేపు సునామీ హెచ్చరిక జారీ చేయడంతో వందలాది మంది ప్రజలు ఎత్తయిన ప్రాంతాలకు పరుగులు తీశారు.

**భూకంపం ధాటికి భవనాలకు బీటలు**
అమెరికా జియోలాజికల్ సర్వే (యుఎస్‌జిఎస్) ప్రకారం.. ఫ్లోరెస్ దీవి ఉత్తర తీరానికి సమీపంలో భూకంప కేంద్రం నమోదైంది. ఎండె నగరానికి వాయువ్యంగా సుమారు 68 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూకంపం చాలా తక్కువ లోతులో సంభవించడంతో ప్రకంపనలు తీవ్రంగా కనిపించాయి. తర్వాత అదే ప్రాంతంలో 6.1 తీవ్రతతో సహా పలు ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం కారణంగా పలు భవనాలు దెబ్బతిన్నాయి. ఆసుపత్రుల్లోని రోగులు సైతం భయంతో బయటకు పరుగులు తీశారు. కొన్ని భవనాల గోడలకు పగుళ్లు ఏర్పడినట్లు స్థానికులు తెలిపారు.

**సునామీ హెచ్చరిక.. వందలాది మంది ప్రజల తరలింపు**
భూకంపం తర్వా ఇండొనేసియా వాతావరణ, వాతావరణ శాస్త్ర, భూభౌతిక సంస్థ (బిఎంకెజి) సునామీ హెచ్చరిక జారీ చేసింది. 0.5 మీటర్ నుంచి 3 మీటర్ల వరకు అలలు వచ్చే అవకాశం ఉందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. తూర్పు నుసా తెంగారా, దక్షిణ సులవేసి, పశ్చిమనుసా తెంగారా ప్రాంతాలకు సునామీ ముప్పు ఉండొచ్చని హెచ్చరించారు. దీంతో ఫ్లోరెస్ దీవిలోని మౌమెరె సహా పలు ప్రాంతాల్లో ప్రజలు ఎత్తయిన ప్రదేశాలకు తరలివెళ్లారు. సముద్రం వెనక్కి వెళ్లి దృశ్యాలు కూడా కనిపించినట్లు స్థానికులు తెలిపారు. అయితే కొద్దిసేపటి తర్వాత సునామీ హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. భూకంపం కారణంగా ఇద్దరు మృతి చెందినట్లు విపత్తు నిర్వహణ అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య, భవనాలకు జరిగిన నష్టం తదితర వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఫిన్లాండ్‌లో శిక్షణ

### 17నుంచి 26వరకు 8 రోజులు పర్యటించనున్న ఉపాధ్యాయులు

**విజయవాడ.ఆగస్టు15,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ను దేశానికే తలమానికంగా తీర్చిదిద్దేందుకు విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు విద్యారంగంలో గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దే ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ లో 37మందిని సింగపూర్ పంపించిన రాష్ట్రప్రభుత్వం... తాజాగా మరో 29మందిని ఫిన్లాండ్ పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. ఆగస్టు 17 నుంచి 26వ తేదీ వరకు 8రోజులపాటు ఉత్తమ ఉపాధ్యాయులు ఫిన్లాండ్ లో పర్యటించనున్నారు. ఫిన్లాండ్ విద్యారంగంలోని ఉత్తమ బోధనా పద్ధతులను అధ్యయనం చేసి, రాష్ట్రంలో సహ ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇచ్చేలా ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేశారు. అంతర్జాతీయ వృత్తిపర అభివృద్ధి కార్యక్రమం పేరిట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక మార్గదర్శక కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా 2026 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 29 మంది టీచర్లను ఫిన్లాండ్‌లోని టుర్కు విశ్వవిద్యాలయంలో నిర్వహించే ప్రొఫెషనల్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ లో పాల్గొనే అవకాశం కల్పించడం ద్వారా వారికి అంతర్జాతీయ అనుభవాన్ని అందించాలని నిర్ణయించారు.

**.ప్రపంచస్థాయి బోధనా పద్ధతులపై అధ్యయనం.**
ప్రపంచ స్థాయి విద్యా విధానాలు, వినూత్న బోధనా పద్ధతులను ప్రత్యక్షంగా అర్థం చేసుకోవడానికి ఉపాధ్యాయులకు అవకాశం కల్పించడం, తద్వారా రాష్ట్రంలో బోధన, అభ్యసన నాణ్యతను బలోపేతం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. ఫిన్లాండ్‌లోని టుర్కు విశ్వవిద్యాలయంతో కలిసి జాయ్ అండ్ ప్లే పద్ధతి ద్వారా.. ప్రారంభ బాల్య విద్య , ప్రాథమిక విద్య లో వృత్తిపర శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమం ఫిన్లాండ్‌లోని అత్యుత్తమ విద్యా వ్యవస్థ ద్వారా మన ఉపాధ్యాయుల వృత్తిపర సామర్థ్యాలను పెంపొందించడంపై దృష్టి సారిస్తుంది. ఇందులో బాలకేంద్రిత అభ్యసన , ఆనందదాయక బోధన , ఆట ఆధారిత విద్య వంటి వినూత్న తరగతి గది బోధనా పద్ధతులకు ప్రాధాన్యత ఇస్తారు. మూడు దశల్లో ఈ ప్రోగ్రామ్ ను అమలుచేసే విధంగా కార్యక్రమానికి రూపకల్పన చేశారు.

**మూడు దశల్లో ఉపాధ్యాయులకు శిక్షణ..**
మొదటి దశ ఓరియంటేషన్ విజయవాడలో 4 రోజుల ప్రత్యక్ష శిక్షణా కార్యక్రమం ఇప్పటికే పూర్తయింది. ముగ్గురు ఫిన్నిష్ నిపుణులు ఈ శిక్షణ నిర్వహించారు. ఫిన్నిష్ విద్యా వ్యవస్థ, బోధనా పద్ధతులు, డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ వర్క్, మెంటరింగ్ కార్యకలాపాలను పరిచయం చేశారు.

రెండోదశలో ఫిన్లాండ్‌లో ప్రత్యక్ష కార్యక్రమం (ఆగస్టు 17-26, 2026). ఫిన్లాండ్‌లోని టుర్కు, రౌమాలో 8 రోజుల ప్రత్యక్ష బోధన, అభ్యసన అనుభవాలను అందిస్తారు. తరగతి గదుల పరిశీలన, ప్రదేశ సందర్శనలు, ప్రారంభ బాల్య విద్యా కేంద్రాలు, ఉపాధ్యాయ శిక్షణా పాఠశాలల్లోని విద్యావేత్తలతో సంభాషణలు ఇందులో ఉంటాయి. మూడోదశలో ఆన్‌లైన్ మెంటరింగ్, ప్రాజెక్ట్ మద్దతు ఉంటాయి. శిక్షణ అనంతరం ఆన్‌లైన్ మెంటరింగ్ సెషన్లు. పాఠశాల ఆధారిత ప్రాజెక్టుల అభివృద్ధి, అమలు, బోధన మెరుగుదలపై దృష్టి. విశ్వవిద్యాలయ మెంటర్లు మూడు నిర్మాణాత్మక ఆన్‌లైన్ మెంటరింగ్ సెషన్ల ద్వారా నిరంతర మార్గదర్శనం చేసి, మద్దతు అందిస్తారు.

**కార్యక్రమ ముఖ్య లక్ష్యాలు.**అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విద్యా విధానాలు, బోధనా పద్ధతుల ద్వారా బేసిక్ అభ్యసన సూత్రాలు , విజ్ఞానం , నైపుణ్యాల పై అవగాహనను బలోపేతం చేయడం. అంతర్జాతీయ విద్యా విధానాలు , తరగతి గది వాతావరణాలు సాంస్కృతిక దృక్పథాలపై అవగాహన కల్పించడం. డిజిటల్ సాధనాలు, అభ్యసన వనరులను సమర్థవంతంగా ఉపయోగించడాన్ని పెంపొందించడం. విద్యావేత్తలు, పాఠశాల విద్య లీడర్లలో నాయకత్వం, మెంటరింగ్ సామర్థ్యాలను అభివృద్ధి చేయడం. అభ్యసన, ఆనందం, శ్రేయస్సును ప్రోత్సహించే వినూత్న పాఠశాల సంస్కృతులను ప్రోత్సహించడం. బాలకేంద్రిత, ఆనందదాయక బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపరచడానికి ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలు.

**ఫిన్లాండ్ శిక్షణతో ఉపయోగం ఏమిటి?..**
ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు ఫిన్లాండ్‌లోని ప్రారంభ బాల్య విద్య, ప్రాథమిక విద్య (ఫిన్లాండ్‌లో 1 నుండి 6 తరగతులు) విధానంపై పరిచయం పొందుతారు. పాల్గొనేవారు శిక్షణ పూర్తయి స్వస్థలాలకు చేరుకున్నాక తమ సొంత అభివృద్ధి ప్రాజెక్ట్‌ను రూపొందిస్తారు. ఇందులో వారు ఫిన్నిష్ బోధనా విధానాలు, పద్ధతులను పరిశీలించి, వాటిని తమ పాఠశాలలు, తరగతి గదులు, అభ్యసన వాతావరణంలో అమలు చేస్తారు.

కార్యక్రమంలో రూపొందించిన పాఠశాల ఆధారిత అభివృద్ధి ప్రాజెక్టులను పాల్గొనేవారు తొలుత తమ తమ పాఠశాలల్లో అమలు చేస్తారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు జిల్లా, మండల స్థాయిలలో తోటి ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్లుగా, మెంటర్లుగా వ్యవహరిస్తారు. ఫిన్నిష్ విద్యా వ్యవస్థ నుండి నేర్చుకున్న ముఖ్య అంశాలను ఆంధ్రప్రదేశ్ విద్యా వాతావరణానికి అనుగుణంగా మార్చి అమలు చేస్తారు.



## కాంగ్రెస్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపనపై విమర్శలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో 80వ స్వాతంత్ర దిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల సందర్భంగా జరిగిన ఒక ఘటనపై స్వల్ప వివాదం మొదలైంది. వందేమాతరం గేయానికి ఇటీవల పూర్తిస్థాయి జాతీయ గేయంగా గౌరవం దక్కింది. జాతీయ గీతానికి ఉన్న గౌరవాన్నే కేంద్రం కల్పించింది. దీంతో తాజా స్వాతంత్ర్య దిన వేడుకల్లో వందేమాతరం ఆలపించడం తప్పనిసరి అయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన వేడుకల సందర్భంగా కూడా వందేమాతరాన్ని నిర్వాహకులు ప్లే చేశారు. అది కూడా పూర్తి గేయాన్ని. అయితే, ఈ గేయం ప్లే అవుతుండగా సోనియా, రాహుల్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. వందేమాతరం ప్లే అవుతున్నప్పుడు సోనియా, రాహుల్ కాస్త అటూ, ఇటూ చూడటం చేశారు. దీంతో పూర్తి వందేమాతరం గేయం ప్లే అవ్వకుండా ఆపేయాలంటూ సూచించారు అంటూ ప్రచారం జరుగుతోంది. ఈ సమయంలో పక్కనే కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ఉన్నారు. సోనియా, ఖర్గే కాస్సేపు ఏదో చర్చించుకుంటున్నట్లు అక్కడి వీడియోలో కనిపించింది. దీంతో వారు వందేమాతరాన్ని ఆపేయమన్నారంటూ ప్రచారం జరగడంతో ఆ పార్టీ స్పందించింది. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఖర్గే చాలాసేపు నిలబడే ఉన్నారు. పెద్దవయసు కావడంతో ఆయనకు కుర్చీ ఏర్పాటు చేయాల్సిందిగా నిర్వాహకులకు సూచించారని, ఆ గేయాన్ని ఆపాలని చెప్పలేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రచారానికి తెరపడింది. వందేమాతరం పూర్తి గేయాన్ని ఈ రోజు అధికారికంగా ఢిల్లీలోని ఎర్రకోటలో ప్లే చేశారు. మోదీ జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తర్వాత ఆర్మీ తమ బ్యాండ్‌తో వందేమాతరం గేయాన్ని ఆలపించింది. ఈ గేయానికి జాతీయ గీతం తరహా హోదా దక్కిన తర్వాత తొలిసారి దేశమంతటా పూర్తి వందేమాతరాన్ని భారతీయులు ఆలపించారు.

## మారుపేర్లతో ఒకే వ్యక్తికి బహుళ పాస్‌పోర్టులు

### యుఎస్ కాన్సులేట్ అధికారుల ఫిర్యాదుతో అరెస్టు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 15, ప్రభాతవార్త:** నకిలీ డాక్యుమెంట్లను ఉపయోగించి, మారుపేర్లతో ఒకే వ్యక్తి బహుళ భారతీయ పాస్ పోర్టులను తీసుకున్నాడు. వాటి ద్వారా విదేశీ ప్రయాణాలు సైతం చేశాడు. అమెరికా విసా దరఖాస్తుల సమయంలో ఒకే వ్యక్తి వేరువేరు పాస్‌పోర్టులను ఉపయోగించడంతో యుఎస్ కాన్సులేట్ అధికారులు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నింది తుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. కోకా పేటలో నివాసం ఉంటున్న మోతుకుపల్లి లక్ష్మీకాంత్‌రెడ్డి(55) అనే వ్యక్తి వేరువేరు భారతీయ పాస్‌పోర్టులను కలిగి ఉన్నాడని యుఎస్ కాన్సులేట్ అధికారులు గత మార్చి 22వ తేదీన గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేశారు. లక్ష్మీకాంత్‌రెడ్డి వేరువేరు పేర్లు, పుట్టినతేదీ, గుర్తింపు వివరాలతో వేరువేరు భారతీయ పాస్‌పోర్టులను తీసుకోవడంతో పాటు వాటిని అమెరికా విసా దరఖాస్తు కోసం ఉపయోగించినట్లు యుఎస్ కాన్సులేట్ అధికారులు గుర్తించారు. యుఎస్ కాన్సులేట్ అధికారుల పిర్యాదు ఆధారంగా గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో మోతు కుపల్లి లక్ష్మీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి 1997లో నాంపల్లిలో ఉన్న సమయంలో తాను ఉంటున్న అడ్రస్‌తో చదువు రాదని చెప్పి మేధ ప్రసూన్‌కుమార్ రెడ్డి పేరుతో ఓ పాస్‌పోర్టు తీసుకున్నాడు. 2007లో ఇదే పాస్‌పోర్టు రెన్యూవల్ చేసుకున్నాడు. 2017లో తన అసలు పేరుతో మోతుకుపల్లి లక్ష్మీకాంతరెడ్డి అనే పేరుతో ఓ పాస్‌పోర్టు తీసుకొని కొన్ని రోజులు సదరు పాస్‌పోర్టు మీద అమెరికాకు సైతం వెళ్లి వచ్చాడు. వీటితో పాటు ఇదే వ్యక్తి నకిలీ రెసిడెన్షియల్ సర్టిఫికేట్లు, డేట్ ఆఫ్ భర్త్ సర్టిఫికేట్లు పెట్టి ముద్దనోళ్ల లక్ష్మీకాంత్ పేరుతో మరో పాస్‌పోర్టు సైతం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈమేరకు సికింద్రాబాద్ రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం నుంచి సదరు పాస్‌పోర్టు దర ఖాస్తు పత్రాలను పోలీసులు సేకరించారు.



లక్ష్మీకాంత్‌రెడ్డి (ఫైల్)




Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | ఆదివారం 16 ఆగస్టు 2026 | I

# 59 మంది ఆర్ఎంసి ఉద్యోగులకు సేవా పురస్కారాలు

## పురస్కారాలు ప్రధానం చేసిన మంత్రి దుర్గేష్ కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 15 (ప్రభాతవార్త)** రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణ లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పై నగరపాలక సంస్థలు ఏర్పాటుచేసిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ఆర్ఎంసి కి చెందిన 59 మంది ఉత్తమ అధికారులు ఉద్యోగులకు మంత్రి కందుల దుర్గేష్ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతులమీదుగా అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా పాల్గొన్నారు. అడిషనల్ కమిషనర్ పివి రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, సెక్రటరీ జి శైలజ వల్లి ,ఎస్ఇ రీటా, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి ,ఎంహెచ్ఓ ఏ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మాలిక్ ,రెవిన్యూ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు, అకౌంటెంట్ ఆర్ నాగమణి, సి ఎం ఎం వి రామలక్ష్మి, ఈ ఈ లు ఎన్ వి కే మాధవి, మదర్స్ అలీ, డిప్యూటీ ప్లానర్ పి నాయుడు అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు ఇతర ఆర్ఎంసి అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం జిల్లాలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**జిల్లా ఏర్పాటైన తర్వాత తొలిసారి వేడుకలు**
**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ దినేష్‌కుమార్**



**రంపచోడవరం, ఆగస్టు 15:ప్రభాతవార్త.** నూతనంగా ఏర్పాటైన పోలవరం జిల్లాలో తొలి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కె. దినేష్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లను కలిపి పోలవరం జిల్లా ఏర్పాటు అనంతరం జరుగుతున్న తొలి స్వాతంత్ర్య వేడుకలు చారిత్రాత్మకమని కలెక్టర్ అన్నారు. అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో గిరిజన యోధులు సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. 'వికసిత్ భారత్--స్వర్ణాంధ్ర విజన్--2047' లక్ష్య సాధనలో పోలవరం జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా 40,358 మంది రైతులకు రూ.28.16 కోట్లు అందించామని, 53,474 మంది విద్యార్థుల కుటుంబాలకు 'తల్లికి వందనం' కింద రూ.69.52 కోట్లు జమ చేశామని వెల్లడించారు. 382 మంది ఉపాధ్యాయుల నియామకం చేపట్టామని, 24,587 మంది గిరిజన రైతులకు 82,646 ఎకరాలకు అటవీ హక్కు పత్రాలు అందించామని తెలిపారు. 68,434 కుటుంబాలకు తాగునీటి సౌకర్యం కల్పించామని, పీఎం--జన్మన్ కింద 2,257 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని చెప్పారు. రహదారులు, గృహ నిర్మాణం, విద్యుదీకరణ, వైద్యం, గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పోలవరం పునరావాసంలో భాగంగా రంపచోడవరం డివిజన్‌లో 3,537 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి 5,564 కుటుంబాలకు రూ.339.45 కోట్ల పరిహారం అందించామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సొళ్ల బొజ్జిరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్‌కుమార్, చింతూరు సబ్ కలెక్టర్ శుభం నొఖ్వాల్, ఓఎస్డీ జావళి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ పెద్దలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు. విశిష్ట సేవలందించిన అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

## చింతూరు ఎక్సైజ్ సీఐ విజయలక్ష్మి కి ఉత్తమ సేవా పురస్కారం



**కూనవరం, ఆగస్టు 15, ప్రభాతవార్త :** చింతూరు డివిజన్ ఎక్సైజ్ ఏ ఎన్ఫోర్స్మెంట్ సిఐగా పనిచేస్తున్న విజయలక్ష్మి కి ఉత్తమ సేవా పురస్కారం దక్కింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలందించినందుకు గాను ఈ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ చేకూరి (ఐఏఎస్ ), డైరెక్టర్ రాహుల్ దేవ్ ( ఐపీఎస్ ) చేతుల మీదుగా ఈ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వార్త విలేకరితో మాట్లాడారు. చింతూరు డివిజన్ లో అత్యధికంగా ప్రభుత్వానికి ఆదాయాన్ని కలిగించినందుకు, అలాగే అక్రమ గుడుంబా రవాణా వంటి కార్యక్రమాలలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఈ అవార్డును అందించినట్లు ఆమె తెలిపారు.

## దేశ ప్రగతికి ప్రతి పౌరుడు పునరంకితం కావాలి

**ఘనంగా మున్సిపల్ కార్యాలయం వద్ద స్వాతంత్ర దినోత్సవ వేడుకలు**
**పాల్గొన్న కమిషనర్ రాహుల్ మీనా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 15( ప్రభాతవార్త)** స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద 80 వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తో పాటు మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. తొలిత మహాత్మా గాంధీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ దేశ ప్రగతిలో ప్రతి పౌరుడు పునరాంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ 80 ఏళ్లలో దేశం ఎంతో పురోగతి సాధించిందని ఇంకా సాధించాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ సమగ్రత కోసం భద్రత కోసం ప్రగతి కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఎందరో మహానుభావులు మన దేశానికి స్వాతంత్రం తీసుకొస్తే ప్రధాని నరేంద్ర మోడీ ఒక శక్తివంతమైన దేశంగా భారతదేశాన్ని మారుస్తూ ఆ మహనీయుల త్యాగాలకు సరైన నివాళులు అర్పిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిజమైన స్వాతంత్ర్య ఫలాలు పేద ప్రజలందరికీ దగ్గర చేరుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, సెక్రటరీ శైలజ వల్లి ,ఎస్ ఇ రీటా ,సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి , ఎం హెచ్ ఓ ఏ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మాలిక్, రెవెన్యూ అధికారి శ్రీ శ్రీనివాసరావు ,సి ఎం ఎం రామలక్ష్మి ,అకౌంటెంట్ నాగమణి ,ఆర్ఎంసి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మాధురి విద్యాలయంలో ఘనంగా 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు



**శంఖవరం ఆగస్టు 15 ప్రభాతవార్త** మాధురి విద్యాలయంలో 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. మండలంలోని కత్తిపూడి లో గల విద్యాలయంలో దేశభక్తి ఉత్సాహంతో పాఠశాల ప్రాంగణం త్రివర్ణ పతాకాలతో కళకళలాడింది.వేడుకలకు విద్యాలయం చైర్మన్ కదారి తమ్మయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. జెండా ఆవిష్కరణ అనంతరం విద్యార్థులు "జన గణ మన" జాతీయ గీతాన్ని గర్వంగా ఆలపించారు. ఈ సందర్భంగా తమ్మయ్య నాయుడు మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ, విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తితో రాణించాలని పిలుపునిచ్చారు. "2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణంలో నేటి విద్యార్థుల పాత్ర కీలకం" అని అన్నారు. దేశ అభివృద్ధికి తమ వంతు కృషి చేయడం ప్రతి భారతీయుడి బాధ్యత అని విద్యార్థులకు తెలియజేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు, నృత్యాల ప్రదర్శన ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్, పిరమిడ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. దేశభక్తి వ్యాసరచన, చిత్రలేఖన, పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ముందుగా డైరెక్టర్ సీతాదేవి జ్యోతి ప్రజ్వలనతో స్వతంత్ర దినోత్సవ వేడుకలు ప్రారంభించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వాన్ని చాటుతూ మిఠాయిలు పంపిణీతో వేడుకలు ముగించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అడపా ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెట్టును ఢీ కొన్నా ఆటో డ్రైవర్ మృతి !



**మోతుగూడెం ఆగస్టు:15 ప్రభాతవార్త** చింతూరు సర్కిల్ గుర్తేడు మండలం డొంకరాయి పోలీస్ స్టేషన్ సమీపాన ఉన్న కల్వర్ట్ వద్ద చెట్టును ఢీ కొని ఆటో డ్రైవర్ కిషోర్ (35) మృతి చెందారు.డొంకరాయి సబ్ ఇన్స్పెక్టర్ చరణ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో డొంకరాయి నుండి మంగంపాడు వెళ్లే ఆటో నందు డొంకరాయి ఊరు బయట నందు గల కల్వర్టు దగ్గర ఓవర్ స్పీడ్ తో ఆటో నడుపుతు ప్రయాణించటం తో చెట్టును గుద్దుకొని డ్రైవర్ కిషోర్ మృతి చెందడం జరిగిందన్నారు. ఈ సంఘటన లో ఆటోలో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు వాళ్లకి చిన్న చిన్న గాయాలైనవన్నారు. వాళ్లని ప్రాదమిక వైద్యనిమిత్తం హాస్పటల్ కి తరలించడం జరిగిందన్నారు.మృతి చెందిన కిషోర్ మృతదేహాన్ని చింతూరు ఏరియా ఆసుపత్రి కి పోస్టుమార్టం నిమిత్తం తరలించడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసీ దర్యాప్తు నిర్వహిస్తున్నమని ఎస్సై తెలిపారు.

## యువతే దేశ ప్రగతికి చోదకశక్తి: డా.లయన్ జి.వి.రావు



**రామచంద్రపురం,ఆగస్టు 15 (ప్రభాతవార్త):** మోడరన్ విద్యాసంస్థల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి.సంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం జిఎండి మోడరన్ హై స్కూల్ విద్యార్థులు 800 అడుగుల జాతీయ జెండాతో పట్నంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు.వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సూచించారు.దేశాభివృద్ధిలో నేటి యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ముఖ్యంగా మోడరన్ హైస్కూల్ బాలురు ప్రదర్శించిన 'ఓ సైనిక' దేశభక్తి గీతం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేసింది.కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌదరి,ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్ సీహెచ్.రాజేష్,వైస్ ప్రిన్సిపాల్ పీఎస్.ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సీహెచ్.శ్రీనివాస్, హైస్కూల్ కో-ఆర్డినేటర్ వై.రాజు,సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.



# కాకినాడలో ఘనంగా 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**ముఖ్యఅతిథిగా విచ్చేసి సందేశం ఇచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ - ఆకట్టుకున్న డాగ్ షో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు 15(ప్రభాతవార్త):** కాకినాడ భానుగుడి పోలీస్ పరేడ్ గ్రౌండ్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్,ఎస్పీ బిందు మాధవ్, జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ట్రైనీ కలెక్టర్ ప్రియా తదితరులు స్వాగతం పలికారు. వేదికకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ పతాకావిష్కరణగావించినానంతరం జిల్లా ప్రగతిపై ప్రజలకు సందేశం ఇచ్చారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి అని, దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. పోలీసు జాగిలాలచే ప్రదర్శన అనంతరం ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సంబంధించిన శకటాల సందర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సతీమణి అన్నా లెజినోవా,లోక్ సభ,రాజ్యసభ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖరం,కర్రి పద్మ శ్రీ, కాకినాడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ తలాటం నాగ వెంకట సత్య,జగ్గం పేట టిటిడి పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ,పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప, కాకినాడ పట్టణ , గ్రామీణ శాసన సభ్యులు వనమాడి వెంకటేశ్వర రావు,పంతం నానాజీ, ప్రత్తిపాడు శాసన సభ్యులు సత్య ప్రభ లతో పాటు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామ స్వామి, డిఆర్ఓ డాక్టర్ పి తిప్పే నాయక్ కాకినాడ ఆర్డిఓ మల్లిబాబు వివిధశాఖల జిల్లా అధికారులు,ప్రజా ప్రతి నిధులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శకటాల ప్రదర్శనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వారికి, సాంస్కృతికకార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ ల చేతుల మీదుగాఅందజేశారు. తదుపరి జిల్లాలో ఉత్తమ సేవలను అందించిన 242 మంది అధికారులు,సిబ్బందికి ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్, ఎస్పీ అందజేశారు. చివరిగా వందేమాతరం గేయం, జాతీయ గీతాలాపనతో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా ముగిసాయి .

# బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కంబాల

**ప్రజా సేవకు పెద్దపీట - నాయకులు కార్యకర్తలు, అభిమానులల్లో హర్షం...**



**గోకవరం : ఆగష్టు 15 ప్రభాత వార్త** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యుడిగా కంబాల శ్రీనివాసరావు నియమితులయ్యారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గ బీఎల్ఏ-1గా ఆయన శనివారం సీఎండీ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో తన నియామక వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, హిందూ ధర్మ పరిరక్షణకు, పేదల సంక్షేమానికి తాను చేస్తున్న కృషిని గుర్తించిన పార్టీ అధిష్ఠానం రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ శుక్రవారం తన నియామకానికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గ బీఎల్ఏ-1గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నియోజకవర్గవ్యాప్తంగా 248 మంది బీఎల్ఏ-2లను నియమించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచామని చెప్పారు. ఎన్నికల సంఘం నిర్వహించిన ఎస్ఐఆర్ కార్యక్రమంపై గ్రామీణ ప్రాంత ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంలో ముందున్నామని తెలిపారు. పార్టీలో క్రమశిక్షణతో, సహనంతో, ఓర్పుతో పనిచేసే వారికి ఎప్పటికైనా సముచిత స్థానం లభిస్తుందన్నారు. తాను మొదటి నుంచి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి క్రమశిక్షణతో పనిచేస్తూ వస్తున్నానని, తన పనితీరును పరిశీలించిన పార్టీ నాయకత్వం ఈ అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. జగ్గంపేట, రంపచోడవరం, రాజానగరం నియోజకవర్గాల్లో విద్య, వైద్య, ఆర్థిక రంగాల్లో కోట్లాది రూపాయలతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళల్లో హైందవ చైతన్యం పెంపొందించేందుకు శ్రావణ మాసం సందర్భంగా గత నెల 11వ తేదీ నుంచి ఇప్పటి వరకు 70 వేల పట్టు చీరలు పంపిణీ చేశామని, మూడు నియోజకవర్గాల్లో నాలుగు వేల బంగారు వరలక్ష్మీ రూపులను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. తనకు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్‌తో పాటు పార్టీ అగ్రశ్రేణి నాయకులకు కంబాల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కంబాల శ్రీనివాసరావు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన విషయం తెలిసి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాషాయ శ్రేణులు, ధార్మిక వర్గాల్లో నూతనోత్సాహం నెలకొంది. పలు గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆయనను కలిసి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# త్యాగాలను స్మరించుకుంటూ.. దేశభక్తిని పెంపొందించాలి

## పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెశీ దొరబాబు





**పిఠాపురం, ఆగష్టు 15 ( ప్రభాతవార్త )** దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ భావాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఫైవ్ మాన్ కమిటీ సభ్యుడు, పిఠాపురంమాజీ ఎమ్మెల్యే పెండం దొరబాబు పిలుపునిచ్చారు. పిఠాపురం పట్టణం, మండల పరిధి గ్రామాల్లో80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పిఠాపురం జగ్గయ్య చెరువులోని బాదం మాధవరావు బాలికల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దొరబాబు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. దేశభక్తి, ప్రజాసంక్షేమాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం పిఠాపురం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ భారతానికి పునాదివేసిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసి చేసుకుని, వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ ఎస్ టి వి రాజేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం తీసుకురావడంలో ఎందరో మహనీయులు చేసిన త్యాగాలు, పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలోని స్వర్ణ గ్రామ సచివాలయం ఆవరణలోగ్రామ కార్యదర్శి కళ జాతీయపతాకాన్ని ఆవిష్కరించి, దేశనాయకుల త్యాగాలు, పోరాటాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక సమస్యల గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో బాదం మాధవరావు బాలిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పిఠాపురం తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు, పురపాలక సంఘ కార్యాలయం ఉద్యోగులు, పిఠాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్తపల్లి పద్మ బుజ్జి, మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు బుర్రా అను బాబు, చిక్కాల వరలక్ష్మి, అడపా శివరామకృష్ణ,మొయిళ్ళ విజయ్ కుమార్, పోతుల శివకుమార్( చిన్న), పోతుల శివ,సాంబత్తుల క్రాంతి, కుర్రా శివగంగాధర్, పోతుల అర్జున్, వూట సతీష్, చనుబోయిన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



# ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- క్వాంటమ్ యుఫోరియా' పేరుతో ప్రత్యేక ఎగ్జిబిషన్
- విద్యార్థుల ఆలోచనను సృజనాత్మకతను, విజ్ఞాన ప్రతిభను అభినందించిన తల్లిదండ్రులు
- బాధ్యతాయుత పౌరసత్వ భావనలను పెంపొందించడమే లక్ష్యం
- విద్యతో పాటు విలువలు, బాధ్యత, దేశ సేవ పట్ల అవగాహన
- ముువ్వన్నెల జెండాను (జాతీయ జెండా) ఆవిష్కరించిన ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్ డైరెక్టర్ కె. రవిబాబు





**రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 15, (ప్రభాతవార్త)** నగరంలోని కవలగొయ్య గ్రామంలో లో గల ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం జాతీయ జెండాలతో, రంగురంగుల అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పాఠశాల డైరెక్టర్ కె. రవిబాబు జాతీయ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి జెండా వందనం చేశారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపిస్తూ స్వాతంత్ర్య సమరయోధులకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా విద్యార్థులు వివిధ గీతాలు, నృత్యాలు, నాటికలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. చిన్నారుల ఉత్సాహభరిత ప్రదర్శనలకు పాఠశాల ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. దేశభక్తి భావాలను పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా పాఠశాలలో 'క్వాంటమ్ యుఫోరియా' పేరుతో ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను కూడా నిర్వహించారు. విద్యార్థులు తమ సృజనాత్మకత, విజ్ఞాన ప్రతిభను ప్రతిబింబించేలా వివిధ అంశాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించిన వారు విద్యార్థుల ఆలోచనా విధానాన్ని, సృజనాత్మకతను అభినందించారు. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని, కొత్త విషయాలను తెలుసుకోవాలనే ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి నిర్వహించిన వివిధ కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులలో దేశభక్తి, జాతీయ సమైక్యత, బాధ్యతాయుత పౌరసత్వ భావనలను పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాలను రూపొందించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొంది. స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను నేటి తరం విద్యార్థులు గుర్తుంచుకోవాలని, దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించేలా విద్యార్థులు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీ రవిబాబు, చైర్‌పర్సన్ శ్రీమతి విజయ, సీఈఓ శ్రీ మహేష్, ప్రిన్సిపాల్ శ్రీ శశిగిరిధర్, డీన్ శ్రీమతి హారిణి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు. కార్యక్రమం చివరలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపడంతో పాటు, వారి సాంస్కృతిక, సృజనాత్మక ప్రతిభకు వేదికగా నిలిచాయి. విద్యతో పాటు విలువలు, బాధ్యత, దేశ సేవ పట్ల అవగాహన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

# ఆదిత్య యూనివర్సిటీలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





**గండేపల్లి. ఆగస్టు 15. ప్రభాతవార్త** గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ లో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వందేమాతరం తో ప్రారంభమైన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జెండా వందనం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాసరెడ్డి,ప్రో. వైస్ ఛాన్సలర్స్ . డా. ఎ. రమేష్, డా. రవి తంగజం, రిజిస్ట్రార్ డా. జి.సురేష్, డీన్. డా. డి.కిషోర్, డీన్. స్కూల్ ఆఫ్ ఫార్మసి డా. డి. సతీష్ కుమార్,పోలిటెక్నిక్ ప్రిన్సిపాల్. ఎస్ టి వి ఎస్ కుమార్, హాస్టల్ ఇంచార్జ్ జి. హరీష్ రెడ్డి,చక్రవర్తి, డా. విజయ్ రెడ్డి, సరిత,ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన ఎందరో మహానుభావులు కృషి ఫలితమే నేటి ఈ స్వాతంత్ర్యము అని వారి త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల దేశభక్తి గీతాలు ఎంతో ఆకట్టు కున్నాయి.. ఎన్.సి.సి. మరియు యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది వందన సమర్పణ కావించగా విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమం అనంతరం మిఠాయిలు పంచి పెట్టారు.

# మండలంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## ఏకలవ్య వేడుకల్లో ఎమ్మెల్యే



**రాజవొమ్మంగి, ఆగస్టు 15, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గ్రామ గ్రామాన ఘనంగా జరిగాయి. రాజవొమ్మంగి ఏకలవ్య ఇంగ్లీష్ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో రంపచోడవరం ఎమ్మెల్యే, ఎస్టీ కమీషన్ చైర్మన్ మిరియాల శిరీషాదేవి జాతీయ జెండాను ఎగురవేశారు. ఎందరో స్వాతంత్ర్య వీరుల త్యాగ ఫలితంగా ఈరోజు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను చేసుకొంటున్నామని ఎమ్మెల్యే అన్నారు. టిడిపి నేతలు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన కేశవ్, ముప్పన సావిత్రి, చంటిబాబు, వెంకటరెడ్డి పలువురు పాల్గొన్నారు. రాజవొమ్మంగి ఎంపిపి కార్యాలయం వద్ద ఎంపిపి గోము వెంకటలక్ష్మి జాతీయ జెండాను ఎగురవేశారు. దింసా నృత్యాలను చేసిన ఏ. పి. ఆర్. బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థినులను ప్రత్యేకంగా ఎంపిపి స్వీట్లను ఇచ్చి అభినందించారు. రాజవొమ్మంగి ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో చైర్మన్ కోడెం అప్పన్నబాబు, రాజవొమ్మంగి అటవీశాఖ కార్యాలయం లో రేంజర్ ఉషారాణి, గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ షీలా అధ్యక్షతన విద్యాకమిటీ మెంబర్ కలింకోట విజయలక్ష్మి జెండాను ఎగురవేశారు. రాజవొమ్మంగి ఏ. పి. ఆర్. పాఠశాలలో ప్రిన్సిపాల్ సత్యవేణి అధ్యక్షతన చైర్మన్ పొట్టబోయిన అచ్చియ్యమ్మ, రాజవొమ్మంగి ఐ. సి. డి. ఎస్. కార్యాలయంలో సూపర్ వైజర్స్ వీరయ్యమ్మ, అమ్మిరాజు లు జాతీయ జెండాను ఎగురవేశారు. జడ్డంగి పి. హెచ్. సి లో డా నాగార్జున, డా. పావని, జడ్డంగి పోలీస్ స్టేషన్ లో ఏ. పి ఎస్. పి. ఆర్. ఐ. విటలేశ్వరరావులు జాతీయ జెండాను ఎగుర వేశారు. జడ్డంగి జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్. యం. ప్రసన్నకుమారి అధ్యక్షతన చైర్మన్ అడపా మల్లేశ్వరరావు లు జెండాను ఎగుర వేశారు.

# వాడపల్లి వెంకన్న ఆలయానికి జన నీరాజనం..

**లక్షకు పైగా భక్తులు.. స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ, 87.15 లక్షలు...**
**వృద్ధులు దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు.. డీసీ, చైర్మన్**



**ఆత్రేయపురం, ఆగస్టు 15,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రం శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో లక్షలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఏడు శనివారాల నోము ఆచరించే భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. క్యూలైన్లో నిలబడి స్వామివారిని దర్శించారు. వేకువ జామున సుప్రభాత సేవతో ప్రారంభమైన దర్శన కార్యక్రమాలు రాత్రి వరకు కొనసాగాయి. భక్తులు రాత్రి వరకూ క్యూలైన్లలో నిలబడి వెళ్ళి స్వామివారిని భక్తిశ్రద్ధలతో వీక్షించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం అంటూ స్మరించారు. ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధుల కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లొల్ల వంతెన నుంచి ఆలయం వరకు ఉచిత వాహన సౌకర్యం కల్పించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో క్యూలైన్లలో నిలబడి స్వామివారి దర్శన భాగ్యాన్ని పొందారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, మరోపక్క ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజులు కూడా ఎక్కడకక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా బిస్వామివారి దర్శనం కలిగేలా ఏర్పాట్లు నిర్వహించారు. ఈ శనివారం ఒక్కరోజు లక్షకు పైగా భక్తులు తరలి రావడంతో స్వామివారి కి రూ,87.15,697/లక్షలుకు పైగా ఆదాయం సమకూరిందని సుమారు 35 వేల మందికి పైగా అన్నప్రసాదం స్వీకరించినట్లు డిప్యూటీ కమిషనర్ ఈఓ నల్లం సూర్య చక్రధర్రావు తెలిపారు.ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి భక్తులు విజయవాడ, కడప, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా, రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉంచారు.ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్య చక్రధర రావు మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా అమలాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి శకటం ప్రత్యేక ఆకర్షణ గా నిలిసింది . 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కోనేరు నందు ఉన్న స్వాతంత్ర సమరయోధుల స్థూపం వద్ద జాతీయ జెండాను పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడపల్లి ఆధ్యాత్మిక కేంద్రంగానే కాక చారిత్రాత్మక కేంద్రంగా భాసిల్లుతుందని అన్నారు. 1931 మార్చి 30వ తేదీన చైత్ర శుద్ధ ఏకాదశి రోజున శ్రీ స్వామివారి రథోత్సవం జరుగుతున్న వేళ రథంపై ఉంచిన గాంధీజీ చిత్రపటాన్ని తొలగించాలన్న బ్రిటిష్ వారి ఆదేశాలను వాడపల్లి వాసులు , సమరయోధులు ప్రతిఘటించారు. కోపోద్రిక్తులైన బ్రిటిష్ వారు సమరయోధులపై కాల్పులు జరపగా అనేకమంది మరణించారు. కొంతమంది క్షతగాత్రులు అయినారు. ఆనాటి సంఘటనను మాజీ శాసనసభ్యులు మంతెన వెంకట సూర్య సుబ్బరాజు స్మారక స్థూపం గా నిర్మించి జాతికి అంకితం చేసినారని తెలియజేస్తూ అమరవీరులకు నివాళులు అర్పించి దేశాభివృద్ధికి అందరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు సాయిప్రసాద్, శ్రీనివాస్ యాదవ్,సుబ్బారావు సాగర్, కూటమి నాయకులు రాజు , నాగేశ్వరరావు, నారాయణరావు, వెంకన్న, ఆలయ అధికారులు పాల్గొన్నారు.ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఏర్పాట్లను భక్తులు ప్రశంసించారు. స్వామివారి సేవలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్, మనోజ్, వర్మ, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్, వరప్రసాద్, గ్రామస్తులు ఏపుగంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



## గొల్లప్రోలులో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



గొల్లప్రోలు, ఆగస్టు 15,(ప్రభాతవార్త) గొల్లప్రోలులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రత్యేక అధికారి వి.చంద్రమౌళీశ్వరి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రత్యేక అధికారి చంద్రమౌళీశ్వరి, కమిషనర్ దివిజ సంపతి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను వివరించారు. అనంతరం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేక అధికారి కమిషనర్ తో పాటు మున్సిపల్ ఉద్యోగులు జాతీయ జెండాతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మొగలి బాబ్జి,మొగలి రామ్మూర్తి, జనసేన నాయకులు బలిరెడ్డి గంగబాబు,బస్సా చిట్టిబాబు,పర్ల రాజా,మేడిశెట్టి నాగమణి,బిజెపి పట్టణ అధ్యక్షుడు చిట్టామధు,స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొసిరెడ్డి రాజా,మున్సిపల్ మేనేజర్ సర్వేశ్వరరావు,ఎఇ అహ్మద్ అలీషా,కార్యాలయ సిబ్బంది,స్వచ్ఛ గొల్లప్రోలు ప్రతినిధులు,మెప్మా,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ అరిగెల అచ్చిఅమ్మయమయ్య దొర ఆధ్వర్యంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ అచ్చియమ్మ రామయ్య దొర జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉలవకాయల నాగ లోవరాజు,మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు ఆది విష్ణు, ఎంపీడీవో సాలట్ రాజు,మండల విద్యాశాఖ అధికారి వెన్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ వెంకట భాస్కర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సౌజన్య,ఆర్ఐ బాలకృష్ణ రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్లో ఎస్సై ఎన్ రామకృష్ణ, మాధురి విద్యాలయలో మాధురి విద్యాసంస్థల అధినేత కడారి సీతాదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మలిరెడ్డి వెంకట్రాజు మండల పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని షేక్ రెహమాన్ బీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు మలిరెడ్డి నారాయణరావు,ట్రస్ట్ సభ్యులు కుర్ర నారాయణ రావు, కుర్ర నందకిషోర్ పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థికి 5,000 రూపాయలు బాలికోన్నత పాఠశాల విద్యార్థినికి 5 వేల రూపాయల నగదును 1987 సంవత్సరపు పూర్వ విద్యార్థి పెండ్యాల సుబ్రహ్మణ్య భారతి తరపున గొల్లపూడి కృష్ణారావు అందజేశారు. స్థానిక మార్కెట్ సెంటర్ లో రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైసీపీ నాయకులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మున్సిపల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి మొగలి అయ్యారావు, సీనియర్ నాయకుడు మొగలి అప్పారావు,మాజీ సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల బీముడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తెడ్లపు చిన్నారావు పలువురు మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్, మేమెంటోలు..

### శ్రీ అరిగెల కృష్ణమూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారం..



అంబాజీపేట,ఆగస్టు 15 (ప్రభాతవార్త): భారత 80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అంబాజీపేట శ్రీ అరిగెల కృష మూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు, మెమెంటో, సర్టిఫికెట్లను అందజేశారు. అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో శ్రీ అరిగెల కృష్ణమూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు, రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు, కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామ్మూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరావు, జెడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, మాజీ డిఎస్ఓ అడపా ఉదయ భాస్కర్,సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు,కృషివల చైర్మన్ గణపతి వీర రాఘవులు, ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ పత్తి దత్తుడు, ఎస్ఎంసి చైర్ పర్సన్ బండారు అమ్మాజీ, వీరా సతీష్, కొప్పినీడి ఈశ్వరరావు, అరిగెల నాని, బండారు రాజు, తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు,హెచ్ఎం కె.సాయిరామ్,పిడి కుంపట్ల ఆదిలక్ష్మి,ఉపాధ్యాయులు బెహరా మూర్తి, తదితరులు పాల్గొన్నారు. తైక్వాండో నేషనల్ రిఫరీ పి.భార్గవి, కోచ్ పి. భూషణం లకు మెమెంటో, సర్టిఫికెట్లను అందజేశారు.

## కడియం మండలంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండా ఆవిష్కరణ.. స్వర్ణ ఆంధ్ర--2047 లక్ష్య సాధనకు సమష్టి కృషికి పిలుపు



కడియం ,ఆగస్టు 15 ( ప్రభాతవార్త) కడియం మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కార్యాలయాలు మరియు పాఠశాలలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ ఆంధ్ర--2047 లక్ష్య సాధనకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డులు అందుకున్న మండల స్వర్ణ గ్రామ అధికారి ఎస్. శ్యామ్ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి-2 వై. నాగేశ్వరరావులను మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. రమేష్ అభినందించారు. జేగురుపాడు గ్రామంలోని ట్రినిటీ లూథరన్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మరియు ఇందిరాగాంధీ సెంటర్ కమ్యూనిటీ హాల్ వద్ద మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు సాకా కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి విద్య ప్రాధాన్యతను వివరించారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే సర్దార్ కాటన్ నర్సరీ అసోసియేషన్ కార్యాలయంలో నర్సరీ రైతులం సమక్షంలో అసోసియేషన్ అధ్యక్షులు రత్నం అయ్యప్ప జాతీయ జెండాను ఎగురవేశారు. స్వతంత్ర భారత కోసం ప్రాణాలర్పించిన మహానుభావుడు స్పందించుకుంటూ భారతమాతకు జై జై నినాదాలు చేశారు. ఈ స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో అధికార మరియు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,విద్యార్థులు, రైతులు, ప్రజలు ఈ వేడుకలలో పాల్గొన్నారు.

## స్వతంత్ర వీరుల త్యాగాలను ఎప్పటికీ మరువరాదు



కాట్రేనికోన ఆగస్టు 15 (ప్రభాత వార్త) దేశ స్వాతంత్రం కోసం పోరాటాలు సాగించి, ప్రాణ త్యాగాలు అర్పించిన మహనీయులను ఎప్పటికీ మరువరాదని ఎంపీపీ కోలాటి సత్యవతి, జడ్పిటిసి సభ్యుడు నేల కిషోర్, తెదేపా సీనియర్ నాయకులు నాగిడి నాగేశ్వరరావు పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శనివారం మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ,పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు . మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ సత్యవతి జాతీయ జెండాను ఎగరవేశారు. తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రవి కిరణ్, పోలీస్ స్టేషన్లో ఎస్ఐ అవినాష్ జెండాను ఎగరవేశారు. విద్యుత్ శాఖ పంచాయితీలు సహా అన్నిచోట్ల స్వతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, విత్తనాల బుజ్జి , మోకా చంద్ర నాగరత్నం, పిఎస్ఎన్ రాజు, సత్యం, వెంకట రమణ, డిప్యూటీ ఎంపీడీవో శంకరనారాయణ, బాలయోగి, సూర్యనారాయణ ,నాయకులు ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లరేవులో ఘనంగా జెండా పండుగ వేడుకలు.



తాళ్లరేవు ఆగస్టు 15 (ప్రభాతవార్త): 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. మహనీయుల త్యాగ ఫలితాలు, పోరాటాల వల్ల సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. దేశ రక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న భారత సైనికుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులకు స్వీట్స్ పంపిణీ చేశారు. తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ జి ఆర్ వి భద్ర రావు జాతీయ జెండా ను ఎగురవేశారు. బొడ్డు చినవెంకటాయపాలెం హైస్కూల్ లో హెచ్ ఎం సాయి ప్రసాద్ అధ్యక్షతన స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాళ్ళరేవు శ్రీ సత్యసాయి హైస్కూల్ లో 80 వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల అలరించాయి. తాళ్లరేవు సొసైటీలో అధ్యక్షులు విల్లవీర జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఆయా ప్రాంతాల నాయకులు పాల్గొన్నారు

## దేశ సేవకు కార్యకర్తలు అంకితం కావాలి:బీజేపీ



రామచంద్రపురం,ఆగస్టు 15 (ప్రభాతవార్త): ద్రాక్షారామలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త దేశ సేవకు అంకితమై పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెయ్యల రాంబాబు,కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రాయుడు వీరవెంకట రామకృష్ణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు బి.పద్మావతి, మండల ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి,ఉపాధ్యక్షులు దక్షిణామూర్తి, చింతా సత్యనారాయణ,ఆర్ఎస్ఎస్ నాయకుడు బి.వి.బి.ఎల్. నారాయణతో పాటు బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



తుని, ఆగస్టు 15,( ప్రభాతవార్త ) తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆసుపత్రిలో ఉత్తమ సేవలు అందించిన వైద్య సిబ్బందికి డాక్టర్స్ తో కలిసి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చోడిశెట్టి త్రిమూర్తి స్వామి ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా త్రిమూర్తి స్వామి మాట్లాడుతూ తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య కృషితో100 పడకలు గల తుని ఏరియా ఆసుపత్రి 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందుతున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగమణి, ఆర్ఎం సత్యనారాయణ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తట్టపర్తి రాజా, కదంబర రామకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూనవరంలో ఘనంగా 80 స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు

### వాడవాడల పతాకావిష్కరణలు





కూనవరం, ఆగస్టు 15, ప్రభాతవార్త : 80 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కూనవరం మండలంలో ఘనంగా జరిగాయి. అన్ని ప్రభుత్వ సచివాలయాల నందు, ప్రభుత్వ కార్యాలయాల నందు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నందు, వివిధ కూడళ్ళ నందు, గ్రామ గ్రామాన పతాకావిష్కరణలు జరిగాయి. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ ధర్మేంద్ర, మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ పాయం రంగమ్మ, స్థానిక పంచాయతీ నందు డిప్యూటీ ఎంపిడిఓ జగన్నాథరావు, సిపిఎం కార్యాలయం నందు మండల పార్టీ కార్యదర్శి బాబు బొర్రియ్య, ఎంఈఓ కార్యాలయం నందు ఈవో లక్ష్మయ్య, మాంటిస్సోరి విద్యా సంస్థ నందు ప్రిన్సిపాల్ విక్కీ సింగ్, ఉన్నత పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు బిచ్చుడి అప్పారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు రామచంద్ర మూర్తి, విజయ సాధన పబ్లిక్ స్కూల్ నందు ప్రిన్సిపాల్ రజని, అంబేద్కర్ విగ్రహం నందు వెంకన్నలు పతాకావిష్కరణలు చేశారు.

**పలువురు అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు..**

80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులకు పోలవరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. మండల తహసిల్దార్ ధర్మేంద్ర, మండల డిప్యూటీ ఎంపీడీఓ జగన్నాధరావు, జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, చూచి రేవుల గూడెం స్వర్ణ గ్రామం వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, కోతులగుట్ట సి హెచ్ సి నుండి ఆరోగ్య మిత్ర సర్వేశ్వరరావు లు ఈ అవార్డులు అందుకున్నారు.

## దేశభక్తి ఉప్పొంగింది.. గోపాలపురం మువ్వన్నెలమయం



గోపాలపురం, ఆగస్టు 15 (ప్రభాతవార్త): గోపాలపురంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జడ్పీ హై స్కూల్, డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పాల్గొని మువ్వన్నెల త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం 300 అడుగుల భారీ జాతీయ పతాకంతో విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో ఆర్అండ్ఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీటి ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జీ.మహాలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజాసేవలో అధికారులు అంకితభావంతో పనిచేయాలని తహశీల్దార్ సూచించారు. డీటీ సాంబశివరావు, ఆర్ఐ విన్ బాబు, సీనియర్ సహాయకులు నల్లరాజు, ఏఎస్ఓ జోడాల వెంకట్ పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజ్ మనోహర్ అధ్యక్షతన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. అధికారులు, సిబ్బంది పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## జాతీయ జెండా ఆవిష్కరించిన బిజెపి నేత రంబాల



కాకినాడ రూరల్, ఆగస్ట్ 15 (ప్రభాతవార్త): కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట మార్కెట్ వద్ద 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ మాజీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు త్యాగఫలం నేడు మనం అనుభవిస్తున్నామని, ప్రతి ఒక్కరూ దేశ ప్రగతి కోరుతూ ఐకమత్యంతో ఉండాలని ఆలోచనతో తమ తమ ఇళ్లపై జెండాలు కట్టి దేశభక్తిని చాటుతున్నారనన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశం కోసం అహర్నిశలు కృషి చేస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేసే కొన్ని విదేశీ శక్తులను అణచివేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం లో మూడు పార్టీలు సమన్వయంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో ముందుకు తీసుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ మాజీ కన్వీనర్ పితాని లీలావతి, కిసాన్ మోర్చా నాయకులు పోలిశెట్టి వెంకట రామకృష్ణ ,పెండెం సత్యనారాయణ, పోలిశెట్టి శ్రీను, గంగుముళ్ళ నాగేశ్వరరావు, నందిపాటి రాంబాబు, సత్తిబాబు ,ప్రగడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## యానాంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



యానాం ఆగస్టు 15: (ప్రభాతవార్త) యానాంలోని జీవీఎంసీ బాలయోగి క్రీడా ప్రాంగణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి మల్లాడి కృష్ణారావు హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వివిధ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. యానాం ప్రాంతీయ పరిపాలన అధికారి శివరాజ్ మీనా, ఎస్పీ వరదరాజులతో కలిసి మంత్రి శాంతి కపోతాలను, త్రివర్ణ బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. యానాం నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర, పుదుచ్చేరి ప్రభుత్వాల సహకారంతో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వేడుకల్లో వివిధ దళాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన కవాతు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులకు మంత్రి మల్లాడి కృష్ణారావు బహుమతులు అందజేసి అభినందించారు కార్యక్రమంలో స్థానిక నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, విద్యార్థినీ



విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యానాం వ్యాప్తంగా జాతీయ పతాకాలు, త్రివర్ణ అలంకరణలతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి వాతావరణంలో ఘనంగా జరిగాయి

## వీబీజీ రామ్ జీ సిబ్బంది కి జిల్లాస్థాయి అవార్డు



గండేపల్లి. ఆగస్టు 15. ప్రభాతవార్త 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వీబీజీ రామ్‌జీ పథకం అమలులో గండేపల్లి మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా శనివారం జిల్లా స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం మధుసూదన్, ఏపీ డీఎం భాను ప్రకాష్ ల చేతుల మీదుగా గండేపల్లి మండల బృందం జిల్లా స్థాయి అవార్డును అందుకుంది. ఎంపీడీవో కె హరికృష్ణ సత్యారెడ్డి ఆధ్వర్యంలో మండల బృందం పథకం అమలులో సమర్థవంతంగా పనిచేసినందుకు ఈ గుర్తింపు లభించింది. అవార్డు అందుకున్న సందర్భంగా మండల అధికారులు,సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఎం రామకృష్ణంరాజు, సాంకేతిక అసిస్టెంట్లు శ్రీను, శ్రీనుబాబు,కంప్యూటర్ ఆపరేటర్ పద్మరాజు,ఫీల్డ్ అసిస్టెంట్ జి నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

## తుని గర్ల్స్ హైస్కూల్లో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

### జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే యనమల దివ్య





తుని, ఆగస్టు 15,( ప్రభాతవార్త ) తుని పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ లో స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యనమల దివ్య హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో స్వాతంత్ర సమరయోధుల త్యాగఫలమే మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ స్వాతంత్రం అని అన్నారు. భారతదేశ స్వాతంత్రం కోసం వారు అందించిన సేవలు చిరస్మరణీయమైనవి అన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలలో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అందరిని అలరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు, కూటమి నేతలు యనమల రాజేష్, ఇనుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్ , మళ్ళ గణేష్, లంక సునీల్, కుక్కడపు బాలాజీ, కారుమూరి భద్ర రావు,సిద్ధాంతపు సత్తిబాబు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ చందక గురుమూర్తి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



కాకినాడ రూరల్ ,ఆగస్ట్15 (ప్రభాతవార్త): కాకినాడ రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి విచ్చేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు మెమొంటోలు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి పసుపులేటి సతీష్, ఉపాధి హామీ ఎపిఓ మారిశెట్టి గణేష్, ఇంజనీరింగ్ ఏఈ గోవింద్ కృష్ణ, సూపరిండెంట్ గుత్తుల భీమశంకరం కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్రోద్యమ స్ఫూర్తి యువతకు ఆదర్శం

### కావాలి : ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, ఆగస్టు 15, (ప్రభాతవార్త) రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి నిలిచిన ఎందరో త్యాగధనుల మహనీయుల పోరాటంతో మన దేశం స్వాతంత్రాన్ని సాధించిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా వాడపాలెం పంచాయతీ కార్యాలయం హై స్కూల్ కొత్తపేట పంచాయతీ కొత్తపేట కాపు కళ్యాణమండపం వద్ద ఆయన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు ప్రజలందరికీ స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు మనం పీలుస్తున్న స్వేచ్ఛా వాయువులు లక్షలాదిమంది దేశభక్తుల ప్రాణత్యాగానికి ప్రతీకలని అనునిత్యం గుర్తు చేసుకోవాలన్నారు నాటి స్వాతంత్ర స్ఫూర్తి నేటి యువతలో ప్రతిబింబించినప్పుడే దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందన్నారు కొత్తపేట కార్నేషన్ సత్రం శ్రీనివాస్ పేట ఎంపీపీ స్కూల్లో ఎ ఎం సి ఉపాధ్యక్షులు కంఠం శెట్టి శ్రీనివాసరావు జెండా ఆవిష్కరణ చేశారు కార్యక్రమాల్లో అధికారులు పార్టీ నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరు దేశ సేవకు ముందు ఉండాలి

### ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు



శంఖవరం ఆగస్టు 15 ప్రభాతవార్త ప్రతి ఒక్కరూ దేశ సేవకు ముందుండాలని ఆంధ్ర శబరిమలై చైర్మన్ కూసుమంచి సత్య శ్రీనివాసరావు పేర్కొన్నారు. శంకవరం మండలం సిద్ది పుణ్యక్షేత్రంలో కొలువైన ఆంధ్ర శబరిమలై అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు జాతీయ జెండాను ఎగురవేశారు. జెండా వందన అనంతరం "జన గణ మన" గీతాలాపనతో పరిసర ప్రాంతాలన్నీ దేశభక్తి నినాదాలతో మార్మోగాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ ఆలయంలో ప్రత్యేక అయ్యప్ప పూజలు నిర్వహించారు. దేశ సైనికుల క్షేమం కోసం ప్రార్థనలు చేశారు. "దేశభక్తి, ఆధ్యాత్మికత రెండూ కలిసిన పుణ్యక్షేత్రంగా ఆంధ్ర శబరిమల నిలుస్తోందని, ప్రతి భారతీయుడు దేశభక్తి కలిగి ఉండాలని పేర్కొన్నారు అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు

## స్వాతంత్ర్య సమరయోధుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి : ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం సిటీ ,ఆగస్టు 15 (ప్రభాతవార్త) స్థానిక బిజెపి జిల్లా కార్యాలయం వద్ద ఆ పార్టీ అధ్యక్షుడు పిక్కి నరేంద్ర ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఎమ్మెల్సీ సోము వీర్రాజు తో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. తొలిత వందేమాతరం గీతము ఆలపించారు. అనంతరం పురందేశ్వరి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు పునరాంకితం అవుదామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ బొమ్మల దత్తు నర్సపల్లి హారిక కె సతీష్ పిల్లి మురళీకృష్ణ రేలంగి శ్రీదేవి అడబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విశిష్ట సేవలకు కోట గ్రామానికి చెందిన ఐదుగురు అధికారులకు అవార్డులు



రంపచోడవరం, ఆగస్టు 15: ప్రభాతవార్త. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో విశిష్ట సేవలు అందించిన కోట గ్రామానికి చెందిన ఐదుగురు అధికారులు జిల్లా స్థాయిలో అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. రంపచోడవరంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్, పోలవరం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే తదితర ప్రముఖుల చేతుల మీదుగా అధికారులు పురస్కారాలు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో రంపచోడవరం వ్యవసాయ అధికారి కె. లక్ష్మణరావు, నీతి ఆయోగ్ ఆకాంక్షిత మండలాల కార్యక్రమంలో వై.రామవరం, గుర్తేడు, మారేడుమిల్లి మండలాలకు సంబంధించిన ఏబీఎఫ్ కారుకోడి లవన్ రెడ్డి, పోలవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి అధికారి, పీఎంయూ విభాగంలో పనిచేస్తున్న జి. దినేష్ కుమార్, ముసురుమిల్లి గ్రామ ఉద్యానశాఖ అధికారిణి జి. సౌజన్య, రంపచోడవరం మహిళా పోలీస్, సీవీఏపీ విభాగంలో పనిచేస్తున్న జి. లావణ్య ఉన్నారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు అధికారులు తమ తమ శాఖల్లో అందించిన సేవలకు జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల కోట గ్రామ ప్రజలు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారాలు గ్రామానికి గర్వకారణంగా నిలిచాయని పేర్కొన్నారు.

## తరంగిణి కి జిల్లా ఉత్తమ పురస్కారం



గండేపల్లి. ఆగస్టు 15. ప్రభాతవార్త గండేపల్లి మండలం జెడ్ రాగంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్న అమలదాసు తరంగిణి జిల్లా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. కాకినాడలో జరిగిన భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా ఈ అవార్డు ఆమె అందుకున్నారు. గ్రామ పంచాయతీలో సేవలు అందిస్తూ, శానిటేషన్, నూరు శాతం పన్నులు వసూళ్ళు, ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. జెడ్ రాగంపేట గ్రామంలో ప్రజల మన్ననలు పొందారు. జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ లు ఆమె కు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మండలంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు అవార్డు అందుకున్న తరంగిణి కి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వికాస్ విద్యాసంస్థల్లో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



రామచంద్రపురం,ఆగస్టు 15 (ప్రభాతవార్త): స్థానిక వికాస్ విద్యాసంస్థల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ వాసంశెట్టి వెంకటరమణ,ప్రిన్సిపల్ దుర్గాలక్ష్మీబాయి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ.. ఎంతోమంది త్యాగమూర్తుల పోరాట ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగి దేశ సేవలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపల్ దుర్గాలక్ష్మీబాయి సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## యానాంలో ఘనంగా జెండా ఆవిష్కరణ



యానాం, ఆగస్టు 15: (ప్రభాతవార్త) స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని యానాం లోని చిన్న సెంటర్‌లో మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జాతీయ జెండాకు వందనం చేసి దేశభక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు తెలిపారు.

## 10 వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని కి సత్కారం



ముమ్మిడివరం, ఆగస్టు 15 (ప్రభాత వార్త ) మండల పరిధిలోని కొత్తలంక గ్రామంలో 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా, 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని గుబ్బల నాగ సత్యశ్రీని ఘనంగా సత్కరించారు. గొర్రెల శ్రీనివాసు (వాసు) తమ స్వర్గీయ తండ్రి గొర్రెల సత్యనారాయణమూర్తి (బాబ్జీ) జ్ఞాపకార్థం విద్యార్థినికి రూ. 10,000/- నగదు బహుమతిని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జయను లక్ష్మణ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడబాల కాశీ విశ్వేశ్వర రావు, ఉపాధ్యాయులు కాశీ బాబాయ్, మెండి శ్రీనివాసరావు, కె సుజాత గంగుల సురేష్, పెద్దిరాజు, సోమరాజు, గోవర్ధనగిరి, లక్ష్మీ బాయి, వల్లి లతో పాటు పలువురు నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## గోదావరి మధ్యలో పడవలో పేకాట...

### అయిదుగురు అరెస్టు



వి.ఆర్.పురం,ఆగస్టు15,ప్రభాతవార్త మండల పరిధిలోని వడ్డిగూడెం గ్రామం వద్ద గోదావరి మధ్యలో పడవలో పేకాట స్థావరం పై పోలీసులు శనివారం మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో 5.మందిని అదుపులోకి తీసుకోగా, వారి వద్ద నుండి రూ.27,800 నగదు స్వాధీనం చేసుకున్నామని, మరో 5 మంది వ్యక్తులు గోదావరి నదిలో దూకి, ఈదుకుంటు పారిపోయారని ఎస్.ఐ షేక్.సాదిక్ ప్రభాతవార్తకు తెలిపారు. గోదావరినదిలో పడవలో పేకాట ఆడుతున్నట్లు తమకు పక్కా సమాచారం అందటంతో చాక చక్యంగా దాడి చేసి,5 గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఎస్.ఐ తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ సాదిక్, ఎ.ఎస్.ఐ.రాజేష్, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్ ఐ.రాజు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

## సేవా తత్పరుడు'నల్లం'కు ఉత్తమ ప్రతిభా పురస్కారం....

### జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్, మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా అవార్డు అందుకున్న 'నల్లం '



,ఆత్రేయపురం, ఆగస్టు 15,(ప్రభాత వార్త) కార్యసాధకులు, పరిపాలన సమర్థులు, దేవదాయ ధర్మదాయ శాఖలో విభిన్నమైన అధికారిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించి విశేష అనుభవంతో చక్కటి ప్రణాళికతో వాడపల్లి దేవస్థానమును అభివృద్ధి పథంలో పయనింపచేస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తీసుకుంటున్న చర్యలకు నేడు 80 వ స్వాతంత్ర దినోత్సవము సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టర్ కార్యాలయం నందు శనివారం జరిగిన స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు వాసంశెట్టి సుభాష్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిడియా దేవి చేతుల మీదుగా ఉత్తమ సేవలకు అత్యుత్తమ ప్రతిభా పురస్కారం, ప్రశంసా పత్రం అందుకున్న వాడపల్లి దేవస్థానం ఉప కమిషనర్ కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్యచక్రధరరావుకు అరుదైన గౌరవం. దినదిన ప్రవర్ధమాన మవుతూ ఇల వైకుంఠపురం గా విరాజిల్లుతున్న వాడపల్లి క్షేత్ర వైభవమును సమున్నత శిఖరాలకు చేర్చి విధి నిర్వహణ అనే పదానికి ప్రతిరూపంగా నిలిచిన నల్లం సూర్య చక్రధరరావు భవిష్యత్తులో మరెన్నో అవార్డులు అందుకోవాలని.. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు,ముళ్ళపూడి భాస్కరరావు, తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, జుజ్జువరపు హరిబాబు, తోట రజిని, ఏపుగంటి వెంకటేష్, ఆలయ సిబ్బంది, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రామభద్రరాజు, నాగిరెడ్డి సత్యనారాయణలు ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు



# గాంధీజీ ఆశయాలను నేటి తరం కొనసాగించాలి..: ఎమ్మెల్యే బండారు...



ఆత్రేయపురం, ఆగస్టు,16,(ప్రభాత వార్త) గాంధీజీ చెప్పిన మాటలు నేటికీ ఆదరణీయమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొనియాడారు. మండల పరిధిలో ఉచ్చిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెల్లా అనిల్ తండ్రి వెల్లా సూర్యనారాయణ జ్ఞాపకార్థంగా నూతనంగా ఏర్పాటుచేసిన మహాత్మా గాంధీజీ విగ్రహావిష్కరణ చేసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జాతిపిత పూజ్య బాపూజీ విగ్రహావిష్కరణ చేయడం 80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా తనకు కలిగిన అదృష్టంగా ఎమ్మెల్యే బండారు అభివర్ణించారు. 2026 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో చక్కటి ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను సత్కరించి వారికి నగదు పురస్కారాలు అందజేశారు. కొత్తపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్, తెలుగు యువత అధ్యక్షులు,వెల్లా అనిల్ కుమార్ ఈ కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 558 మార్కులు సాధించిన కొల్లి బాబీకి రూ.10వేలు, 554 మార్కులు సాధించిన కె పృథ్వీ దుర్గ సూర్య తేజకు రూ.5వేలు, 528 మార్కులు సాధించిన మేకా వంశీ సాయి ప్రియాంకకు రూ.5వేలు, 521 మార్కులు సాధించిన అయినవిల్లి శ్రీదేవి కి రూ. 2వేలు, 504 మార్కులు సాధించిన మట్ట మౌనికకు రూ.2వేలు, 500 మార్కులు సాధించిన మట్ట జ్ఞానేశ్వరి ఐశ్వర్య దేవికి రూ.2వేలు అందజేశారు. అలాగే వారందరికి కాలేజ్ బ్యాగ్, అవసరమైన విద్యా పరికరాలను అందజేశారు. విద్యార్థుల స్పోర్ట్స్ యూనిఫామ్ కోసం ఎమ్మెల్యే బండారు రూ.10 వేలు అందజేశారు. అలాగే అంకంపాలెం లో కె.వి.ఆర్ జిల్లా పరిషత్ హైస్కూలు లో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పదవతరగతి మొదటి స్థానం లో నిలిచిన 579 మార్కులు సాధించిన మోటూరి లక్ష్మి దుర్గా భవాని కి లాప్ టాప్, హెడ్ ఫోన్స్, రెండవ స్థానం సాధించిన 568 సాధించిన పిల్లి జితేంద్ర కి 7500/-, మూడవ స్థానంలో 560 మార్కులు సాధించిన యడ్ల కనకదుర్గ కి 7500/- బాపనమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు చేతుల మీదుగా అందజేశారు. రాష్ట్ర అభివృద్ధి, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. శనివారం మండలంలోని ఉచ్చిలిలో రెండేళ్ళ కూటమి ప్రభుత్వం నమ్మకం, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 35 లక్షలతో ధవళేశ్వరం బ్యారేజ్ పై రోడ్డు నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, బళ్ళువరపు హరిబాబు, మద్దూరు సుబ్బారావు, కాయల జగన్నాథం, మెర్ల లక్ష్మీపతి, తోట రజిని, సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి సత్యనారాయణ, తోటకూర సుబ్బరాజు, దండు సీతారామరాజు, బైర్రాజు బంగార్రాజు, చిటికెన సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు కుటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగఫలం మన స్వాతంత్ర్యం.

**జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో జ్యోతుల నెహ్రూ సతీమణి జ్యోతుల మణమ్మ.**



జగ్గంపేట ఆగస్టు 15(ప్రభాతవార్త) రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి నిలిచిన ఎందరో త్యాగధనుల, మహనీయుల పోరాటంతో మన దేశం స్వాతంత్ర్యాన్ని సాధించిందని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ సతీమణి జగ్గంపేట కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ జ్యోతుల మణమ్మ వ్యాఖ్యానించారు. 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఇర్రిపాక పంచాయతీ కార్యాలయం, హై స్కూల్ వద్ద ఆమె త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం సమర్పించారు. ప్రజలందరికి స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మనం పీలుస్తున్న స్వేచ్ఛా వాయువులు లక్షలాదిమంది దేశభక్తుల ప్రాణత్యాగానికి ప్రతీక అని అనునిత్యం గుర్తు చేసుకోవాలన్నారు. నాటి స్వాతంత్ర స్ఫూర్తి నేటి యువతలో ప్రతిబింబించినప్పుడే దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. స్వతంత్ర దినోత్సవ సందర్భంగా వివిధ క్రీడల్లో విజేతలైన వారిని అభినందించి బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బస్వా చినబాబు, పంతం సత్యనారాయణ, జ్యోతుల ఈశ్వరరావు, జ్యోతుల సత్యమూర్తి, కే సినీడ్ అప్పారావు, కోనేటి వెంకటేశ్వరరావు, కొండ్రపు సూరిబాబు పాల్గొన్నారు.

## నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 15, (ప్రభాతవార్త) నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథి విశ్వేశ్వర్ రెడ్డి విద్యార్థులకు పుస్తకాలు, బిస్కెట్లు, చాక్లెట్లు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. మురళీధర్ మాట్లాడుతూ సమరయోధుల త్యాగాల ఫలితంగానే స్వాతంత్ర్యం లభించిందన్నారు. దేశ సమైక్యత, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం క్వారీ మార్కెట్ సుబ్బారావుపేటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపిన రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్





రాజమహేంద్రి అర్బన్, ఆగస్టు 15: (ప్రభాతవార్త) రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, అప్పస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి. రామచంద్రారెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు దేశభక్తిని జీవితంలో భాగం చేసుకోవాలని, విద్య కేవలం మార్కులు, ర్యాంకులకే కాకుండా బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి ఉపయోగపడాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ తేతలి స్వరూప్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం మహనీయుల త్యాగఫలమని, దాని విలువలను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ప్రిన్సిపాల్ టీవీడీ చంద్రశేఖర్ దేశభక్తి అంటే ప్రతి పౌరుడు తన కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించడమేనన్నారు. విద్యార్థుల దేశభక్తి గీతాలు, నృత్యాలు, పిరమిడ్లు, తారీ డ్రిల్ ఆకట్టుకున్నాయి. సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జె.బి.పి అధ్వర్యంలో ఘనంగా స్వాతంత్ర దినోత్సవం వేడుకలు



కాకినాడ రూరల్, ఆగస్టు15 (ప్రభాతవార్త): జై భీమ్ రావ్ భారత్ పార్టీ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రముఖ న్యాయవాది జగ్గారపు మల్లికార్జున ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం కోసం వారు చేసిన త్యాగాలు మరువలేనివని, ముఖ్యంగా యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలోని యువత బాగా చదువుకోవడం ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలో రాష్ట్రాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. దళితులకు ఇవ్వాల్సిన పథకాలను పునరుద్ధరించాలని విజయవాడలో జేబీపీ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెబిపి పార్టీ నాయకులు, న్యాయవాదులు మరియు వివిధ సంఘాల నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన ఇద్దరు పి. హెచ్. ఎన్ లకు ఘన సన్మానం



రాజవొమ్మంగి, ఆగస్టు 15, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం జడ్డంగి ప్రభుత్వఆసుపత్రి పరిధిలో హెచ్. వి లు గా విధులను నిర్వహిస్తూ పి. హెచ్. ఎన్ లు గా పదోన్నతి పొందిన నీలాద్రి లక్ష్మి, భూమయ వెంకటరమణలను శనివారం జడ్డంగి పి. హెచ్. సి.వద్ద డా. నాగార్జున, డా. పావని ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సన్మాన కార్యక్రమం హెల్త్ అసిస్టెంట్ కంచెం శ్యామ్యూల్ అధ్యక్షతన జరిగింది. పి. హెచ్. ఎన్ లు ఇద్దరికి పూలమాలలు వేసి శాలువాలను కప్పి సత్కారం చేశారు. పి. హెచ్. ఎన్. లు ఇద్దరూ ఇదే మండల వాసులు కావడంతో బాటు వారి సేవలు ప్రశంసనీయమని డా. పావని, డా. నాగార్జున లు అన్నారు. ఇప్పటివరకూ కుటుంబ సభ్యులు కలిసి మెలిసి ప్రజలకు సేవలను అందించారని సిబ్బంది సన్మాన గ్రహీతలు లక్ష్మి, వెంకటరమణలు అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిహెచ్. ఇ. ఓ గౌడురు నాగేశ్వరరావు, శ్యామ్యూల్, సుకుమార్, పద్మరాజు, రామలక్ష్మి, శ్రీనివాస్, రాజుబాబు, ఎం. ఎల్. హెచ్. పి లు మురళి, లీలావతి, మల్లేశ్వరి, రామలక్ష్మి, లక్ష్మి, మంగాదాసు, స్టాఫ్ నర్స్ లు నాగమణి, లక్ష్మి, భవాని, కుమారి, రమ్య, ఏ. ఎన్. యం. లు శేషారత్నం, నూకరత్నం, శిరీష, సత్యవేణి, ఏ. 104 డి. ఇ. ఓ. శ్రీనివాస్, పైలెట్ శివశంకరాజు, ఫీడర్ సిబ్బంది, 36 మంది ఆశ వర్కర్స్ పాల్గొన్నారు. పి. హెచ్. సి వద్ద జాతీయ జెండాను డా. నాగార్జున, డా. పావని ఎగురవేశారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



సీతానగరం, ఆగస్టు 15, (ప్రభాతవార్త): మండల వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్వో శ్రీనివాస్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ఎల్.శ్రీను నాయక్ జాతీయ జెండాను ఎగురవేశారు. పురుషోత్తపట్నంలో పాఠశాల మహిళా మండలి ప్రాంగణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఎగురవేశారు.

## గంగవరం మండలంలో ఘనంగా 80 వ స్వాతంత్ర దినోత్సవం



కె గంగవరం,ఆగస్టు 15, (ప్రభాతవార్త): కె గంగవరం మండలం లోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో కార్యాలయాలలో జెండా పండుగ 80 వ స్వాతంత్ర దినోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలం లోని పోలీస్ స్టేషన్, ఎమ్మార్వో ,ఎండిఓ, పంచాయతీ లు, కరెంట్ ఆఫీస్, సొసైటీ లు అన్ని మండల స్థాయి, గ్రామస్థాయి కార్యాలయాల్లో ఆయా అధికారులు ఎస్సై జి సోమేంద్ర, జగదీష్,శ్రీనివాస్, పంపన నాగమణి సుబ్బారావు, సత్తిబాబు,మల్లేశ్వరరావు, సిరంగి శ్రీధర్,నాగరాజు, అంజనేయులు, భాస్కర్ రావు వెంకటేశ్వరరావు, మూర్తి, సుబ్రమణ్యం, తాడాల జానకి రామ్ (రాజా), తాడాల లోవరాజు, సైసాట్ ఆఫీసర్లు తదితరులు జెండా ఎగురవేసి 80 వ స్వాతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గంగవరం గ్రామం మెయిన్ రోడ్డు ,పాఠశాలలో పేరాబత్తుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి, మిఠాయిలు కలములు చాక్లెట్లు పెన్సిల్ స్కేల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రెండు దశాబ్దాల తరువాత వి.ఆర్.పురంలో పోలీస్ విధులు పునఃప్రారంభం



వి.ఆర్.పురం,ఆగస్టు15,ప్రభాతవార్త మావోయిస్టుల కదలికలు నేపథ్యంలో సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం వి.ఆర్.పురం మండలంలో నిలిపివేసిన పోలీస్ విధులు శనివారం 80.వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని, నూతన భవనంలో పునఃప్రారంభమయ్యాయి. 2022 కాలంలో ఎస్ఈ యూనిట్ మియా హయాంలో వి.ఆర్.పురం పోలీస్ స్టేషన్ భవనం మండలస్థాయి కూనవరం పోలీస్ స్టేషన్ కు తరలించారు. అప్పటి నుండి ఇటీవల వరకు ఇక్కడి పోలీస్ స్టేషన్ కూనవరం పోలీస్ స్టేషన్ భవనంలో, వి.ఆర్.పురం పోలీస్ స్టేషన్ కొనసాగిన విషయం పాఠకులకు విదితమే. ఆతరువాత దేశ వ్యాప్తంగా మావోయిస్టుల ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోవటంతో, వి.ఆర్.పురం మండలానికి ఆధునిక పోలీస్ స్టేషన్ భవనం మంజూరై పూర్తయింది. దీంతో జిల్లా పోలీస్ అధికారుల ఆదేశాల మేరకు, ఎస్.ఐ షేక్.సాదిక్ పంద్రా ఆగస్టు సందర్భంగా, తన సిబ్బందితో వి.ఆర్.పురం పోలీస్ విధులను నూతన భవనంలో పునఃప్రారంభించారు. దీంతో మండల ప్రజలకు రెండు దశాబ్దాల తరువాత పోలీస్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లయింది.

## శ్రీ ప్రజ్ఞ విద్యా సంస్థలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు,

**పతాకావిష్కరణ గావించిన జీను మణిబాబు:**



జగ్గంపేట, ఆగస్టు 15 (ప్రభాతవార్త ) భారత 80 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జగ్గంపేట శ్రీ ప్రజ్ఞ పాఠశాల లో చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో భారత స్వతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల టీడీపీ అధ్యక్షులు, జె వి ఆర్ (గ్రూప్) అధినేత జీను మణిబాబు పాల్గొని పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ స్వతంత్ర ఉద్యమంలో అసువులు బాసిన స్వతంత్ర సమర యోధులను గురించి తెలియజేశారు.విద్యార్థులు దేశ చరిత్రను,స్వాతంత్ర్య పోరాటం లో ప్రాణాలు కోల్పోయిన మహనీయుల జీవిత చరిత్ర ను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు, యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ విద్యతో ఉన్నత స్థాయికి వెళ్ళాలని,దేశభక్తిని అలవర్చుకోవాలని కోరారు. అనంతరం ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జీను మణిబాబు బహుమతులు అందజేశారు. స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ తుమ్మల శ్వేత,ఎలిశెట్టి బుజ్జి, ప్రిన్సిపాల్ కె అభి, ఇంచార్జ్ కొల్లా శ్రీనివాస్, పులిగ పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# పేదలకు అండగా సీఎం సహాయనిధి

**17 మంది బాధిత కుటుంబాలకు రూ.13.44 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



రాజవొమ్మంగి, ఆగస్టు 15, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ గ్రామంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం రాజవొమ్మంగి మండల పార్టీ అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కూనవరం, రంపచోడవరం, వై. రామవరం, గంగవరం, దేవీపట్నం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 13,44,471లు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు సీఎం సహాయనిధి ఆపదలో అండగా నిలుస్తోందన్నారు. వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి త్వరగా సహాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు చెప్పారు. చెక్కులు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ. పి. ఐ. ఐ. సి డైరెక్టర్, మండల పార్టీ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన కేశవ్, ముప్పన సావిత్రి, పల్లాల వెంకటరెడ్డి, కనిగిరి సుబ్బారావు, గోళ్ళ చంటి బాబు, కీర్తి గంగాధర్, కుటుంబరెడ్డి, చీడిపల్లి అప్పారావు పాల్గొన్నారు.

## పార్లమెంట్ లో సావార్కర్ చిత్ర పఠాన్ని తొలగించాలి



రాజమహేంద్రవరం అర్బన్; ఆగస్టు 15,(ప్రభాతవార్త) ఆర్టీసీ కార్యాలయంలో ఘనంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని అఖండ భారతీయులు తెలుసుకోవాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ కోరారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి ఈ తరానికి , బావి తరాలకు ఒక గొప్ప కీర్తగా ఉండాలన్నారు . సావార్కర్ చరిత్రను పూర్తిగా రద్దు చేసి పార్లమెంట్ లో సావార్కర్ చిత్ర పఠాన్ని తొలగించాలని ఆయన కోరారు . ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కార్యక్రమంలో అర్పిసి సెక్యులర్స్ సర్వశ్రీ పెండ్యాల కామరాజు, సిమ్మా దుర్గారావు , కాసా రాజు , డి వి రమణమూర్తి , ఎండి హుస్సేన్, లంక దుర్గాప్రసాద్ , బర్ల ప్రసాద్ , దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, ఆర్. కే చెట్టి , కారుమూరి శిరీషా , గుడ్ల సాయి దుర్గాప్రసాద్ , బసా సోనియా , కొల్లి సత్యనారాయణ , పాంఢ్రంకి ఈశ్వర్ , మట్టా శ్రీనివాస రావు , చల్లా సాంబశివరావు, కందివలస రమణ, ఎస్ కే దేవి , ఇళ్ల రాము, మోర్త ప్రభాకర్ , ఎస్ కే బాజన్, దోషి నిషాంత్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనియున్నారు ..

## శ్రీ లక్ష్మీ నృసింహుని ఆలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం....







సఖినేటిపల్లి ఆగస్టు 15, ప్రభాత వార్త: డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామములో వేంచేసియున్న నవనారసింహ క్షేత్రాలలో ప్రముఖమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం నందు స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని, స్వాతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించినారు. ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఏం కే టి ఎన్ వి ప్రసాద్, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఆవిష్కరణ జెండా వందనను నిర్వహించారు. స్థానిక పాఠశాల విద్యార్థులతో దేశ భక్తి గీతాలు ఆలపించి వారికి దేవస్థానం తరపున పుస్తకాలు, పెన్నులు, ప్రసాదములు అందించినారు. ఈ కార్యక్రమములో ఎంపీటీసీ బైరా నాగరాజు, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సముద్రంలో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం



యు.కొత్తపల్లి, ఆగస్టు 15 (ప్రభాతవార్త) : ఉప్పాడ తీర ప్రాంత మత్స్యకారుల చిరకాల కోరిక నెరవేరే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన నేపథ్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం శాసనసభ్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ చిత్రపటానికి శనివారం మత్స్యకారులు అమీనాబాదు హార్బర్ వద్ద సముద్రంలో పాలాభిషేకం నిర్వహించారు. అమీనాబాదు నుంచి నేమాం వరకు తీరప్రాంత రక్షణకు కోతను అరికట్టేందుకు రూ.323 కోట్ల అంచనా వ్యయంతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు ప్రారంభమైన సందర్భంగా క్షీరాభిషేకం నిర్వహించారు. కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ శ్రీ తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో మత్స్యకారులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సముద్ర కోత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న తీర ప్రాంత మత్స్య కారులు, ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రక్షణ గోడ నిర్మాణానికి ప్రభుత్వం ముందడుగు వేయడం ఎంతో సంతోషకరమన్నారు. తుమ్మల రామస్వామి మాట్లాడుతూ రూ.323 కోట్లతో చేపట్టనున్న తీర రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక తయారీ బాధ్యతలను ఐఐటీ మద్రాస్‌కు అప్పగించినట్లు తెలిపారు. నవంబర్ నెలలో రక్షణ గోడ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు రావు అక్షయ్, గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, రాష్ట్ర ఆక్వా డైరెక్టర్ వంకా కొండబాబు, ఉప్పాడ జనసేన పార్టీ గ్రామ ఇన్‌చార్జ్ గంట విజయ్ కుమార్, అమీనాబాద్ గ్రామ ఇన్‌చార్జ్ పిరమళ్ల వీరేష్, మూలపేట గ్రామ ఇన్‌చార్జ్ రామిశెట్టి రాంబాబు, పొన్నాడ పంచాయతీ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పల్లేటి బాపన్న దొర, మత్స్యకార వికాస విభాగం ఉపాధ్యక్షుడు మైలపల్లి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉమ్మిడి ఆమలేశ్వరి పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఇక్కట్లు తప్పేదెన్నడో..!



కాట్రేనికోన, ఆగస్టు 15 (ప్రభాతవార్త) కాట్రేనికోన మండల కేంద్రం గేటు సెంటర్లో ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ప్రతిరోజు సాయంత్రం వేళ గేటు సెంటర్లో వాహనాల రద్దీతో ట్రాఫిక్ నెలకొంటుందన్నారు. మావుళ్ళమ్మ గుడి వద్ద నుంచి ఓల్డ్ అయినాపురం డ్రైన్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలపై అక్రమ కట్టడాలు పెరగడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. దాంతోపాటు ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ సిబ్బందిని ఎవరిని పూర్తిస్థాయిలో నియమించకపోవడంతో సాయంత్రం వేళ గేటు సెంటర్ లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. పల్లంకురు, కందికుప్ప తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్ కు వెళ్లే ప్రైవేట్ బస్సులు, అమలాపురం పరిసర ప్రాంతాల నుంచి వచ్చే పాఠశాల బస్సులు, వాటితో గేటు సెంటర్లో ఇతర వాహనరాల రద్దీ కారణంగా ఇబ్బంది ఏర్పడుతుంది. దాంతో వివిధ పనులు నిమిత్తం వచ్చే వారు, దుకాణాదారులకు ఇబ్బంది తప్పడం లేదు. రద్దీగా ఉండే సాయంత్రం సమయంలో ఇద్దరు పోలీస్ సిబ్బందిని నియమిస్తే బాగుంటుంది అని ప్రజలు కోరుతున్నారు. డ్రైనేజీ పై ఆక్రమణలు తొలగించి, పోలీస్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని కోరుతున్నారు.

## ఇంటి పన్ను బకాయి దారులకు-రాష్ట్రస్థాయి జంట పదవులు



రామచంద్రపురం,ఆగస్టు 15 (ప్రభాతవార్త): ఇంటి పన్ను బకాయి ఉంటే కనీసం వార్డు మెంబర్ కి కూడా పోటీ చేయడానికి అనర్హులు అంటూ చట్టాలు చెబుతున్నాయి.అయితే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రపురం నియోజకవర్గం లో ఒక విచిత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే రామచంద్రపురం మండలం ద్రాక్షారామంలో ఒక కుటుంబానికి చెందిన పెంకె అన్నపూర్ణ,పెంకె ప్రతిభా భారతిలకు తెలుగుదేశం పార్టీ తరఫున రాష్ట్ర స్థాయి జంట పదవులు లభించాయి.తీరా చూస్తే ఆ కుటుంబం గత ఐదు సంవత్సరాలుగా పంచాయతీకి ఇంటి పన్ను కూడా కట్టడం లేదు.సుమారు లక్ష రూపాయల వరకు వారు పంచాయతీకి ఇంటి పన్ను బకాయి పడ్డారు. అటువంటి కుటుంబంలో తల్లి కూతుర్లు ఇద్దరికీ రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు దక్కటం పట్ల నియోజకవర్గంలో ఇదేమి విచిత్రం అంటూ చర్చించుకుంటున్నారు.తెలుగుదేశం పార్టీ కోసం ఏళ్ల తరబడి ప్రాణం పెట్టి పనిచేసే ఎందరో నాయకులు, కార్యకర్తలు ఉండగా ఏరి కోరి ఇటువంటి వారికి పదవి ఇవ్వడం తెలుగుదేశం పార్టీ సీనియర్లను పార్టీ అవమానించినట్లుగానే పార్టీ శ్రేణులు భావిస్తున్నారు.

# పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ సేవలు ఆదర్శనీయం

**కాకినాడ జిల్లాకు నాయకర్ పేరు పెట్టాలి.**

**పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు.**



తాళ్ళరేవు, ఆగస్టు 15 (ప్రభాతవార్త): అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ సేవలు ఆదర్శనీయమని, ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం లక్ష్మణ స్వామి వర్మ జయంతిని అధికారకంగా నిర్వహించడానికి జీవో తీసుకువచ్చి రాష్ట్ర పండుగ గా జరపడం అభినందనీయమని పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు అన్నారు. తాళ్ళరేవు మండలం కోరంగి బొడ్డు సత్యనారాయణ కళ్యాణ మండపం ఆవరణలో ఏర్పాటుచేసిన పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ, మల్లాడి సత్య లింగం నాయకర్ విగ్రహాలకు శనివారం ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మల్లాడి మాట్లాడారు. విగ్రహాలు నిర్మించడానికి సహకరించిన అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం కార్యవర్గం, స్థలం దానం చేసిన బొడ్డు సత్యనారాయణ లను ఆయన అభినందించారు. అగ్నికుల క్షత్రియులతోపాటు మత్స్యకార వర్గంలో ఉన్న 13 ఉపకులాల విద్యార్థులకు పుదుచ్చేరి ప్రభుత్వం విద్యార్థులు ఏ రాష్ట్రంలో చదివిన ఫీజు రీయింబర్స్మెంట్ కల్పిస్తుందని అదేవిధంగా ఆంధ్ర ప్రదేశ్ లోనూ అమలు చేయాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. కాకినాడ జిల్లాకు నాయకర్ పేరు పెట్టాలి. పేద విద్యార్థుల కోసం సుమారు 1258 ఎకరాలు దానం చేసిన విద్యాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ పేరును కాకినాడ జిల్లాకు, మల్లాడి సత్యలింగ నాయకర్ కాకినాడ జిల్లా జిల్లాగా పేరు పెట్టాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా బొడ్డు చిన వెంకటాయపాలెం హైస్కూల్లో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బొడ్డు సత్యనారాయణ సమకూర్చిన నగదు పురస్కారాన్ని ఐదుగురు విద్యార్థులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ ఐక్య మహా సంఘం జిల్లా అధ్యక్షులు వైదాడి నూకరాజు, కార్యవర్గం, యానం అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు, జడ్పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, కోరంగి మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీ నరసింహ రాజు, బొడ్డు సత్యనారాయణ (చిన్ని), వాడ్రేవు వీరబాబు, పట్టా ఆదినారాయణ వర్మ, కొల్లు వీరబాబు, కొక్కిలిగడ్డ లోకేష్, పోతా బత్తుల నూకరాజు, కామాడి మాతరాజు, వైదాడి శ్రీనివాస్, కొపనాతి నాగరాజు, కొల్లు శ్రీను, రెడ్డి సతీష్, వినకోటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## తెలుగుదేశం పార్టీలోకి భారీగా చేరికలు

**మంత్రి సుభాష్ సమక్షంలో 150 మంది వైసీపీ కార్యకర్తల చేరిక**



కాజులూరు ఆగస్టు 15(ప్రభాత వార్త) రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో కాజులూరు మండలం ఆండ్రంగి గ్రామానికి చెందిన సుమారు 150 మంది వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని మంత్రి సుభాష్ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల విశ్వాసాన్ని చూరగొంటున్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలు, పారదర్శక పాలన, అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ప్రజలు స్వచ్ఛందంగా తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల టీడీపీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం, డీసీ పేపకాయల బాబ్జి, గ్రామ టీడీపీ అధ్యక్షులు రాజుబాబు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం, ఆగస్టు 15, (ప్రభాతవార్త) : మండలంలోని ఖాళీగా ఉన్న 6 స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించేందుకు విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంఈవో స్వామినాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాలలైన పురుషోత్తపట్నంలో హింది 1, రామచంద్రపురంలో బయోలాజికల్ సైన్స్ 1, రఘుదేవపురంలో బయోలాజికల్ సైన్స్ 1, వెదుళ్లపల్లిలో ఇంగ్లీష్ 1, మిర్తిపాడులో బయోలాజికల్ సైన్స్ 1, అలాగే సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోషల్ 1 పోస్టు చొప్పున ఖాళీలు ఉన్నాయని వివరించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు.

## స్వతంత్ర ఫలాలు అందరికీ అందాలి పంపా చైర్మన్ చందు



శంఖవరం ఆగస్టు 15 ప్రభాతవార్త స్వతంత్ర ఫలాలు అందరికీ అందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని పంపా రిజర్వాయర్ చైర్మన్ బైవర్జుల చందు పేర్కొన్నారు. శంఖవరం మండలంలో గల పంపా రిజర్వాయర్ కార్యాలయం వద్ద 80 స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు పంపా రిజర్వాయర్ చైర్మన్ చందు జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధికి స్థానిక శాసన సభ్యురాలు కృషి చేయడం జరుగుతుందని పంపా ఆయికట్టు ద్వారా రైతులుకి అవసరమైన సాగునీటిని అందించడం జరుగుతుందని అదనపు నీటి జలాల కోసం ఇటీవలే మంత్రిని వినతిపత్రం అందించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పంప రిజర్వాయర్ వైస్ చైర్మన్ నేమాల సుభద్రరావు నీటి సంఘం అధ్యక్షులు నాగం నాగబాబు సోమచక్రం జవ్వలదండు నేమాల నాగేశ్వరరావు టిడిపి యువ నేత వెన్న మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ ఉమా మందేశ్వర(శనీశ్వర)స్వామి వారికి తైలాభిషేకములు స్వామి వారికి రూ2 .95 లక్షల ఆదాయం



కొత్తపేట, ఆగస్టు15,(ప్రభాతవార్త) మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసి యున్న పురాణ ప్రసిద్ధిగాంచిన శ్రీ ఉమా మందేశ్వర (శనేశ్వర) స్వామివారికి శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని తైలాభిషేకములు సర్వదర్శనములు ప్రత్యేక పూజలు భక్తుల నిర్వహించారు ధర్మాదాయ దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అలాగే ఆలయ కార్య నిర్వహణ అధికారి దారపురెడ్డి సురేష్ బాబు భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు స్వామి వారికి పరోక్ష పూజలు ప్రత్యక్ష పూజలు ద్వారా మొత్తం రు 2 లక్షల 95వేల 604 ఆదాయం వచ్చినట్లు ఈవో సురేష్ బాబు తెలిపారు

## అడ్డతీగల మండలంలో 8 అకడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



అడ్డతీగల, ఆగస్టు 15, ప్రభాతవార్త మండల పరిధిలోని పలు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 8 అకడమిక్ ఇన్స్ట్రక్టర్ (ఎస్జీటీ) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి పి. శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు ?10,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని జాజిపాలెం, ఉల్లిగోగుల, డి. కొత్తూరు, నూక రాయి,దొరమామిడి, పింజరికొండ, డి. పోలవరం, చాపరాతిపాలెం ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కో ఖాళీ చొప్పున మొత్తం 8 పోస్టులు అందుబాటులో ఉన్నాయి. అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 16, 2026 నుండి ఆగస్టు 21, 2026 వరకు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆసక్తి గల వారు పూర్తి వివరాల కోసం అడ్డతీగల మండల విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.

**జాతీయ జెండాను ఆవిష్కరించిన ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ.వి. రోహిత్**



అన్నవరం ఆగస్టు 15 (ప్రభాతవార్త) ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో రత్నగిరి కొండపై 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా మరియు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

?ఈ వేడుకల్లో భాగంగా దేవస్థానం అనువంశిక ధర్మకర్త, చైర్మన్ శ్రీ ఐ.వి. రోహిత్ గారు ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం జెండా వందనం సమర్పించారు. దేవస్థానం సాంస్కృతి ఉన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ గీతాన్ని ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని, ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి, ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. దేవస్థానం ప్రత్యేక భద్రతా దళం గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకమండ సభ్యులు, అధికారులు ,సిబ్బంది, హోంగార్డ్స్ , ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు ,వేద పాఠశాల విద్యార్థులు, వ్రత పురోహితులు ,నాయి బ్రాహ్మణులు ,దేవస్థానం హై స్కూల్ విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో విద్యార్థులకు మరియు హాజరైన సిబ్బందికి తీర్థప్రసాదాలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps